

ఈ ఎన్నికల్లో తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ఎర్రచందనం డబ్బులు కీలకపాత్ర పోషిస్తున్నాయి. ఐదేళ్లుగా విచ్చలవిడిగా సాగుతున్న స్మగ్లింగ్‌కు అండగా నిలబడ్డ అధికారపార్టీ నేతలకు నిధులు వరదలా పోగయ్యాయని తెలుస్తోంది. చిత్తూరు, పూతలపట్టు, జీడీనెల్లూరు, చంద్రగిరి, పీలేరు, శ్రీకాళహస్తి, తిరుపతి నియోజకవర్గాల్లో ఓట్ల కోసం పంచుతున్న డబ్బులో అధికభాగం ఎర్రడబ్బే అని ప్రచారం జరుగుతోంది.


- తిరుపతి, ఆంధ్రజ్యోతి

నాడు
టీడీపీ హయాంలో ఉక్కుపాదం

నేడు
వైసీపీ పాలనలో స్మగ్లర్లకు టికెట్లు

ఎన్నికల్లో ఎర్ర డబ్బు

తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో యథేచ్ఛగా ఖర్చు పెడుతున్న వైసీపీ అభ్యర్థులు



చంద్రబాబు పాలనలో

దడదడలాడించిన టాస్క్‌ఫోర్స్

2013లో కాంగ్రెస్ ప్రభుత్వం రెడ్ శాండర్స్ యాంటీ స్మగ్లింగ్ టాస్క్‌ఫోర్స్ పేరిట ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసినా 2014లో చంద్రబాబు సీఎం కాగానే దాన్ని బలోపేతం చేశారు.స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపాలని యంత్రాంగాన్ని ఆదేశించారు. ప్రత్యేక జ్యూరిస్‌డిక్షన్, ప్రత్యేక పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేశారు. బలగాల సంఖ్యను 200కు పెంచి అదనపు ఎస్పీ, డీఎస్పీలను నియమించారు. ఆయుధాలు, వాహనాలు సమకూర్చారు. సీనియర్ ఎస్పీ స్థాయి అధికారిని అధిపతిగా నియమించారు. దీంతో టాస్క్‌ఫోర్స్ కార్యకలాపాలు వేగం పుంజుకున్నాయి. శేషాచలంలో వాచ్‌టవర్లు, చెక్‌పోస్టులు ఏర్పాటయ్యాయి. ఇన్‌ఫార్మర్ వ్యవస్థ పటిష్టమైంది. నిరంతరం కూంబింగ్ ఆపరేషన్లు నిర్వహించారు. 2015 ఏప్రిల్ 7న శేషాచలం అడవుల్లోని చీగటీగల కోనలో టాస్క్‌ఫోర్స్ బలగాలకూ, స్మగ్లర్లకూ నడుమ పోరాటమే జరిగింది. పలువురు సిబ్బంది గాయపడ్డారు. టాస్క్‌ఫోర్స్ కాల్పుల్లో 20మంది తమిళ స్మగ్లర్లు చనిపోయారు. ఈ ఘటనతో తమిళనాడు స్మగ్లర్లు శేషాచలంలోకి అడుగుపెట్టడం ఆగిపోయింది. టాస్క్‌ఫోర్స్ అధికారులు ఎక్కడెక్కడి స్మగ్లర్లనూ అరెస్టు చేశారు.ఆ క్రమంలో అంతర్జాతీయ సంబంధాలు కలిగిన కొమ్ములు తిరిగిన స్మగ్లర్ మార్కొండన్ లక్ష్మణ్‌ను చెన్నైలో అరెస్టు చేయడంతో దేశవ్యాప్తంగా నెట్‌వర్క్ ఛిన్నాభిన్నమైంది.అతడు జైల్లో వుండగా అతడి తరపున ఇంటర్నేషనల్ స్మగ్లింగ్ రాకెట్ నడిపిన లక్ష్మణ్ భార్య మాజీ ఎయిర్ హోస్టెస్, మోడల్ సంగీతా ఛటర్జీతో సహా తమిళనాడు మహిళా స్మగ్లర్ జ్యోతి వంటి వారు సైతం చిత్తూరులో జైలు ఊచలు లెక్కపెట్టాల్సి వచ్చింది. కడప, చిత్తూరు జిల్లాల్లో పాతుకుపోయిన స్మగ్లర్లు రెడ్డి నారాయణ, భాస్కర నాయుడు, మహేష్ నాయుడు, ఎంసీ విజయానందరెడ్డి (ప్రస్తుత చిత్తూరు వైసీపీ అసెంబ్లీ అభ్యర్థి) వంటి వారు కూడా పీడీ యాక్ట్ కింద సెంట్రల్ జైలు పాలయ్యారు. ఈ విషయంలో చంద్రబాబు తన మన అన్న వివక్ష చూపలేదు. చిత్తూరులో టీడీపీ ముఖ్యనేత వసంత నాయుడు సైతం పీడీ యాక్టు కింద అరెస్టయ్యారు.

వైసీపీ ప్రభుత్వంలో

ఎర్ర దొంగలకు పదవులు

2019 ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం రావడంతో పరిస్థితి పూర్తిగా తారుమారైంది. పేరుకు టాస్క్‌ఫోర్స్‌లో సిబ్బంది సంఖ్య 200 నుంచీ 350కి పెరిగినా కార్యకలాపాలు స్తంభించిపోయాయి.ప్రభుత్వం నుంచీ సమీక్ష గానీ, ఒత్తిడి గానీ లేకపోవడంతో టాస్క్‌ఫోర్స్ నామమాత్రమైంది. ఇన్‌ఫార్మర్ల వ్యవస్థ నిర్వీర్యమైంది. కూంబింగ్ ఆపరేషన్లు ఆగిపోయాయి. చెక్‌పోస్టుల్లో తనిఖీల తీవ్రత తగ్గింది. దీంతో ఎర్రచందనం స్మగ్లర్లు కూలీలతో శేషాచలంలోనే శాశ్వతంగా తిష్ట వేశారు. వీరి ధాటికి శేషాచలం అడవుల్లో సరిహద్దుల నుంచీ 20 కిలోమీటర్ల లోపలికి ఎర్రచందనం చెట్టన్నదే కనిపించకుండా పోయింది. అడపాదడపా అడ్డుకునేందుకు యత్నించిన పోలీసు, అటవీ శాఖల సిబ్బందిపై స్మగ్లర్లు దాడులకు దిగుతున్నారు.ఈ ఏడాది ఫిబ్రవరి 6న పీలేరు నియోజకవర్గం కేవీపల్లి మండలంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా స్మగ్లర్లు వాహనంతో ఢీకొట్టగా గణేష్ అనే కానిస్టేబుల్ మరణించాడు. అదే సమయంలో వైసీపీ ముఖ్యనేతల అండదండలతో పీలేరు, చంద్రగిరి, తిరుపతి నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో స్మగ్లర్లు అధికార పార్టీ నేతలుగా ఎదిగారు. పలువురు ప్రజాప్రతినిధులుగా మారారు. ఉదాహరణకు తిరుపతి రూరల్ మండలం సప్తగిరి నగర్ పంచాయతీ ఉపసర్పంచ్‌గా వున్న వైసీపీ నేత అశోక్‌కుమార్ రెడ్డి గతంలో పీడీ యాక్టు కింద అరెస్టయ్యారు.అదే మండలం తిరుమలనగర్ సర్పంచ్‌గా వున్న వైసీపీ నేత శివశంకర్ రాజుపై కూడా గతంలో ఎర్రచందనం అక్రమ రవాణా కేసులు నమోదయ్యాయి. చిత్తూరులో అధికార పార్టీ ఎర్రచందనం స్మగ్లరుగా పీడీ యాక్టు కింద అరెస్టయిన విజయానందరెడ్డికి ప్రస్తుత ఎన్నికల్లో ఏకంగా ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడం దీనికి పరాకాష్ట.



2014లో పీడీ యాక్టు కింద అరెస్టయినప్పుడు చిత్తూరు పోలీసు స్టేషన్‌లో విజయానందరెడ్డి (ప్రస్తుత చిత్తూరు వైసీపీ అభ్యర్థి), భాస్కర నాయుడు, రెడ్డినారాయణ, మహేష్ నాయుడు

అంకెలు చెబుతున్న నిజాలు!

ఏడాది	కేసులు	నిందితులు	దుంగలు	బరువు	వాహనాలు
2015	114	497	2993	78.275 టన్నులు	74
2016	146	482	3425	96.579 టన్నులు	76
2017	103	460	2471	68.204 టన్నులు	38
2018	122	268	1802	50.641 టన్నులు	54
2019	76	140	956	25.167 టన్నులు	37
2020	28	81	668	19.030 టన్నులు	26

గత టీడీపీ ప్రభుత్వంలోనూ, ప్రస్తుత వైసీపీ ప్రభుత్వంలోనూ టాస్క్‌ఫోర్స్ పనితీరు ఎలా వుండేదో కింది అంకెలే చెబుతున్నాయి. 2019 నుంచే టాస్క్‌ఫోర్స్ ప్రభావం నామమాత్రం కావడంతో అప్పటి నుంచీ కేసుల వివరాలు మీడియాకు వెల్లడించడం లేదు. పురోగతి ఏమీ లేదనడానికి అధికారులు పాటిస్తున్న గోప్యతే నిదర్శనం

2014కు మునుపు చిత్తూరు, కడప, కర్నూలు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో ఎర్రచందనం వృక్షాల నరికివేత, అక్రమ రవాణా యథేచ్ఛగా సాగింది. అప్పట్లో కాంగ్రెస్ పార్టీ నేతల అండదండలతో స్మగ్లర్లు రెచ్చిపోయి వ్యవహరించారు. ఆ పార్టీ నేతలకు వాటాలిస్తూ రూ. కోట్లకు పడగలెత్తారు. 2014 తర్వాత ఎర్రచందనం స్మగ్లర్లలో 90శాతం మంది వైసీపీకి అనుకూలంగా మారిపోయారు. అందుకు ప్రధాన కారణం ఎర్రచందనం స్మగ్లింగ్ మీద టీడీపీ ప్రభుత్వం ఉక్కుపాదం మోపడం. పీడీ యాక్ట్, అరెస్టులు పెరగడంతో వీరికి రాజకీయ ఆశ్రయం అవసరమైంది. దాని ప్రభావం 2019 ఎన్నికల్లో కనిపించింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో ఎర్రచందనం స్మగ్లర్లు భారీఎత్తున వైసీపీ గెలుపు కోసం డబ్బు ఖర్చు పెట్టారు. జీడీనెల్లూరులో పార్టీ విజయానికి వంద శాతం ఖర్చు చేసినట్టు ఆరోపణలు వచ్చాయి. అక్కడి అభ్యర్థిగా వుండిన ప్రస్తుత డిప్యూటీ సీఎం నారాయణస్వామితోనూ, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డితోనూ ఎర్రచందనం కేసుల్లో పీడీ యాక్ట్ కింద అరెస్టయిన విజయానందరెడ్డి సన్నిహితంగా మెలిగేవారు. చంద్రగిరి, చిత్తూరు, పీలేరు, తిరుపతి నియోజకవర్గాల్లో కూడా ఎర్రచందనం స్మగ్లర్లే వైసీపీ గెలుపు కోసం ఆర్థికంగా సహకరించారనే ఆరోపణలు అప్పట్లో వచ్చాయి.ప్రస్తుత ఎన్నికల్లో కూడా ఈ నియోజకవర్గాలకు తోడు వెంకటగిరి, శ్రీకాళహస్తిల్లో కూడా ఎర్రచందనం నిధులు అధికార పార్టీకి ప్రధాన ఆర్థిక వనరుగా మారాయన్న ప్రచారం జరుగుతోంది. ఆర్థిక దన్నుగా ఉన్నందునే స్మగ్లర్లు వైసీపీలో నాయకులుగా మారారు. ప్రస్తుతం చిత్తూరు అసెంబ్లీకి విజయానందరెడ్డి వైసీపీ అభ్యర్థిగానే బరిలోకి దిగారు.

జగనన్న పాలన ఘనత

గత హామీల ఊసేది జగన్?

మండే ఎండలో చప్పగా ముగిసిన సీఎం ప్రచార సభ

పుత్తూరు అర్బన్, మే 10: పుత్తూరులో శుక్రవారం మధ్యాహ్నం నిర్వహించిన సీఎం జగన్ సభలో ఆయన ప్రసంగంలోనూ, మంత్రి రోజా ప్రసంగంలోనూ నియోజకవర్గ అభివృద్ధికి ఏమి చేస్తామనే విషయాన్ని స్పష్టం చేయకపోవడంపై వైసీపీ వర్గాలు పెదవి విరుస్తున్నాయి. రోజా తాను ఐదేళ్లలో ఎంతో అభివృద్ధి చేసేశానని చెప్పుకోవడం తప్ప ప్రత్యేకించి ఫలానా అభివృద్ధి చేశాననే అంశాన్ని ప్రస్తావించకపోవడం పట్ల కూడా ఆ పార్టీ వర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. దీంతో పాటు జగన్ తన ప్రసంగంలో గత ఎన్నికల సందర్భంగా ఇదే కూడలిలో నిర్వహించిన సభలో ఇచ్చిన హామీలను కూడా ప్రస్తావించలేదు. గాలేరు-నగరి ప్రాజెక్టులో అంతర్భాగమైన వేణుగోపాల సాగర్ ప్రాజెక్టు పూర్తి చేయడంతో పాటు గాజులమండ్యం షుగర్ ఫ్యాక్టరీని తిరిగి తెరిపిస్తానని గత ఎన్నికల సందర్భంగా పుత్తూరులో జరిగిన సభలో జగన్ వాగ్దానం చేశారు. తిరిగి అధికారంలోకి వస్తే వాటిని నెరవేరుస్తామని కూడా ఆయన చెప్పకపోవడం వైసీపీ వర్గాలనే అసంతృప్తికి గురిచేసింది. సీఎం షెడ్యూల్ ప్రకారం 45 నిమిషాల పాటు ప్రసంగించాల్సి ఉంది. జగన్ ప్రసంగం ప్రారంభంకాగానే ఎండవేడిమికి తాళలేక పలువురు వెనుదిరగడం కనిపించింది. దీంతో ప్రసంగ సమయాన్ని 30నిమిషాల్లోనే పూర్తి చేశారు.



జగన్ అభివాదం

పింఛన్ కట్ బెదిరింపు....

ఇదిలా ఉండగా సీఎం జగన్ సభ విజయవంతానికి వైసీపీ నాయకులు తీవ్ర కసరత్తే చేశారు. వడమాలపేట మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి పింఛన్ కట్ చేస్తామని బెదిరించి మరీ సభకు బలవంతంగా తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. ఇందుకు వలంటీర్లను వినియోగించినట్లు సమాచారం. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో వృద్ధులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు.ట్రాఫిక్ ఆంక్షలు ఉండడంతో సభా ప్రాంగణానికి వచ్చేందుకు కిలోమీటర్ పైన నడవాల్సి వచ్చింది.



ట్రాఫిక్ ఆంక్షలతో ఇబ్బందులు

జగన్ రావడానికి రెండున్నర గంటల ముందు నుంచే పుత్తూరులో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలను అమలు చేశారు. పుత్తూరు పట్టణం కాపువీధి జంక్షన్‌లో సభ పెట్టడంతో చిత్తూరుకు వెళ్లాల్సిన వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అటు చిత్తూరు నుంచి వచ్చేవారు కూడా వినాయకపురం మీదుగా కనకంపాలెం, మిద్దిగుంట రోడ్డు మార్గంలో పుత్తూరుకు రావాల్సి వచ్చింది. 10 నిమిషాల ప్రయాణం గంటన్నర పట్టింది. తిరుపతి-పుత్తూరు మార్గంలో కూడా పోలీసులు ఆంక్షలు పెట్టడంతో వాహనదారులు అగచాట్లు పడ్డారు. బైపాస్‌రోడ్డులోనే బస్సులు, కార్లు నిలిపివేయడంతో పున్నమి సర్కిల్ నుంచి కాలినడకనే పుత్తూరులోకి రావాల్సి వచ్చింది. నగరి నుంచి వచ్చేవారిని కూడా నారాయణవనం బైపాస్ సర్కిల్‌లో నిలిపివేయడంతో ఆటోలపై ఆధారపడాల్సి వచ్చింది. మరోవైపు జగన్ పర్యటన నేపథ్యంలో సభ సమీప ప్రాంతాల్లో దాదాపు గంట సమయం విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. తీవ్రమైన ఎండ వేడితో సమీపంలోని ఇళ్లలో నివసించే ప్రజలు అల్లాడిపోయారు.సీఎం సభలో కొందరు మద్యం మత్తులో ఊగిపోతూ వైసీపీ జెండాలు పట్టుకుని హల్‌చల్ చేశారు.

నిరూపిస్తే వదిలి వెళ్లిపోతాం: రోజా

తన అన్నలు ఎక్కడ దోచుకున్నారో చెబితే ఇక్కడ (నగరి నియోజకవర్గం) నుంచి వదిలి వెళతామని సభలో మంత్రి రోజా సవాల్ విసిరారు.చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, పీసీసీ అధ్యక్షురాలు షర్మిల, గాలి భానుప్రకాష్.. తనను రాజకీయంగా ఎదుర్కొనలేకే ఇలా ఆరోపణలు చేస్తున్నారని అన్నారు.

వైసీపీకి భారీ షాక్


నాని సమక్షంలో టీడీపీలో చేరుతున్న మాజీ జడ్పీటీసీ సుభాషిణి


టీడీపీలో చేరుతున్న వల్లివేడు వాసులు

● పలువురు టీడీపీలో చేరిక

తిరుచానూరు/పాకాల, మే 10: చంద్రగిరి నియోజకవర్గంలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. పలు మండలాలకు చెందిన నేతలు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. తిరుచానూరు సమీపంలోని రఘునాథ్ రిసార్ట్‌లోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సమక్షంలో పలువురు ఆ పార్టీలో చేరారు. అందులో భాగంగా తిరుపతి రూరల్ మండలానికి సంబంధించి మాజీ జడ్పీటీసీ సుభాషిణి, ఎంపీటీసీ సుదాకర్, గంగయ్య, శంకరయ్య తదితరులు పెద్దఎత్తున చేరారు. నెరబైలు పంచాయతీకి చెందిన వైసీపీ వార్డు మెంబర్లు రమణ, కాసర్ల రఘునాథ్‌లు, ఎర్రావారిపాళెం మండలంలోని 5 పంచాయతీలకు చెందిన సిద్ధరామయ్య, వేణు, రమణయ్య, మణి, మొగిలి రమణయ్య, మహేంద్ర, నాగార్జున, పాకాల మండలం వల్లివేడు పంచాయతీ నుంచి 30 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరారు. వి.సతీష్ రెడ్డి, కె.శ్రీధర్ రెడ్డి, కె.మహేష్ రెడ్డి, వి.పురుషోత్తం రెడ్డి, కె.శివారెడ్డి, సి.ఢిల్లీ ప్రసాద్ రెడ్డి, ఎస్.జయప్రకాష్, ఎస్.మోహన్, వి.కిరణ్ కుమార్, టి.ప్రకాష్ బాబు, టి.జిత్తు, టి.హరి బాబు, ఎ.జ్యోతీష్, జి.రెడ్డిప్రసాద్, ఎ.సాయి, ఎ.కృష్ణమూర్తి, పి.అఖిల్ బాబు తదితరులకు పులివర్తి నాని పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో నానీకి అత్యధిక మెజార్టీ తీసుకువచ్చేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు వలపల దశరథ నాయుడు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరిలో నానీని గెలిపించుకుందాం


ప్రచారం చేస్తున్న డాలర్స్ దివాకర్‌రెడ్డి

తిరుపతి రూరల్, మే 10: ఏపీలో టీడీపీ గాలి జోరుగా వీస్తోందని..ఈనెల 13న జరిగే ఎన్నికల్లో విజయ ప్రభంజనం సృష్టించి చరిత్ర తిరగరాయనుందని ఆ పార్టీ రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి డాలర్స్ దివాకర్‌రెడ్డి పేర్కొన్నారు. చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని గెలుపుకోసం తిరుపతి రూరల్ మండలంలోని పెరుమాళ్లపల్లె పంచాయతీపరిధిలో శుక్రవారం ఆయన ప్రచారం నిర్వహించారు. స్వగ్రామంలో దివాకర్‌రెడ్డికి మద్దతుగా ప్రజలు పెద్దఎత్తున పాల్గొని పూలమాలలతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. ఇంటింటికీ తిరిగి సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ.. కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, కత్తి సుధా, రఘునాథ రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, కిశోర్, నిరంజన్, చంద్రమౌళి, గురు సాకేత్, వివేక్‌రెడ్డి, రోహిత్, కత్తి వెంకి, కుమార్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి


ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న మురళి

భాకరాపేట, మే 10: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మండల పార్టీ అధ్యక్షుడు బెల్లంకొండ మురళి అన్నారు. చిన్నగొట్టిగల్లు మండలం దిగవూరు పంచాయతీలో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించి, ఈవీఎంలపై అవగాహన కల్పించారు. జరగబోయే ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. టీడీపీ నాయకులు రమేశ్, వెంకటనాగులురెడ్డి, అప్పరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు మహిళల ఇంటింటా ప్రచారం


కె.వడ్డేపల్లెలో తెలుగు మహిళల ప్రచారం

పాకాల, మే 10: మండలంలోని కె.వడ్డేపల్లె, కావలి వారిపల్లె, అగ్రహారం పంచాయతీల పరిధిలో శుక్రవారం చంద్రగిరి నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు కె.సావిత్రి ఆధ్వర్యంలో తెలుగు మహిళలు ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దొనకొంగ గంగమ్మ తల్లికి పొంగళ్లు పెట్టి పూజలు చేశారు. 12 గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి మహిళలకోసం టీడీపీ అమలు చేయనున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, పులివర్తి నానీని ఎమ్మెల్యేగా, దగ్గుమళ్ల ప్రసాదరావును ఎంపీగా గెలిపించాలని అభ్యర్థించారు. తెలుగు మహిళలు సుశీల, మమత, పుష్పావతి, లక్ష్మీకళావతి, బుజ్జి, ఉష తదితరులు పాల్గొన్నారు.

జోరుగా టీడీపీ ఎన్నికల ప్రచారం


నెన్నూరులో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న మధుసూదన్‌రెడ్డి

రామచంద్రాపురం, మే 10: మండలంలోని రామాపురం, నెన్నూరు, కమ్మకండ్రిగ, అనుపల్లె, రామానాయుడుకండ్రిగ, రాయలచెరువుపేట గ్రామాల్లో టీడీపీ నాయకులు శుక్రవారం పులివర్తి నానీని గెలిపించాలంటూ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలను వివరించి, సైకిల్ గుర్తుకుఓటు వేయాలని కోరారు. మండల టీడీపీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి, జనార్దన్‌చౌదరి, నరసింహారెడ్డి, హరిప్రసాద్, ఉమాపతి నాయుడు, జేడీజగన్, ప్రసాద నాయుడు, జయచంద్ర నాయుడు, ఢిల్లీనాథరెడ్డి, ధనంజయరెడ్డి, సుబ్రహ్మణ్యంయాదవ్, నాదమునియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మంగళంలో...



మంగళం, మే 10: మంగళం పరిధిలోని టీడీపీ శ్రేణులు తిరుమలనగర్, మంగళం క్వార్టర్స్, సప్తగిరి కాలనీ, రణధీరపురం పంచాయతీల్లో శుక్రవారం చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానీని గెలిపించాలని విస్తృతంగా ప్రచారం చేశారు. సూపర్‌సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నరసింగాపురంలో...



చంద్రగిరి, మే 10: మండలంలోని నరసింగాపురం పంచాయతీలో టీడీపీ ఇన్‌చార్జ్ నాగరాజ నాయుడు ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా టీడీపీ మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానీని గెలిపిస్తే రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గం అభివృద్ధి చేస్తారని తెలిపారు. మురళీధర్, అమ్మగుంట నరేష్, శ్రీను, వేణు, పురుషోత్తం, కిరణ్‌కుమార్, గోపాలకృష్ణ, సతీష్, గురుమూర్తి, విజయ్, మురళి, రమేష్, సుమన్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పాలనలోనే యువతకు ఉపాధి


మాట్లాడుతున్న సురేష్ చౌదరి

పాకాల, మే 10: తెలుగుదేశం పార్టీ పాలనలోనే యువతకు మెరుగైన ఉపాధి సాధ్యమని చంద్రగిరి నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు కె.సురేష్ చౌదరి అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. చంద్రగిరి నియోజకవర్గ యువతకోసం ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని ప్రత్యేక మ్యానిఫెస్టో ప్రకటించారన్నారు. నియోజకవర్గంలో 10 వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించడానికి చర్యలు చేపడుతామని అన్నారు. తెలుగుయువత పులివర్తి నానీని ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. తెలుగు యువత నాయకులు రెడ్డిప్రసాద్, వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం


అన్నదానం చేస్తున్న దాత శివప్రసాద్ రెడ్డి

భాకరాపేట, మే 10: చిన్నగొట్టిగల్లులో జడ్పీ మాజీ చైర్మన్ వలసారెడ్డి సిద్దరామిరెడ్డి జ్ఞాపకార్థం పలువురు పేదలకు శుక్రవారం వలసారెడ్డి శివప్రసాద్‌రెడ్డి అన్నదానం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

చంద్రగిరి

తిరుచ్చిపై పద్మావతి దేవి అభయం



తిరుచానూరు, మే 10: తిరుచానూరులో కొలువైన పద్మావతి అమ్మవారు శుక్రవారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై కొలువుదీరి తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఉదయం కల్యాణోత్సవం, లక్ష్మీపూజ వేడుకగా జరిగింది. మధ్యాహ్నం అమ్మవారి ఉత్సవమూర్తిని ఫ్రైడేగార్డెన్‌కు వేంచేపు చేసి వేడుకగా అర్చకులు తిరుమంజనం నిర్వహించారు. అలంకార శోభితురాలైన పద్మావతిదేవికి తిరువీధి ఉత్సవం వేడుకగా జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ మధు, చంద్రశేఖర్, శేషగిరి, ప్రసాద్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గణేష్, సుభాస్కర్ నాయుడు, అశోక్ పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయానికి రెండు వెండి పళ్లేల కానుక



తిరుచానూరు, మే 10: తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి ఆలయానికి ఉత్తరప్రదేశ్‌కు చెందిన కీర్తిమాన్ పాండే రూ.లక్ష విలువ చేసే రెండు వెండి హారతిపళ్లేలను కానుకగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ శేషగిరి, అర్చకుడు బాబుస్వామి పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా మహాలక్ష్మి హోమం


పూర్ణాహుతి సమర్పిస్తున్న దృశ్యం

రామచంద్రాపురం, మే 10: అక్షయ తృతీయ సందర్భంగా రాయలచెరువుకట్ట భవానీ జలకంఠేశ్వరాలయం వద్ద శుక్రవారం మహాలక్ష్మి హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహాలక్ష్మి అమ్మవారికి తిరుమంజనం నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేపట్టారు. ఉదయం 9గంటలకు వేదమంత్రోచ్చరణల మధ్య హోమం నిర్వహించి, 12గంటలకు పూర్ణాహుతితో ముగించారు. అలాగే రాయలచెరువుకట్ట శ్రీశక్తి పీఠంలో కుబేర మహాలక్ష్మి హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతి స్వామి, శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతి స్వామి, భాస్కర్ నాయుడు దంపతులు, మురళీకృష్ణ దంపతులు పాల్గొన్నారు.

తిరుచ్చిపై దర్శనమిచ్చిన శ్రీకృష్ణుడు



చంద్రగిరి, మే 10: శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై రుక్మిణిసత్యభామ సమేత శ్రీకృష్ణుడు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లకు కల్యాణోత్సవం నిర్వహించారు. రోహిణి నక్షత్రం సందర్భంగా సాయంత్రం ఆలయ ఆవరణలో స్వామిఅమ్మవార్ల ఉత్సవర్లకు ఊంజల్ సేవను కన్నులపండువగా నిర్వహించారు. ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, మునిచెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు బాలాజీరంగాచా ర్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, పార్థసారధి, జమేదార్ చిరంజీవి పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహిద్దాం

రామచంద్రాపురం, మే 10: పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అలజడి లేకుండా ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహిద్దామని ఎన్నికల అధికారి ఉషారాణి కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ భవనంలో ఎన్నికల సిబ్బందితో శుక్రవారం సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లపై సమీక్షించి, ఎన్నికల రోజున తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎంపీడీవో ప్రత్యూష, ఎస్ఐ చిరంజీవి, బీఎల్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

మంగళం క్వార్టర్స్‌లో ఆగని వెలుగులు


రాత్రి పగలు తేడా లేకుండా వెలుగుతున్న విద్యుత్ దీపాలు

మంగళం, మే 10: మంగళం క్వార్టర్స్‌లో వీధి దీపాలు నిరంతరాయంగా వెలుగుతూనే ఉన్నాయి. అసలే ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీ నుంచి విడిపోయిన పంచాయతీలకు ఆదాయం అంతంత మాత్రంగా ఉన్న పరిస్థితుల్లో వీధి దీపాలు పగలూ, రాత్రి తేడా వెలుగుతూనే ఉన్నాయి. దీనిపై పంచాయతీ సిబ్బందిని వివరణ కోరగా, విద్యుత్‌శాఖ అధికారులు లైన్లను మార్చే క్రమంలో ఆపు చేయడానికి వైరు ఏర్పాటు చేయకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని చెప్పారు.

విద్యుత్ క్రీడాకారులకు అభినందనలు


విజేతలను అభినందిస్తున్న ఎం.కృష్ణారెడ్డి, వాసుదేవరెడ్డి

తిరుపతి(ఆటోనగర్), మే 10: రాష్ట్ర స్థాయిలో విద్యుత్‌శాఖ నిర్వహించిన వివిధ క్రీడలు, సాంస్కృతిక పోటీల్లో తిరుపతి సర్కిల్ జట్టు ఓవరాల్ ఛాంపియన్ స్థానం సాధించడం అభినందనీయమని స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రెసిడెంట్, జనరల్ సెక్రటరీ ఎం.కృష్ణారెడ్డి, వాసుదేవరెడ్డి ప్రశంసించారు. శుక్రవారం స్థానిక ఎస్ఈ కార్యాలయంలో క్రీడాకారులు అధికారులను కలసి క్రీడల్లో సాధించిన విజయాలను వివరించారు. క్రీడాకారులను పేరు పేరున అభినందించారు. ఈ కార్యక్రమంలో కల్చరల్, స్పోర్ట్స్ కార్యదర్శులు జయచంద్ర, పురుషోత్తం, కోశాధికారి లీలారాం, ట్రోఫీలు సాధించిన ఉద్యోగులు పాల్గొన్నారు.

అన్నదానం

తిరుపతి అర్బన్, మే 10: గత కొద్ది రోజులుగా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రచారంలో పాల్గొన్న కార్యకర్తలకు శరత్‌యాదవ్ శుక్రవారం నగరంలోని పలు వీధుల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పులుగోరు మురళీకృష్ణ, గూట శరత్‌చౌదరి, హేమంత్‌యాదవ్, రమణయాదవ్, రామకృష్ణారెడ్డి, భారతీ, సురేష్‌యాదవ్ పాల్గొన్నారు.

కష్టసుఖాల్లో తోడుంటా

● మీ సమస్యలన్నీ పరిష్కరిస్తా
● టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని


పద్మావతిపురం సమావేశంలో పాల్గొన్న పులివర్తి నాని తదితరులు

తిరుచానూరు, మే 10: చంద్రగిరినియోజకవర్గ ప్రజల కష్టసుఖాల్లో తోడుగా ఉంటానని, సమస్యల పరిష్కారానికి ముందుంటానని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని అన్నారు. శుక్రవారం తిరుపతి రూరల్ మండలం పద్మావతిపురం పంచాయతీలో టీడీపీ నాయకులు రవి, గణపతి నాయుడు ఆధ్వర్యంలో బహిరంగసభ జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన పులివర్తి నాని మాట్లాడుతూ స్థానికుల ఆవేదన అర్థం అవుతోందన్నారు. గణపతి నాయుడు తనతో ప్రయాణిస్తాడని ఊహించలేదని, అలాంటి వ్యక్తి టీడీపీలోకి వచ్చాడంటే వైసీపీ నేతలు ఎన్ని ఇబ్బందులు పడి ఉంటారో అర్థం చేసుకోవచ్చని తెలిపారు. ఇక్కడ నెలకొన్న తాగునీరు, రేషన్ పంపిణీ, కాలువలు శుభ్రం చేయకపోవడం తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి, ఆయన అనుచరులు గంజాయి వ్యాపారాన్ని ఆరు మండలాల్లో విస్తరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రగిరిలో ఒక పరిశ్రమ, ఒక ఉద్యోగం కల్పించలేకపోయారన్నారు. యువతకు వలంటీరు ఉద్యోగాలు మాత్రమే ఇచ్చారన్నారు. ఓటు ద్వారా తీర్పు చెప్పాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 13వ తేదీన వరుస సంఖ్య 2.. సైకిల్‌గుర్తుపై ఓటు వేయాలని పులివర్తి నాని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుబ్రహ్మణ్యం నాయుడు, వాణిగౌడ్, మహేశ్వరి, కిలారి వెంకటేష్, మోహన్ చౌదరి పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలను రెగ్యులరైజ్ చేసే బాధ్యత తీసుకుంటా


తిరుచానూరులో మాట్లాడుతున్న ప్రజలకు అభివాదం చేస్తున్న దగ్గుమళ్ల ప్రసాదరావు, పులివర్తి నాని తదితరులు

తిరుచానూరు పంచాయతీలో చైతన్యపురం, అంబేడ్కర్ కాలనీ తదితర ప్రాంతాల్లో పేదలు నిర్మించుకున్న ఇళ్ల పట్టాలను రెగ్యులరైజ్ చేస్తానని పులివర్తి నాని అన్నారు. శుక్రవారం తిరుచానూరులో నిర్వహించిన టీడీపీ బహిరంగ సభకు ముఖ్యఅతిథులుగా పులివర్తి నాని, చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు, చిత్తూరు టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, సీనియర్ నేత మబ్బు దేవనారాయణరెడ్డి, జనసేన ఇన్‌ఛార్జి దేవర మనోహర్ హాజరయ్యారు. ఈసందర్భంగా నాని మాట్లాడుతూ గల్లా అరుణకుమారి హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప తరువాత జరిగిందేమిలేదన్నారు. తిరుచానూరులో ప్రజలు తమ సమస్యలను చెప్పుకుని కన్నీటి పర్యంతమయ్యారన్నారు. నెలరోజుల్లో కబ్జాలకు గురైన భూములను స్వాధీనం చేసుకుని.. బాధితులకు న్యాయం చేస్తామన్నారు. 4 సంవత్సరాల 11 నెలల తరువాత చెవిరెడ్డి వచ్చి మాయ మాటలు చెప్పి లబ్ధి పొందాలని చూస్తున్నాడన్నారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గంలో వనరులకు కొదవ లేని, పారిశ్రామిక రంగాన్ని పెంపొందించేందుకు అనువైన ప్రాంతమని చెప్పారు. పరిశ్రమలను తీసుకువచ్చి నిరుద్యోగ సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. ఎన్డీయే కూటమి అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు మధు, కిషోర్‌రెడ్డి, సాల్మన్‌రాజు, సాయి రాయల్, మునిరత్నం, శివ, హరేరామ్ తదితరులు పాల్గొన్నారు.

మల్లంగుంట అభివృద్ధి నా బాధ్యత!


మాట్లాడుతున్న నాని, పక్కన మునికృష్ణా రెడ్డి తదితరులు

తిరుపతి రూరల్: మల్లంగుంట పంచాయతీ అభివృద్ధి నా బాధ్యత అని చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని పేర్కొన్నారు. తిరుపతి రూరల్ మండలంలోని మల్లంగుంటలో శుక్రవారం టీడీపీ నేతలు మునికృష్ణారెడ్డి, పొట్టేలు మునస్వామియాదవ్, దిలీప్‌యాదవ్, ఆదినారాయణ, నాగేశ్వరరావు, అమీర్‌ఖర్, ధనంజయరెడ్డి ఆధ్వర్యంలో బహిరంగ సభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న నాని మాట్లాడుతూ.. తనకు ఒక్క అవకాశం ఇస్తే వెనుకబడిన చంద్రగిరి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. మే 13వ తేదీన జరుగనున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.

కూటమితోనే మాదిగల రాజకీయ, ఆర్థికాభివృద్ధి


తొండవాడలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చంద్రగిరి, మే 10: దేశంలో, రాష్ట్రంలో కూటమి గెలుపుతోనే మాదిగలు ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందుతారని ఎమ్మార్పీఎస్ నేత గోపిమాదిగ అన్నారు. శుక్రవారం మండలంలోని తొండవాడ హరిజనవాడల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటా విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దళితులు అభివృద్ధి చెందాలంటే రాష్ట్రంలో చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. ఎన్డీయే అధికారంలోకి రాగానే ఎస్సీ వర్గీకరణ జరుగుతుందన్నారు. చంద్రగిరిలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానీని, చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావులను గెలిపించాలని కోరారు. ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రసాద్, జగదీష్, భాను, జ్ఞానశేఖర్, శివ, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమందలో ఎమ్మార్పీఎస్ ప్రచారం



ఎర్రావారిపాలెం, మే 10: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి ఎమ్మార్పీఎస్ కృషి చేస్తుందని ఆ సమితి నాయకుడు నాగరాజ తెలిపారు. శుక్రవారం ఎల్లమంద పంచాయతీలో ఎమ్మార్పీఎస్ శ్రేణులు ఇంటింటా ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్డీయే గెలుపు ఎమ్మార్పీఎస్ గెలుపని అన్నారు. జగన్ పాలనలో దళితులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. మాదిగలందరూ టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీని సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపి, రమణ, సిద్దయ్య, ప్రసాద్, రామచంద్ర, రెడ్డెప్ప, సురేష్, భాను, నాగార్జున, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు టైలరింగ్‌పై ఉచిత శిక్షణ

చంద్రగిరి, మే 10: చంద్రగిరి పట్టణంలోని ద్వారకానగర్‌లోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈనెల 14వ తేదీ నుంచి 30 రోజుల పాటు మహిళలకు టైలరింగ్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆసంస్థ డైరెక్టర్ సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లాలో గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన నిరుద్యోగ మహిళలు ఈ శిక్షణకు అర్హులని తెలిపారు. శిక్షణకు దరఖాస్తు చేసుకొనేవారు కనీసం పదోతరగతి చదివి ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సంస్థ ఫోన్ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. శిక్షణ సమయంలో శిక్షణార్థులకు ఉచిత భోజనం సౌకర్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ధ్రువపత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఒక బ్యాచ్‌కు 25 నుంచి 30 మంది మాత్రమే ఎంపిక చేయనున్నారు. ముందుగా పేర్లు నమోదు చేసుకున్న వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఉచితంగా శిక్షణ పొందాలనుకొనే అభ్యర్థులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు, 4 పాస్‌పోర్టు సైజు ఫొటోలతో సంస్థకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 79896 80587, 94949 51289 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ఎన్నికల విధుల్లో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ సేవలు

తిరుపతి(నేరవిభాగం), మే 10: ఎన్నికల్లో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సేవలను వినియోగించుకోనున్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఓటర్లకు సహాయకులుగా వుండేందుకు వీరిని నియమించుకోవడానికి ఎన్నికల సంఘం నిర్ణయించినట్లు అధికారులు చెప్పారు. కేంద్రాల వద్దకు వచ్చే ఓటర్లలో ప్రత్యేకమైన సాయం కావాల్సిన వారి కోసమే వీరి సేవలను వినియోగించుకుంటారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో పలు కళాశాలలకు చెందిన ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులను ఎంపిక చేశారు.

ఘనంగా ప్రపంచ లూపస్ దినోత్సవం

తిరుపతి అర్బన్, మే 10: ప్రపంచ లూపస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక అర్బన్‌హాట్ శిల్పారామంలో వాకర్స్ ర్యాలీ నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ ఈ వ్యాధి ముఖ్యంగా మహిళలకు వస్తుందని, సెలబ్రిటీస్‌కి, బ్యూరోక్రాట్స్‌కు కూడా వచ్చిందని, దాంతో వృత్తిని వదిలేసి వైద్యం చేయించుకుంటున్నారన్నారు. వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పి.సి.రాయలు, డాక్టర్ రెడ్డెప్ప, రమణ దంపతులు, ఉమాపతి నాయుడు, తదితర సభ్యులు పాల్గొన్నారు.

తిరుపతిలో 34 రూట్‌లకు సెక్టార్ అధికారుల నియామకం

తిరుపతి(నేరవిభాగం), మే 10: ఈ నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించడానికి వీలుగా జిల్లా ఎస్పీ కృష్ణకాంత్‌పటేల్ ఆదేశాల మేరకు తిరుపతి నియోజకవర్గ నోడల్ అధికారి, డీఎస్పీ సురేంద్రరెడ్డి నియోజకవర్గాన్ని 34 రూట్లుగా విభజించారు. ఒక్కో రూటుకు ఒక సెక్టోరల్ అధికారిని నియమించారు. వీరికి సహాయంగా ఇద్దరు సిబ్బంది ఉంటారు. తిరుపతి నియోజకవర్గంలోని తిరుమలతో పాటు తిరుపతిలోని 274 పోలింగ్ కేంద్రాలను వివిధ సెక్టార్లుగా విభజించారు. దాదాపు 5 నుంచి 8 బూత్‌లను కలిపి ఒక సెక్టార్‌గా ఏర్పాటు చేశారు. వీరు గత రెండు రోజుల వ్యవధిలో వారివారి పరిధిలోని బూత్‌ల్లో వున్న ట్రబుల్ మాంగర్స్, రౌడీలు, గత ఎన్నికల్లో అలజడులు, ఘర్షణలు, బ్యాలెట్ పత్రాల అపహరణకు పాల్పడిన వారు, తదితర నేరగాళ్లపై దృష్టి కేంద్రీకరించారు. వీరు ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా చర్యలు తీసుకుంటారు. అలాగే రెవెన్యూ పరిధిలోనూ 34 రూట్‌లు ఏర్పాటు చేసి, ఒక్కో రూటుకు ఒక రూటు అధికారిని నియమిస్తూ ఎన్నికల అధికారి ఆదేశాలు జారీ చేశారు.

రోజా ఓటమి ఖాయం: భానుప్రకాష్


మాట్లాడుతున్న గాలి భానుప్రకాష్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 10: ఎన్నికల్లో రోజా ఓటమి ఖాయమని నగరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నగరికి సీఎం జగన్ ఎందుకు వచ్చారో వైసీపీ శ్రేణులకు కూడా అర్థం కావడం లేదన్నారు. వెయ్యి మందితో జగన్ ఎన్నికల సభ నగరిలో చాలా చప్పగా సాగిందని ఎద్దేవా చేశారు. దీంతో నగరిలో రోజా ఓటమి ఖాయమని స్పష్టమైందని అన్నారు. గతంలో నియోజకవర్గ ప్రజలకు జగన్, రోజా ఇచ్చిన హామీలకే దిక్కు లేదనీ, కొత్తగా హామీలు ఇవ్వడం ఎందుకని ఆయన ప్రశ్నించారు. తనకు ఎర్రచందనం స్మగ్లర్లతో సంబంధం ఉందనేది పచ్చి అబద్ధమని కొట్టి పడేశారు. తన తండ్రి గాలి ముద్దుకృష్ణమ నాయుడు అటవీశాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఎర్రచందనం పెంచిన ఘనత తమ కుటుంబానిదని తెలిపారు. వైసీపీ నాయకులే రాష్ట్రంలో ఎర్రచందనం స్మగ్లర్లుగా పేరు మోశారని ఆరోపించారు. రోజా, కుటుంబ సభ్యుల అవినీతి అక్రమాల గురించి నగరిలో చిన్న పిల్లలను అడిగినా చెబుతారని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధిని రోజా గాలికి వదిలి పెట్టారని, అందుకే ఆమెను గెలిపించడానికి తాము సిద్ధంగా లేమని ప్రజలు జగన్ సభకు రాకుండా స్పష్టం చేశారని ఎద్దేవా చేశారు. ఈ దఫా నగరిలో టీడీపీ జెండా ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. తాను గెలిచాక నగరి నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని గాలి భానుప్రకాష్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. నగరి - చెన్నై పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు ద్వారా యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు కృషి చేస్తాని స్పష్టం చేశారు.

ఐఐటీ, నీట్ పరీక్షల ఫిజిక్స్ పుస్తకం ఆవిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ దేవప్రసాదరాజు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 10: ఐఐటీ, నీట్ పరీక్షలకు ప్రిపేరయ్యే విద్యార్థులకు ఫిజిక్స్ అవగాహన కోసం రూపొందించిన పుస్తకాన్ని ఎస్వీయూ ఫిజిక్స్ విభాగ ప్రొఫెసర్ బి.దేవప్రసాద రాజు ఆవిష్కరించారు. ఎస్వీయూనివర్సిటీలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రొఫెసర్ దేవప్రసాదరాజు మాట్లాడుతూ.. ఐఐటీ, నీట్ అడ్వాన్స్, మెయిన్స్ పరీక్షల కోసం చదువుకుంటున్న విద్యార్థులకు ఫిజిక్స్ సంబంధించిన గొప్ప అవగాహనను ఈ పుస్తకం అందిస్తుందన్నారు. ఈ పుస్తకాన్ని రాసిన రచయిత అశోక్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విజయ్ శేఖర్, ప్రొఫెసర్ కుసుమ హరనాథ్, ప్రొఫెసర్ కుమారస్వామి, ప్రొఫెసర్ ఉమామహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

వైసీపీకి 30 సీట్లు కూడా వచ్చే పరిస్థితి లేదు: చింతా మోహన్


ప్రచారం చేస్తున్న చింతా మోహన్

తిరుపతి(కపిలతీర్థం), ఏప్రిల్ 10: రాష్ట్రంలో జగన్ పతనం ప్రారంభమైందని.. వైసీపీకి 30 సీట్లు కూడా వచ్చే పరిస్థితిలేదని తిరుపతి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చింతా మోహన్ ఎద్దేవా చేశారు. నగరంలోని పాత మున్సిపల్ కార్యాలయం, తిలక్‌రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఆయన శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జగన్‌కు సొంత ఇంట్లోనే తీవ్ర వ్యతిరేకత ఉందని.. ఇక రాష్ట్రంలో ఆయనపై ఉన్న వ్యతిరేకతను గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేసి తనను గెలిపించాలని ఆయన కోరారు. నగర కాంగ్రెస్ అధ్యక్షుడు యార్లపల్లి గోపి, నేతలు వెంకటేష్ గౌడ్, శాంతి యాదవ్, మునిశోభ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ గెలిస్తే అన్యాయానిదే రాజ్యం

- టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దినకరన్



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 10: రాష్ట్రంలో వైసీపీ మళ్లీ అధికారాన్ని చేపడితే అన్యాయమే రాజ్యమేలుతుందని టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దినకరన్ పేర్కొన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను వైసీపీ తనకు అనుకూలంగా మార్చుకొని అమలు చేసేందుకు కుట్ర చేస్తోందన్నారు. ఈ యాక్ట్ అమలు చేస్తే భూ రికార్డులు తారుమారు అయ్యే ప్రమాదం ఉందని, తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయనున్నట్టు తెలిపారు. తిరుపతిలో కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు వెంకటరమణ, మనోహర్, తులసీదాసు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్ష కార్యకర్తలను వేధిస్తే తీవ్ర చర్యలు

- సిటిజన్ ఫర్ డెమోక్రసీ సభ్యుడు రఘు పేర్వేల

తిరుపతి(నేరవిభాగం), మే 10: పోలీసు అధికారులు, పోలీసులు ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలపై అనుసరిస్తున్న ధోరణి చట్టవిరుద్ధమని సిటిజన్ ఫర్ డెమోక్రసీ సభ్యుడు రఘు పేరేల శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధానంగా ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలను కేసుల పేరుతో పిలిచి విచారించి వేధించడం హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ఉల్లంఘించడమేనని అన్నారు. పౌరులెవ్వరూ పోలీసుల అక్రమ మౌఖిక ఉత్తర్వులను లెక్కపెట్టవద్దని ఆయన విజ్ఞప్తి చేసారు. అలాంటి కేసులు, పోలీసుల వేధింపులు వుంటే తక్షణం ఏపీ ఎలక్షన్ వాచ్ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

రామానుజ అవతార ఉత్సవాలు ప్రారంభం


ప్రసంగిస్తున్న రంగరాజన్

తిరుపతి(కల్చరల్), మే 10: శ్రీవైష్ణవ సంప్రదాయంలో భగవంతుడితో సమానంగా భాగవతులకు కూడా గౌరవం ఉంటుందని, అదే విధంగా రామానుజులు పూజింపబడుతున్నారని డాక్టర్ చక్రవర్తి రంగరాజన్ అన్నారు. శుక్రవారం టీటీడీ, ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో భగవద్ రామానుజాచార్య అవతార మహోత్సవాలు మొదలయ్యాయి. అన్నమాచార్య ప్రాజక్టు అధికారి కోకిల, డీపీపీ అధికారి పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం 6 గంటలకు అహోబిలానికి చెందిన కె. సేతురామన్ ప్రసంగం ఉంటుంది. తరువాత కె. చంద్రశేఖర్ హరికథా గానం ఉంటుంది.

తిరుపతి

తిరుమలేశుడి సేవలో రాజస్థాన్ సీఎం


భజన్‌లాల్ శర్మ

తిరుమల, మే 10 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వేకువజామున జరిగిన అభిషేక సేవలో ఆయన కుటుంబ సమేతంగా పాల్గొని, మూలవిరాట్టును దర్శించుకున్నారు. అనంతరం వీరికి వేద పండితులు ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

ఆరణి గెలుపు కోసం..

నమూనా బ్యాలెట్‌తో పులుగోరు మురళి ప్రచారం


నమూనా బ్యాలెట్‌తో ప్రచారం నిర్వహిస్తున్న పులుగోరు మురళి, ఆరణి మదన్ తదితరులు

తిరుపతి, మే 10 (ఆంధ్రజ్యోతి): టౌన్ బ్యాంక్ మాజీ చైర్మన్ పులుగోరు మురళీకృష్ణా రెడ్డి ఆధ్వర్యంలో జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు కుమారుడు మదన్‌తోపాటు జబ్బార్ లేఅవుట్, నవాబ్‌పేట చెందిన 150 మంది ముస్లిం సోదరులు శుక్రవారం స్థానిక 26 డివిజన్లో నమూనా బ్యాలెట్‌తో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. భూమన కుటుంబం తమను తీవ్రంగా అవమానించిందని ఈ సందర్భంగా ముస్లిం సోదరులు వాపోయారు గాజు గ్లాసు గుర్తుకే తమ ఓటు అని 3వ నెంబర్లోని గుర్తుపై నొక్కి మరీ చెప్పారు. ముస్లిం మైనారిటీ నేత మహబూబ్ బాషా, ఎస్వీఎం వెంకటేష్, గెంజి సుధాకర్ రెడ్డి, మని, హర్షద్ అక్బర్, అబ్దుల్ మున్నా, అస్రుద్దీన్, ముబార్, అబ్దుల్ పాల్గొన్నారు.

'ఎన్డీఏ కూటమి' గెలుపుతోనే అభివృద్ధి

టీడీపీ నాయకుడు భువన్‌కుమార్‌రెడ్డి


16వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న భువన్‌కుమార్‌రెడ్డి, కృష్ణయాదవ్

తిరుపతి (జీవకోన), మే 10: ఎన్డీఏ కూటమి అభ్యర్థుల గెలుపుతోనే అభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకుడు, తిరుపతి కోఆపరేటివ్ టౌన్‌బ్యాంకు మాజీ డైరెక్టర్ భువన్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. 16వ డివిజన్‌లోని ఎస్‌బీఐకాలనీ, యాదవకాలనీ, దాసరి మఠంలో శుక్రవారం ఇంటింటికి వెళ్లి ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆరణి శ్రీనివాసులుకు వరుస నెంబరు 3, గాజు గ్లాసు గుర్తుపై, ఎంపీ అభ్యర్థి వరప్రసాద్‌రావుకు కమలం గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్‌నాయకులు బి.జి.కృష్ణయాదవ్, ఆనంద్‌యాదవ్, రమేష్‌యాదవ్, స్థానిక నాయకులు మునస్వామి, మహేష్, హేమలత, భారతి, పార్వతి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గాజు గ్లాసు గుర్తుపై ఓటేయండి

ఆరణి శ్రీనివాసులును గెలిపించుకుందాం

నెహ్రూనగర్‌లో ఊకా విజయ్ ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న ఊకా విజయ్ కుమార్

తిరుపతి, మే 10 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ కూటమి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులును గెలిపించుకుందామని, దీనికోసం గాజు గ్లాసు (సీరియల్ నెంబరు 3)పై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లకు టీడీపీ సీనియర్ నేత ఊకా విజయ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నెహ్రూ నగర్‌లో ముస్లిం సోదరుల దగ్గరకెళ్లి శుక్రవారం ఆయన విస్తృతంగా ప్రచారం చేపట్టారు. ఈకార్యక్రమంలో డివిజన్ నాయకులు యాదవ కృష్ణ, జంగం శ్రీనివాసులు, జాఫర్, ఖాదర్ బాషా, మునికృష్ణ, అనిల్ పాల్గొన్నారు.

ఎన్డీఏ కూటమి గెలుపుతోనే యువతకు భవిత

'వైసీపీ విద్యాదీవెన'తోనే విద్యార్థులకు కష్టాలు - యువతను గంజాయి, డ్రగ్స్‌కి బానిసలు చేసిన యువనేత

తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు



విద్యార్థులు, యువత గొంతుక రవి నాయుడు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు స్ఫూర్తితో ఎస్వీయూలో చదువుకుంటూనే టీఎన్ఎస్ఎఫ్ నాయకుడిగా అనేక ఉద్యమాలు చేపట్టారు. విద్యార్థి నాయకుడి నుంచి తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎదిగారు. లోకేశ్ యువగళం పాదయాత్ర సమయంలో వలంటీర్లకు కో-ఆర్డినేటర్‌గా సమర్థవంతంగా పనిచేసి శెభాష్ అనిపించుకున్నారు. విద్యార్థి, యువత భవితను ఛిద్రం చేసిన వైసీపీ పాలనపై వినూత్న రీతిల్లో ఎండగట్టారు. ఎన్డీఏ కూటమితోనే యువతకు బంగారు భవిష్యత్తు అంటున్న రవినాయుడితో ఆంధ్రజ్యోతి ఫటాఫట్ ఇంటర్వ్యూ..

ఫటాఫట్ !

? తిరుపతి విద్యా కేంద్రం కదా.. ఇక్కడ చదువుకున్న వారికి ఉద్యోగాలు వచ్చే పరిస్థితి ఉందా

! తిరుపతి కేంద్రంగా 2014-19లో చంద్రబాబు నాయుడు, లోకేశ్‌లు పారిశ్రామికవేత్తలను ఒప్పించి పదుల సంఖ్యలో పరిశ్రమలు తీసుకుని రావడం జరిగింది. ఇక్కడ చదువుకున్న వారికి ఇక్కడే ఉద్యోగాలు లభించేవి. జగన్ రెడ్డి వచ్చాక కొత్త పరిశ్రమలు రాకపోగా, ఉన్నవాటిని తరిమేశారు. ఇక చదువుకున్న వారికి ఉద్యోగాలు ఎలా వస్తాయి.

? యూనివర్సిటీల పరిస్థితి ఏమిటి.

! రాష్ట్రంలో యూనివర్సిటీలు రాజకీయ పునరావాస కేంద్రాలుగా మారాయి. విద్యావ్యవస్థ సర్వనాశనమైంది. విశ్వవిద్యాలయాలు అవినీతి కూపంగా మారిపోయాయి. ఎస్వీయూలో దారుణంగా తయారైంది. పలు విభాగాలను కూడా మూసేసే పరిస్థితి వచ్చింది.

? విద్యా దీవెనకు, ఫీజు రీయింబర్స్‌మెంటుకు ఉన్న తేడా ఏంటి.

! గతంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ అమల్లో ఉండేది. ప్రైవేట్ విద్యాసంస్థలో విద్యార్థి అడ్మిషన్ తీసుకుంటే చాలు, ఫీజులు గురించి సంబంధమేలేదు. కళాశాల యాజమాన్యానికి ప్రభుత్వం ఫీజు చెల్లించేది. జగన్ రెడ్డి వచ్చాక విద్యాదీవెన తీసుకొచ్చి తల్లిదండ్రుల అకౌంట్‌కు నగదు వేయడం, తర్వాత కళాశాలకు కట్టాలని నిర్ణయం తీసుకున్నారు. అరకొరగా నగదు అకౌంట్లకు వేసి.. వదిలేశారు. దీనివల్ల చాలామంది విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తే మళ్లీ పాత విధానాన్ని అమలు చేస్తాం.

? ఐదేళ్ల పాటు జాబ్ క్యాలెండర్ కోసం ఎదురుచూసినట్టున్నారు.

! జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తాను అధికారంలోకి రాగానే ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్నారు. ప్రభుత్వ శాఖలో ఖాళీగా ఉన్న ప్రతి పోస్టును భర్తీ చేస్తానని మాటిచ్చారు. జాబ్ క్యాలెండర్‌కోసం నిరుద్యోగులకు ఎదురుచూపులే మిగిలాయి. మెగా డీఎస్సీ అని ఒక్క పోస్ట్ కూడా భర్తీ చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 25వేల పోస్టులతో మెగా డీఎస్సీపై చంద్రబాబు తొలి సంతకం చేస్తారు. ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తారు.

? యువత గంజాయి మత్తులో ఎందుకు జోగుతోంది.

! తిరుపతిలో యువనేత అనిచెప్పే వ్యక్తి అండదండలతోనే గంజాయి, డ్రగ్స్ యథేచ్ఛగా సరఫరా జరుగుతున్నా పోలీసులు చోద్యం చూస్తున్నారు. ప్రతినెలా గంజాయి డాన్లు ఆయనకు కప్పం కడుతున్నారు. అతనికి విజన్ లేదు. తన స్వార్థ రాజకీయాలకు యువతను వాడుకోవడం, వారి జీవితాలతో ఆడుకోవడమే అతనికి తెలుసు. యువత ఉద్యోగాలు, ఉపాధి లేక గంజాయికి, డ్రగ్స్‌కు బానిసలుగా మారి జీవితాలను సర్వనాశనం చేసుకుంటున్నారు. గంజాయి వద్దు అంటూ నేను పోరాటం చేస్తే నాపై మూడు కేసులు పెట్టారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి రాగానే గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కు పాదం మోపుతాం.

? క్రీడాకేంద్రంగా తిరుపతి కలేనా.

! తిరుపతి కేంద్రంగా క్రీడలను కూడా రాజకీయాలకు వాడుకుంటున్నారు. చెవిరెడ్డి భాస్కరరెడ్డి లాంటి వ్యక్తులు క్రికెట్‌ను అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేస్తున్నారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తే తిరుపతిలో ఇంటర్నేషనల్ స్టేడియంతోపాటు క్రీడా కేంద్రంగా తయారు చేస్తాం.

? విద్యార్థి, యువత ఎన్డీఏ కూటమి అభ్యర్థికి ఎందుకు ఓటు వేయాలి

! 20లక్షల ఉద్యోగాలు రావాలన్నా.. నిరుద్యోగ భృతి రూ.3వేలు నిరుద్యోగికి అందాలన్నా.. తిరుపతిలో చదువుకుంటున్న ప్రతి యువకుడికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రావాలన్నా.. తిరుపతిలో ప్రశాంత వాతావరణం ఉండాలన్నా.. ఎన్డీఏ కూటమి అభ్యర్థికి ఓటు వేయాలి. గతంలో తిరుపతి అభివృద్ధి చెందిందంటే అది టీడీపీ వల్లే.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

కూటమిదే గెలుపు, ధర్మానిదే విజయం

తిరుపతి కోర్టు ప్రాంగణంలో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ప్రచారం



వాకాడు మండల నాయకులతో వరప్రసాద్ - కోర్టు ప్రాంగణంలో లక్ష్మితో కలసి సుగుణమ్మ ప్రచారం

తిరుపతి, మే10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్డీఏ కూటమిదే గెలుపు, ధర్మానిదే విజయమని టీడీపీ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ స్పష్టం చేశారు. శుక్రవారం కోర్టు ప్రాంగణంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాద రావు సతీమణి లక్ష్మితో కలసి సుగుణమ్మ ప్రచారం చేపట్టారు. న్యాయవాదులను పేరుపేరున పలకరించి ఎంపీ అభ్యర్థికి కమలం గుర్తుపై, ఎమ్మెల్యే అభ్యర్థికి గాజుగ్లాసు గుర్తుపై ఓటువేయాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు. టీడీపీ నగర అధ్యక్షుడు చినబాబు, లీగల్‌సెల్ నాయకులు దినకర్, వేణుగోపాల్, వసుమతి, బుల్లెట్ రమణలు పాల్గొన్నారు. అలిపిరిలో బీజేపీ ఇంటింటా ప్రచారం, రోడ్‌షో నిర్వహించింది. తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్‌రావు సతీమణి కొల్లూరి లక్ష్మి, కుమార్తె డాక్టర్ స్ఫూర్తి ప్రచారంలో పాల్గొని ఎన్డీఏ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.

పొదలకూరు/వాకాడు:ప్రజల స్పందన చూస్తుంటే ఎన్డీఏ కూటమిదే ఘన విజయమని తెలుస్తోందని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు అన్నారు. శుక్రవారం పొదలకూరులో సర్వేపల్లి టీడీపీ అభ్యర్థి, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డితో కలసి ఎన్నికల ప్రచార ర్యాలీలోపాల్గొన్నారు. దళితుల పట్ల అవమానకరంగా వ్యవహరించే ఈ పార్టీని ప్రజలు భూస్థాపితం చేసేరోజు వచ్చిందన్నారు. ఒక్కచాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన వైసీపీ రాష్ట్ర అభివృద్ధిని పక్కనపెట్టి వనరుల దోపిడీకి ప్రాధాన్యం ఇచ్చి దానిని ప్రశ్నించిన తనను అవమానకరరీతిలో బయటకు పంపారన్నారు. వాకాడు మండల టీడీపీ, బీజేపీ నాయకులతో వరప్రసాద్ సమాలోచనలు జరిపారు. అధికార వైసీపీ ప్రలోభాలకు ప్రజలు గురికాకుండా వారికి వాస్తవ పరిస్థితులు వివరించి ఎన్డీఏ అభ్యర్థులకు ఓట్లు వేసేలా అందరూ కృషి చేయాలని కోరారు.


శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.97 కోట్లు

తిరుమల, మే 10 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.2.97 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం పరకామణి లెక్కింపులు నిర్వహించి, శుక్రవారం ఉదయం ప్రకటించింది. ఇక, గురువారం 65,508 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 25,996 మంది తలనీలాలు సమర్పించారు.

సింహాచలం అప్పన్నకు టీటీడీ పట్టువస్త్రాల సమర్పణ

విశాఖపట్నం సమీపంలోని సింహాచలం వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి(అప్పన్న)కి టీటీడీ తరఫున శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం శుక్రవారం పట్టువస్త్రాలు సమర్పించారు. 1996 నుంచి అప్పన్నకు పట్టువస్త్రాలను టీటీడీ సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. అప్పన్న విగ్రహం ఏడాది పొడవునా చందనంతో కప్పి ఉంటుంది. ఏడాదిలో 12 గంటలు మాత్రమే చందనం పూత లేకుండా స్వామి దర్శనమిస్తారు. అక్షయతృతీయ రోజున స్వామి విగ్రహానికి చందనం పూత తొలగించి, తిరిగి పూస్తారు. చందన యాత్ర, చందనోత్సవం పేరుతో ఏటా వైశాఖమాసంలో జరిగే ఈఉత్సవాన్ని పురస్కరించుకునే పట్టువస్త్రాలు సమర్పించింది.

తిరుమలలో వ్యక్తి మృతి



తిరుమల, మే 10 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శుక్రవారం ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తిరుమలలోని కల్యాణ వేదిక వద్ద సుమారు 50 ఏళ్ల వయసున్న వ్యక్తి ఎలాంటి కదలికలు లేకుండా ఉన్నాడని పోలీసులకు స్థానికులు సమాచారమిచ్చారు. పోలీసులు, అంబులెన్స్ సిబ్బంది ఘటనాప్రాంతానికి చేరుకుని పరిశీలించగా అప్పటికే మృతిచెందినట్టు తేలింది. అక్కడ ఎలాంటి వ్యక్తిగత ఆధారాలు లభించకపోవడంతో గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదు చేశారు. వివరాలు తెలిసిన వారు 0877 2289031 నెంబరుకు తెలియజేయాలని పోలీసులు కోరారు.

జనసేనలోకి భారీగా చేరికలు

కండువా కప్పుకున్న మాజీ కౌన్సిలర్ దొడ్డారెడ్డి శ్రీనివాసులు రెడ్డి



ఆరణి శ్రీనివాసులుకు సన్మానం - దొడ్డారెడ్డి శ్రీనివాసులురెడ్డికి జనసేన కండువా కప్పుతున్న ఆరణి

తిరుపతి, మే 10 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ సమయం దగ్గర పడుతున్న వేళ గురువారం జనసేనలోకి భారీగా చేరికలు జరిగాయి. జనసేన సీనియర్ నేత పొలకల మల్లికార్జున్ ఆధ్వర్యంలో గిరిపురంలో మూడు వందల మందితో మాజీ యువజన కాంగ్రెస్ నాయకులు లచ్చీ రాయల్ అతడి స్నేహితులు పార్టీలో చేరారు. అదేవిధంగా జనసేనలోకి జీవకోనకు సంబంధించిన ఏడు వందల మంది చేరారు. వీరికి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు సుధాకర్, వీర, మణి, సురేష్, వెంకటరమణ, సత్యం, సరస్వతమ్మ, సంతోషలతోపాటు ఏడు వందల మంది జనసేనలో చేరారు. అదేవిధంగా మాజీ కౌన్సిలర్ దొడ్డారెడ్డి శ్రీనివాసులు రెడ్డి కూడా జనసేనలో చేరారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, నేతలు నరసింహ యాదవ్, మబ్బు దేవనారాయణ రెడ్డి, ఊకా విజయ్‌కుమార్, కట్టా జయరామ్ యాదవ్, మునిరామయ్య, నైనార్ శ్రీనివాస్, యాదవ కృష్ణ, జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి పాల్గొన్నారు.

పెన్షనర్లు, కళాకారులకు అండగా ఉంటాం

జనసేన నేతలు ఏఎం రత్నం, నరసింహులు నాయుడు


సమావేశంలో మాట్లాడుతున్న నరసింహులు నాయుడు

తిరుపతి, మే 10 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో కళాకారులకు పూర్వ వైభవం తీసుకొస్తామని జనసేన నేతలు ఏఎం రత్నం, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘ పూర్వ నాయకుడు ఎం.నరసింహులు నాయుడు హామీ ఇచ్చారు. జానపద వృత్తి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం భజన కళాకారుల ఆత్మీయ సమావేశం జరిగింది. జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు గెలుపుకోసం గాజు గ్లాసు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో సంఘ నాయకులు యాదగిరి, మునీంద్ర పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వ ఉద్యోగుల పెన్షనర్ల భవన్‌లో ఉద్యోగుల సంఘ నాయకులతో నరసింహులు నాయుడు సమావేశమయ్యారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఆపస్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు ఎక్స్‌ప్రెస్‌కు అదనపు కోచ్ ఏర్పాటు

తిరుపతి(సెంట్రల్), మే 10: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా గుంటూరు-తిరుపతి మధ్య నడుస్తున్న ఎక్స్‌ప్రెస్(17261-17262)కు అదనంగా ఒక సాధారణ కోచ్‌ను శుక్రవారం నుంచి ఏర్పాటు చేశామని రైల్వే అధికారులు తెలిపారు. ఈ సౌకర్యం 13వ తేదీవరకు ఉంటుందని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జన చైతనం

www.andhrajyothy.com
శనివారం 11 మే 2024



నిజాయితీ ఓటర్లకు నీరాజనాలు

ఓటు కోసం ఎవరెంతిస్తారా అని ఎదురుచూస్తున్న రోజుల్లో తాము అమ్ముడుపోయేదే లేదంటూ కొందరు ముందుకు రావడం ఆశ్చర్యమే. అందుకేనేమో ఓ పార్టీ నాయకులు వీరి కాళ్లు కడిగి మరీ సన్మానం చేశారు. చంద్రగిరిలోని వైయస్ఎంఆర్ కళ్యాణ మండపం ఈ ఘట్టానికి శుక్రవారం వేదికైంది. ఓటు అమ్ముకునే సంస్కృతికి స్వస్తి చెబుతామంటూ ప్రమాణం చేసినవారిని పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంచన వేణుగోపాల్‌రెడ్డి శుక్రవారం కాళ్లు కడిగి సత్కరించారు.

- చంద్రగిరి

ఇదీ మందల



ఇండిపెండెంట్ బిల్డప్...

సత్యవేడు నియోజకవర్గంలో ఓ ఇండిపెండెంట్ అభ్యర్థి హంగామా చూసి ఓటర్లు విస్తుపోతున్నారు. విశాఖపట్నానికి చెందిన ఈ ఎన్ఆర్ఐ ప్రధాన పార్టీ అభ్యర్థి తరహాలో బిల్డప్ ఇస్తుండటంలో అంతా ఆసక్తిగా గమనిస్తున్నారు. పది మంది బౌన్సర్లు ఈయన్ను అనుసరిస్తుంటే ముసిముసిగా నవ్వుకుంటున్నారు. ముందుగా జన సమీకరణ ఏర్పాట్లు చేయించుకుని మరీ ప్రచారంలో పాల్గొంటున్నారు. అక్కడితో ఆగకుండా తనకు గజమాలలు వేసేలా ప్లాన్ చేసుకుంటున్నారు. ప్రధాన పార్టీలోని అసమ్మతి నేతలను వెంట బెట్టుకుని చేస్తున్న ప్రచారానికి భారీగానే ఖర్చు పెడుతున్నట్లు సమాచారం.

- సత్యవేడు



ముక్కుపుడకా వద్దు బాబోయ్..

శ్రీకాళహస్తిలో ఈసారి ముక్కుపుడక పార్ములా పనిచేసేలా లేదు. గత ఎన్నికల్లో మహిళా ఓటర్లను ఆకర్షించేందుకు వైసీపీ నాయకులు ముక్కుపుడకలు పంపిణీ చేశారు. ఇవి పూర్తిగా బంగారంతో తయారుచేసినవని అందరూ నమ్మేశారు. ఆ ఎన్నికల్లో మహిళల ఓట్ల గేలానికి ఇది బాగానే వర్కవుట్ అయింది. ఎన్నికలయ్యాక కొంతమంది ఆ ముక్కుపుడకను మార్చుకుందామని బంగారు షాపులకు వెళ్లి భంగపడ్డారు. ఇది బంగారం కాదు..నాశిరకం బంగారం పూత అని తెలియడంతో అవాక్కయ్యారు. చేసేదిలేక ముక్కున వేలేసుకుని వెనక్కు వచ్చేశారు. గతంలో విజయాన్ని అందించిన ముక్కుపుడక తాయిలాన్ని ఈసారి కూడా పంపిణీ చేసేందుకు సదరు నాయకులు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఆనోటా ఈనోటా విషయాన్ని తెలుసుకున్న మహిళలు ముక్కుపుడకలంటే ముఖం చిట్లిస్తున్నారు. మరోసారి మోసపోయేదిలేదని వీరంతా చర్చించుకుంటున్నట్లు తెలిసింది.

- రేణిగుంట



ఏ మచ్చా.... ఎంతిస్తున్నారు...

రే మచ్చా... ఎంతిస్తున్నార్రా... ఇంతవరకు ఎంతిస్తున్నారో ఎవరూ చెప్పడంలేదురా అని ఒకరంటే.. ఇంకా ఒక రోజు ఉందికదా మచ్చా.. ఇస్తార్లే......
ఏ ఇంట్లో ఎన్ని ఓట్లు ఉండాయో రాస్తా ఉండాది.. ఈ సంభాషణ ఏ ఇద్దరి మధ్యో జరిగింది కాదు... సూళ్లూరుపేట నియోజకవర్గంలో గ్రామాల్లో ఓటర్లలో విస్తృతంగా జరుగుతున్న చర్చ. పోలింగ్ దగ్గర పడుతుండటంతో ఎవరని కదిపినా డబ్బులు ఎప్పుడు ఇస్తారంటూ మాట్లాడుకుంటున్నారు. ఫలానా చోట వెయ్యిరూపాయలిస్తున్నారంట..రెండు వేలిస్తున్నారంట లాంటి అట కబుర్లే వినిపిస్తున్నాయి. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల సమయంలో ఉద్యోగులకు కూడా పార్టీలు డబ్బులిచ్చాయని చర్చించుకుంటున్నారు. ఉద్యోగులకిచ్చినట్టయినా తమకు ఇవ్వకపోరా అనుకుంటున్నారు.

- తడ

● నోట్ దిస్ పాయింట్

అభ్యర్థి నేర చరిత్ర తెలుసుకోండి

అభ్యర్థి ఎలాంటివాడో ఓటర్లకు తెలియాలి. నిజమే.. మరి ఎలా తెలుస్తుంది. తాను చాలా సచ్చీలుడిననే అందరూ చెబుతారు. అందుకే ఈ విషయంలో ఎన్నికల కమిషనే చొరవ తీసుకుంది. అభ్యర్థి మీద నమోదయిన కేసుల వివరాలన్నీ తెలియజేయాలని గట్టి నిబంధన విధించింది. కేసుల వివరాలు దాస్తే అనర్హత వేటు పడుతుందని స్పష్టం చేసింది. పోలింగుకు రెండు రోజులు ముందుగా కనీసం మూడుసార్లు దినపత్రికల్లో కేసుల వివరాన్నీ ప్రచురించాలని ఆదేశించింది. దీనివల్ల ఓటర్లకు అభ్యర్థుల నేరచరిత్ర తెలిసే అవకాశం ఉంటుందనేది ఎన్నికల కమిషన్ ఉద్దేశం. ప్రస్తుత ఎన్నికలను పరిశీలిస్తే జిల్లాలో ఇద్దరు ఎంపీ, 18మంది అసెంబ్లీ అభ్యర్థులపై క్రిమినల్ కేసులుఉన్నాయని జిల్లా అధికారులు చెబుతున్నారు. అయితే ఓటర్లందరికీ తమ నేరాల చిట్టా తెలియకూడదని కొందరు అభ్యర్థులు ప్రధాన పత్రికలకు కాకుండా మొక్కుబడిగా సర్క్యులేషన్ అంతగాలేని దినపత్రికల్లో ప్రకటనగా ఇస్తున్నారని సమాచారం.


- తిరుపతి(కలెక్టరేట్)

ఈసారి ఎన్నికలు బహిష్కరిస్తాం...

ఈసారి ఎన్నికలు బహిష్కరించాలని తొమ్మిది స్వయం సహాయక సంఘాల సభ్యులు భీష్మించుకున్నారు. సత్యవేడు మండలం మల్లవారిపాళెం వెస్ట్ గ్రామానికి చెందిన సుమారు వందమంది డ్వాక్రా మహిళలు ఈమేరకు తీర్మానించుకున్నారు. ఎంపీడీవో చంద్రశేఖర్‌ను వీరంతా కలసి నిర్ణయాన్ని తెలియజేశారు. ఇరుగుళం గ్రామానికి చెందిన సంఘమిత్ర బాషా తాము చెల్లించిన శ్రీనిధి, సీఐఎఫ్ సొమ్ము రూ.6 లక్షలు స్వాహా చేసినట్లు తేలినా ఎలాంటి చర్యలూ తీసుకోనందునే వీరంతా ఇలా నిర్ణయించుకున్నారు. పైగా దుర్వినియోగమైన సొమ్ము చెల్లించాలంటూ తమకే నోటీసులు రావడంతో డ్వాక్రా సంఘాల సభ్యులంతా అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. అందుకే ఈసారి ఆరు నూరయినా..నూరు ఆరయినా ఓటేయరాదని తీర్మానించుకున్నారు.


- సత్యవేడు

మీ కుమారుడికి ఓటెందుకెయ్యాలి



తిరుపతి, ఆంధ్రజ్యోతి

నుదుట బొట్టు.. దైవభక్తి..సెంటిమెంట్లు.. గంభీరమైన ఆహార్యం. నిరంతరం తిరుగుతూ ఒక రైతులా రాజకీయాల్లో శ్రమిస్తారు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి. కానుకలతో జనం మనసు గెలుచుకునే వ్యూహాన్ని పదేళ్లుగా అమలు చేస్తున్నారు. వినాయకచవితికి వీధివీధికీ విగ్రహాలు పంచుతారు. దీపావళికి ఇంటింటికీ టపాసులు పంపుతారు. సంక్రాంతికి బ్రాండెడ్ బట్టల సంచులు ఇళ్లకు చేరుస్తారు. గడియారాలు, కుక్కర్లు, క్యాలెండర్లు... ఎన్నికలొచ్చినపుడే గాక ఏడాది పొడవునా ఇలా ఎప్పుడూ ఏదో ఒక కానుక పంపిణీ జరుగుతునే ఉంటుంది. వందల కోట్ల ఖర్చు. ఎక్కడిది ఇంత డబ్బు అనే చర్చ జరుగుతూనే ఉంటుంది. పట్టించుకోరు. సీఎం జగన్‌కు వీరవిధేయ హనుమంతుడిలా ఉండే చెవిరెడ్డి భాస్కరరెడ్డి అనేక పదవులూ అధిష్టించారు. ఆ అధికారాన్నీ, సాన్నిహిత్యాన్నీ చంద్రగిరి నియోజవర్గం శాశ్వత అభివృద్ధికి చిటికెడైనా వాడుకోలేదనే ఆరోపణలున్నాయి. తిరుపతిలో కలగలిసిపోయినట్టుగా ఉండే ఈ నియోజకవర్గంలో ఒక్క పరిశ్రమను తీసుకురాలేకపోయారు. ఒక్క ప్రతిష్టాత్మక విద్యా, వైద్య సంస్థనూ సాధించలేకపోయారు. వ్యక్తిగత తాయిలాల పంపకంపై పెట్టిన శ్రద్ధ ఆయన అభివృద్ధిమీద వెచ్చించలేదు. జగన్ ఆదేశించారని, తనకు ఏమాత్రం సంబంధం లేని ఒంగోలు నుంచి ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగి, చంద్రగిరి నుంచి తన కుమారుడు మోహిత్‌రెడ్డిని పోటీ చేయిస్తున్న చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పదేళ్లు ఎమ్మెల్యేగా ఉండీ చేసిందేమిటనే ప్రశ్నకు బలమైన సమాధాన సాక్ష్యాలు లేవు. ఎన్నికలవేళ ఇప్పుడు అవే చర్చగా మారాయి. చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి ఓటెందుకు వేయాలనే ప్రశ్న చంద్రగిరి నియోజకవర్గంలో వినిపిస్తోంది.



పంపకాలు తప్ప పనేం చేశారు చెవిరెడ్డీ?

- ఆప్యాయంగా పలకరిస్తారు .. మెత్తగా అణచేస్తారు
- ఇసుక, గ్రావెల్ తవ్వకాలతో అనుచరుల అక్రమార్జన

చంద్రగిరి ప్రజల చెవిలో చెవిరెడ్డి పూలు



హామీ : చంద్రగిరిలో 100 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయిస్తా!
అమలు: టీడీపీ ప్రభుత్వం 2018లో ఏర్పాటు చేసిన 50 పడకల ఆస్పత్రే ఇప్పటికీ కొనసాగుతోంది.
హామీ: చంద్రగిరిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సదుపాయం కల్పిస్తా!
అమలు: కనీసం ప్రతిపాదనలు కూడా రూపొందించలేదు.
హామీ: చంద్రగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్రికెట్ స్టేడియం నిర్మిస్తా!
అమలు: క్రికెట్ స్టేడియం నిర్మించకపోగా, టీడీపీ ప్రభుత్వంలో మొదలైన ఇండోర్ స్టేడియం పనులు కూడా పూర్తి చేయించలేదు.
హామీ: కళ్యాణి డ్యామ్ జలాలతో చంద్రగిరికి, తిరుపతి రూరల్ గ్రామాలకు తాగునీరు అందిస్తా!
అమలు: ప్రతిపాదనలు కూడా తయారు కాలేదు.
హామీ: శేషాచలం అటవీ సరిహద్దుల్లోని పొలాల్లోకి ఏనుగులు రాకుండా కందకాలు, సోలార్ పవర్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయిస్తా!
అమలు: కందకాల తవ్వకం గానీ, సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు గానీ కాలేదు. ఏనుగుల బెడదతో రైతులు తల్లడిల్లిపోతున్నారు.
హామీ: ప్రతి గ్రామంలో ప్యూరిఫైడ్ తాగునీటి ప్లాంట్ ఏర్పాటు చేయిస్తా!
అమలు: తుడా నిధులతో కొన్ని గ్రామాల్లో ప్లాంట్లు ఏర్పాటు చేయించినా చాలా వరకూ అవి పనిచేయడం లేదు. పైగా టీడీపీ పాలనలోని ఎన్టీయార్ సుజల పథకం కింద ఏర్పాటు చేసిన ప్లాంట్లను మరమ్మతు చేయించకుండా నిర్వీర్యం చేశారు.
హామీ:పాకాల మండలం నేంద్రగుంట-దామలచెరువు రోడ్డు విస్తరణ చేయిస్తా!
అమలు:విస్తరణ జరగలేదు. కనీసం ఉన్న రోడ్డుకు మరమత్తులు కూడా చేయలేదు.
హామీ: భాకరాపేట నుంచి తలకోన వరకు రోడ్డు విస్తరణ చేయిస్తా!
అమలు: నెరవేరలేదు.
హామీ: తిరుచానూరు బస్టాండు ఏర్పాటు చేస్తా!
అమలు: ఆ ఊసే లేదు.

పవర్ ఉండీ ప్రగతి శూన్యం

చంద్రగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి పరిచేందుకు ఎమ్మెల్యే చెవిరెడ్డికి అవకాశమున్నా పట్టించుకోలేదన్న విమర్శలున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో చెవిరెడ్డికి ప్రభుత్వ విప్‌గానూ, తుడా ఛైర్మన్‌గానూ క్యాబినెట్ హోదా వున్న రెండు నామినేటెడ్ పదవులు దక్కాయి. టీటీడీ పాలకమండలిలో ఎక్స్ అఫిషియో సభ్యుడు కూడా అయ్యారు. సీఎం జగన్‌కు ఆంతరంగిక సన్నిహితుడుగా పేరుపొందారు. అయినా చంద్రగిరి అభివృద్ధి కోసం ఆయన చేసింది ఏమీలేదు. నియోజకవర్గానికి ఒక పరిశ్రమ గానీ, ఉన్నత విద్యా, వైద్య సంస్థలు గానీ తెప్పించుకోలేకపోయారు.

ఆరోపణలు అపారం

● ఎమ్మెల్యే చెవిరెడ్డి అండతో అనుచరులు, కుటుంబీకులు నియోజకవర్గవ్యాప్తంగా భూ ఆక్రమణలు, సెటిల్‌మెంట్లకు పాల్పడుతున్నారని, చంద్రగిరి, రామచంద్రాపురం మండలాల్లో భారీ ఎత్తున గ్రావెల్ అక్రమ తవ్వకాలకు తెగబడుతున్నారని ఆరోపణలున్నాయి.

● తిరుపతి రూరల్, చంద్రగిరి, రామచంద్రాపురం మండలాల్లో మఠాలకు చెందిన వందలాది ఎకరాలు ఆక్రమించారని ప్రత్యర్థులు ఆరోపిస్తున్నారు.

● హథీరాంజీ మఠానికి చెందిన అత్యంత ఖరీదైన భూములను తన కుటుంబ సభ్యులు, బినామీల పేరిట తమ ఆధీనంలో ఉంచుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి.తుమ్మలగుంటలో తొలుత ఓ గ్రామదేవత పేరిట డెయిరీ అంటూ బోర్డు పెట్టారని, ఇటీవల దాన్ని కూడా పీకించేసి భూమిని సొంతం చేసుకున్నట్టు స్థానిక జనం చెప్పుకుంటున్నారు.

● తుడా లేఅవుట్లలో పార్కుల కోసం కేటాయించిన ఖరీదైన స్థలాలను కూడా అనుచరులు కాజేశారనే ఆరోపణలున్నాయి. ● తుమ్మలగుంట చెరువును ఆక్రమించారని, ఆ స్థలాల విలువ వందల కోట్లుంటుందని ప్రత్యర్థులు ఆరోపిస్తున్నారు.

● ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి సోదరుడు నియోజకవర్గం మొత్తం మీద టిప్పర్లు, ట్రాక్టర్ల యజమానులను గ్రూపుగా చేసి ఇసుక, గ్రావెల్ అక్రమ తవ్వకాలు, రవాణాకు రింగ్ లీడర్‌గా వ్యవహరిస్తూ భారీగా అక్రమార్జనకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. చంద్రగిరి, తిరుపతి రూరల్ మండలాల్లో ప్రవహించే స్వర్ణముఖి నదిలో ఇసుక కొల్లగొట్టి వందల కోట్లు పోగేసుకున్నారనే ఆరోపణలున్నాయి.

● అనధికార అపార్టుమెంట్లు, అనధికారిక లేఅవుట్ల యజమానుల నుంచి ఎమ్మెల్యే సోదరుడు భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి.

● శ్రీవారి దర్శనాలను సైతం దుర్వినియోగం చేస్తున్నారని, పారిశ్రామికవేత్తలకు, వ్యాపారవేత్తలకు, ఎన్ఆర్ఐలకు దర్శనాలు చేయించి ప్రయోజనాలు పొందుతుంటారనే ఆరోపణలున్నాయి.

'జగనన్నతోడు'గా అర్హులకేదీ సాయం

చిరు వ్యాపారులకు అండగా నిలవాల్సిన జగనన్నతోడు పథకం అభాసుపాలవుతోంది. పథకం అమలుకు సంబంధించి జగన్ ప్రభుత్వం చెబుతున్నవి కాకిలెక్కలేనని తేలుతోంది. అసలైన అర్హుల్లో కొందరికే లబ్ధి చేకూరుతోందని చిరువర్తకులు మండిపడుతున్నారు. అధికారపార్టీ నాయకులకు నచ్చినవారికే ఈ పథకం వర్తిస్తోందనే విమర్శలున్నాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



అర్జీలిచ్చినా పట్టించుకోలేదు



20 ఏళ్లగా చెక్కబండిపై పండ్ల వ్యాపారం చేస్తున్నా. ఈ ప్రభుత్వం గుర్తింపుకార్డు అయితే ఇచ్చింది గానీ జగనన్నతోడు డబ్బులు మాత్రం ఇవ్వలేదు. చాలాసార్లు సచివాలయంలో అర్జీలు ఇచ్చినా పట్టించుకోలేదు. ఇక్కడ వ్యాపారం చేస్తున్న వారిలో ఇద్దరికో ముగ్గురికో వచ్చింది.

- మంజుల,తిరుపతి

అప్పు చేసి పెట్టుబడి పెడుతున్నాం



ఎలాంటి షూరిటీ లేకుండా, వడ్డీ లేకుండా రూ.10 వేలు అప్పు ఇస్తున్నారంటే సంతోషించాం. తొమ్మిదేళ్లగా అప్పు చేసి పెట్టుబడి పెట్టి వ్యాపారాలు చేస్తున్నా. లాభంలో సగాన్ని వడ్డీకి కట్టి మిగిలిన దాంట్లో తింటున్నాం. ఐడీ కార్డులు ఇవ్వలేదు, జగనన్న తోడు ఇవ్వలేదు.

- వీణ,తిరుపతి

మోసం గురూ!

వీధుల్లో, తోపుడు బండ్లపై చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునేవారికి జగనన్న తోడు పథకం ద్వారా అండగా నిలుస్తామంటూ జగన్ ప్రభుత్వం ప్రకటించింది. వారు తీసుకునే రూ.10 వేలు బ్యాంకు రుణానికి ప్రభుత్వమే వడ్డీ చెల్లిస్తుందని పేర్కొంది. ఈ పథకం కింద 16.73 లక్షల మందికి రూ.3,373 కోట్ల రుణాలు ఇప్పించామని గొప్పలు చెప్పుకుంటోంది. జిల్లాలో ఈఏడాది జనవరిలో ఎనిమిదో విడతగా 16,541 మందికి రూ.17.50 కోట్లు, గతంలో రుణాలు తీసుకున్న 30,782 మంది చిరువ్యాపారులకు సుమారు రూ.70.71 లక్షలు వడ్డీ రీయింబర్స్‌మెంట్ చేసినట్లు లెక్కలు చూపుతోంది.



తిరుపతి రోడ్ల ఫుట్‌పాత్‌లపై చిరు వ్యాపారులు

అర్హులు 15 శాతం మాత్రమే

వాస్తవానికి చిరు వ్యాపారుల్లో కొద్దిమందికి మాత్రమే జగనన్న తోడు అందుతోంది. మొక్కుబడిగానే వడ్డీ చెల్లిస్తున్నారని లబ్ధిదారులు పెదవి విరుస్తున్నారు. తిరుపతి లో ఈ పథకం అమలుపై 'ఆంధ్రజ్యోతి' సర్వే చేస్తే 15 శాతం మంది మాత్రమే తమకు జగనన్నతోడు లభించిందన్నారు. అర్జీలు పెట్టుకుంటునే ఉన్నా తమను పథకంలో చేర్చడంలేదని కొంతమంది అర్హులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కువ వడ్డీకి అప్పు తెచ్చి వ్యాపారాలు చేస్తునామంటూ వాపోయారు. అర్హులు కాకపోయినా అధికారపార్టీ వైసీపీ నేతలు సిఫారసు చేసినవారినే లబ్ధిదారులుగా చేర్చారనే ఆరోపణలున్నాయి. అర్హులెవరూ పెద్దగా లబ్ధి పొందకపోయినా ప్రభుత్వం మాత్రం లేనిపోని గణాంకాలతో గొప్పలు చెప్పుకొంటోంది. గుర్తింపుకార్డులు ఇస్తామంటూ వైసీపీ ప్రభుత్వం తమను మోసగించిందని చిరువ్యాపారులు ప్రభుత్వంపై నిప్పులు చెరుగుతున్నారు.

నాలాగ ఎందరో..

● దళిత మహిళ గాలి కృష్ణవేణి ఆవేదన




వైసీపీ పాలనలో దళితులను అడుగడుగునా అణచివేశారని ఏర్పేడు అశోక్‌నగర్‌కు చెందిన దళిత మహిళ గాలి కృష్ణవేణి ఆవేదన వ్యక్తం చేసింది. తానెదుర్కొన్న కష్టాన్ని ఆమె వివరించిందిలా.. కంచర్ల శ్రీకాంత్ ఎమ్మెల్సీగా గెలిచిన సమయంలో ఏర్పేడు అంబేడ్కర్ విగ్రహం వద్ద కొందరు మహిళలతో కలసి సంబరాలు చేసుకుంటున్నాం. ఓర్వలేని అప్పటి సీఐ శ్రీహరి అసభ్య పదజాలంతో, కులంపేరుతో దూషించారు. భర్తలేని నిన్ను పట్టుకుని ఈడ్చి తన్నితే దిక్కెవరన్నారు. అవమానం దిగమింగుకుని సీఐపై చర్యలు తీసుకోవాలని చాలాసార్లు రేణిగుంట డీఎస్పీని కలిశాను. ఆయన స్పందించలేదు. గతేడాది మే 15న కోర్టును ఆశ్రయించాను. విచారించిన కోర్టు శ్రీహరిపై చర్యలు తీసుకోవాని డీఎస్పీ భవ్య కిషోర్‌ను ఆదేశించింది. ఈక్రమంలో సీఐ శ్రీహరిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు కూడా నమోదయింది. తనలా ఎంతోమంది దళితులను వైసీపీ ప్రభుత్వం అడుగడుగునా అవమానించిందని కృష్ణవేణి పేర్కొంది. మహిళలు సగర్వంగా తలెత్తుకోవాలన్నా, ఉన్నతంగా ఎదగాలన్నా చంద్రబాబునాయుడు మళ్లీ ముఖ్యమంత్రిగా రావాలని ఆమె ఆకాంక్షించింది. మహిళలు ఏకమై టీడీపీని గెలిపించాలని ఆమె కోరింది.

- ఏర్పేడు

ఎర్రచందనం స్మగ్లరుగా రూ.వేల కోట్లు సంపాదించారు. జైలుకూ వెళ్లారు. అయితేనేం.. ఆ సొమ్మునే వైసీపీ రాజకీయాల్లో పెట్టుబడిగా పెట్టారు. అధికారంలోకి వచ్చాక చిత్తూరులో ఎమ్మెల్యేని కాదని, ఈయనే పవర్ సెంటరుగా మారారు. అధికారం అండగా.. తన సంపాదనను మరింత పెంచుకున్నారు. 12 ఎర్రచందనం కేసులున్న ఆయన్ను శాసనాలు చేసే చట్టసభకు పంపాలని వైసీపీ నిర్ణయం తీసుకుంది. ఎర్ర స్మగ్లరు అయినా.. ఎన్ని విమర్శలు వచ్చినా.. ప్రజలు ఏమనుకుంటారోనన్న భావనా లేకుండా అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది. విజయానందరెడ్డి నేపథ్యం.. ఈ ఐదేళ్లలో ఆయన అనుచరుల ఆగడాలు చూసిన చిత్తూరు ప్రజలు ఇతనా మా ఎమ్మెల్యే అభ్యర్థి అని విస్తుపోతున్నారు.

- ఆంధ్రజ్యోతి, చిత్తూరు

ఎర్రచందనం స్మగ్లర్‌కి ఓటెందుకెయ్యాలి?



చిత్తూరు వైసీపీ అభ్యర్థి విజయానందరెడ్డిపై ప్రజల్లో చర్చ

పీలేరు, రాజమండ్రి సెంట్రల్ జైలులో గడిపిన నేర చరిత్ర

'ఎర్ర'ధనమే పెట్టుబడిగా రాజకీయాల్లోకి వచ్చిన వైనం

అన్నిరకాల అక్రమ వ్యాపారాల్లో అనుచరుల హల్‌చల్

అనుచరులతో లాటరీ నిర్వహణ

వైసీపీ వచ్చిన కొత్తలో పార్టీ కోసం కష్టపడినవారికి లాభం చేకూర్చాలనే ఉద్దేశంతో లాటరీ నిర్వహణను పూర్వ ప్రజాప్రతినిధి, విజయానందరెడ్డి వర్గానికి చెందిన ఇద్దరికి అప్పగించారు. లాటరీ ద్వారా వచ్చిన సొమ్మును ఇద్దరి అనుచరులు సుమారు 40 మంది నెల నెలా పంచుకునేవారు.

పేకాట స్థావరాల నిర్వహణ

గుడిపాల మండలానికి చెందిన ఓ వైసీపీ నేత పేకాట క్లబ్ నిర్వహించి రూ.లక్షలు సంపాదించారు. అలాగే నగరంలోని ద్వితీయ శ్రేణి నాయకులు శివారు ప్రాంతాల్లో పేకాట స్థావరాలను ఏర్పాటు చేసుకుని స్థాయికి తగినట్లు సంపాదించుకున్నారు. వీరందరికీ పోలీసుల నుంచి ఇబ్బందులు లేకుండా విజయానందరెడ్డి, పూర్వ ప్రజాప్రతినిధి రక్షణ కల్పించేవారు.

టీడీపీ ఎంపీ అభ్యర్థి అనుచరులపై దాడి

టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు అనుచరుల్లో ముగ్గుర్ని ఇటీవల అర్ధరాత్రి విజయానందరెడ్డి అనుచరులు దాడి చేశారు. వారి నుంచి డబ్బుల్ని లాక్కున్నారు. పోలీసులు కూడా బాధితుల మీదే కేసు పెట్టారు.

ఇదీ విజయానంద ప్రస్థానం

లారీ డ్రైవర్‌గా మొదలై..

నేనూ ఒకప్పుడు మీలాగే డ్రైవర్‌ని. డ్రైవర్ల కష్టాలు నాకు తెలుసు.

- ఇటీవల ఆటో డ్రైవర్ల సమావేశంలో వైసీపీ అభ్యర్థి విజయానందరెడ్డి తన ప్రస్థానాన్ని గుర్తుచేసుకున్నారు. ఆయన చెప్పిన ప్రకారం.. సామాన్య కుటుంబం నుంచి లారీ డ్రైవరుగా జీవితాన్ని ప్రారంభించారని అనుకోవాలి. ఇలా లారీ డ్రైవర్లుగా ఉన్న వాళ్లు తమ కష్టంతో తర్వాత యజమానులు అయి ఉండొచ్చు. కానీ, రూ.వేల కోట్ల ఆస్తిపరులు కాలేదు.. కాలేరు. విజయానందరెడ్డి మాత్రం కాగలిగారు. ఇందుకు ఆయన ఎంచుకున్న మార్గం ఎర్రచందనం అక్రమ రవాణా.

కాంగ్రెస్ హయాంలో 'ఎర్ర' స్మగ్లింగ్

విజయానందరెడ్డిపై వివిధ పోలీసు స్టేషన్లలో 2014వ సంవత్సరంలో 12 ఎర్రచందనం కేసులు నమోదయ్యాయి. దీంతో ఎర్ర చందనం స్మగ్లరుగా ఆయన పేరు బయటకొచ్చింది. అంతకుముందు ఉమ్మడి రాష్ట్రంలో పదేళ్లపాటు కాంగ్రెస్ అధికారంలో ఉంది. ఆ సమయంలోనే అధికారం అండగా ఆయన ఎర్రచందనం అక్రమ రవాణా జోరుగా సాగించినట్లు విమర్శలున్నాయి. అప్పటికే 'ఎర్ర' ధనాన్ని విపరీతంగా పోగేసుకున్నారు. ఆ తర్వాత వైసీపీలో చేరారు. 2014 ఎన్నికల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని రిజర్వుడు నియోజకవర్గాలకు, మరికొందరు అభ్యర్థులకు ఆర్థిక సాయం చేసినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. దీంతో విజయానందరెడ్డి గురించి రాజకీయంగా చర్చ జరిగింది.

టీడీపీ హయాంలో సెంట్రల్ జైలుకు..

2014లో టీడీపీ అధికారంలోకి వచ్చాక ఎర్రచందనం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపింది. అలా చిత్తూరుకు సంబంధించి విజయానందరెడ్డిపై ఆ ఏడాదిలోనే వివిధ పోలీసు స్టేషన్లలో 12 కేసులు నమోదయ్యాయి. చిత్తూరు వన్‌టౌన్‌లో 3, కేవీపల్లె, బంగారుపాళ్యంలో రెండేసి, పీలేరు, గుడిపాల, పెనుమూరు, ఎస్ఆర్‌పురంలలో ఒక్కోటి చొప్పున కేసులున్నాయి. అలాగే 2014 ఎన్నికల సమయంలో మద్యం అక్రమ రవాణాకు సంబంధించి ఇంకో కేసు కూడా ఉంది. ఆ తర్వాత పీలేరు సబ్ జైలులో, కడప సెంట్రల్ జైలులో కొన్నాళ్లు, రాజమండ్రి సెంట్రల్ జైలులో సుమారు ఆరు నెలలు గడిపారు.

వైసీపీ వచ్చాక పవర్ సెంటర్‌గా..

2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక విజయానందరెడ్డి చిత్తూరులో పవర్ సెంటర్‌గా మారారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఉన్నా.. అధికారులంతా ఆయన మాటే వినేలా సెటప్ చేసుకున్నారు. ఎమ్మెల్యేకు పవర్ లేకుండా చేసి ఆయనకు వ్యతిరేకవర్గంగా మారారు. మూడేళ్ల కిందట చిత్తూరు నగరపాలక సంస్థ ఎన్నికల్లో పూర్వ ప్రజాప్రతినిధి, ఓ కార్పొరేషన్ ఛైర్మన్‌తో కలిసి దౌర్జన్యంగా కార్పొరేటర్లను ఏకగ్రీవాలు చేసుకోవడంలో చొరవ చూపారు. వీరికి అప్పటి పోలీసు అధికారులు సహకరించి నామినేషన్లు వేసిన ప్రత్యర్థులను బెదిరించారు. 50 డివిజన్లలో 36 చోట బెదిరింపులు, దొంగ సంతకాలు, నామినేషన్ పత్రాలు చించేయడం.. వంటి దుశ్చర్యలతో ఏకగ్రీవం చేసుకున్నారు.

ఇప్పుడు ఎమ్మెల్యే అభ్యర్థిగా..

2024 ఎన్నికల్లో పోటీ చేయాలన్న ప్రణాళికతో గత ఐదేళ్లుగా ఆయన చిత్తూరులో రాజకీయాలు నడిపారు. స్థానికంగా ఎమ్మెల్యే ఉన్నప్పటికీ పార్టీ పరంగా ఈయనకే సహకారం అందింది. దీనికి సామాజికవర్గం ఓ కారణమన్న విమర్శలున్నాయి. ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పదవీ వచ్చింది. ఇక, 'ఎర్ర' ధనంతో సేవా కార్యక్రమాలు చేపట్టారు. వ్యాపారుల్ని ఆకట్టుకునేందుకు మార్కెట్‌కు గేటు ఫీజును చెల్లించడం, నియోజకవర్గంలో ప్రజలకు సంక్రాంతి, రంజాన్, క్రిస్మస్ పండుగలకు దుస్తులు, స్వీట్లు పంపిణీ చేశారు. అనుకున్నట్లుగానే ఇప్పుడు చిత్తూరు అసెంబ్లీకి వైసీపీ అభ్యర్థిగా మారారు. ఎర్రచందనం స్మగ్లర్‌కి వైసీపీ టిక్కెట్ ఇచ్చిందన్న విమర్శలు విపక్షాల నుంచి వినిపిస్తున్నాయి.

విజయానందరెడ్డిపై 12 ఎర్రచందనం, ఒక మద్యం అక్రమ రవాణా కేసులు నమోదయ్యాయి. వీటిని ఆయన నామినేషన్ సందర్భంగా తన అఫిడవిట్‌లోనూ చూపారు. ఇవన్నీ 2014లో నమోదైనవే.

1. పీలేరు పోలీస్‌స్టేషనులో 39/2014 ఎఫ్ఐఆర్ నెంబరుతో ఒక కేసు నమోదైంది.

2. జీడీనెల్లూరు స్టేషనులో 33/2014 నెంబరుతో..

3, 4. కేవీపల్లె స్టేషనులో 77/2013, 3/2014 నెంబర్లతో రెండు కేసులు

5, 6. బంగారుపాళ్యం స్టేషనులో 35/2014, 74/2014 రెండు కేసులు

7, 8, 9. చిత్తూరు వన్ టౌన్ స్టేషనులో 73/2014, 75/2014, 101/2014 మూడు కేసులు

10. పెనుమూరు స్టేషన్‌లో 58/2014 నెంబరుతో

11. గుడిపాల స్టేషన్‌లో 86/2015 ఎఫ్ఐఆర్ నెంబరు

12. ఎస్ఆర్‌పురంలో 78/2014 నెంబరుతో

13. హైదరాబాదులోని సీఐడీ స్టేషనులో 51/2014 మద్యం అక్రమ రవాణా కేసు నమోదైంది.

● మరెన్నో అక్రమాలు

సొంత పార్టీ నేతనే అరెస్టు చేయించారని..!

చిత్తూరు నగరంలోని 50 డివిజన్లలో ఐదారుగురే కర్ణాటక మద్యాన్ని విక్రయించాలని అప్పటి ఓ ప్రజాప్రతినిధితో కలిసి రెండేళ్ల కిందట తీర్మానించారు. వీరి మాటను కాదని విక్రయించే వారిపైకి పోలీసులను దించుతారు. ఇలా అధికారపార్టీకి చెందిన ఓ కార్పొరేటర్ కర్ణాటక నుంచి మద్యం తీసుకొస్తుండగా, గంగవరం సమీప రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నారు. అతడిని పోలీసులు పట్టుకోవడం వెనుక విజయానందరెడ్డి హస్తం ఉందని విమర్శలు వచ్చాయి.

ఇసుకలో దండుకుని..

వైసీపీ అధికారంలోకి వచ్చిన కొత్తలో ఇసుక తవ్వకాలను ప్రైవేటు సంస్థకు అప్పగించింది. అప్పట్లో విజయానందరెడ్డి జీడీనెల్లూరు మండలం నందనూరు రీచ్‌ను తీసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా కేటాయించిన దానికంటే అధికంగా ఇసుకను తవ్వేశారు. వందలాది టిప్పర్లతో చెన్నై, బెంగుళూరుకు ఇసుకను అక్రమంగా తరలించారు. రూ.కోట్లు వెనకేసుకున్నారు.

ప్రభుత్వ స్థలాల ఆక్రమణలో అనుచరుల పాత్ర

చిత్తూరు నగర శివారులోని పలు ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలకు వైసీపీ ప్రజాప్రతినిధి, విజయానందరెడ్డి అనుచరులు పట్టాలు తయారుచేసి విక్రయించారు. ఇలా మురకంబట్టు, దొడ్డిపల్లె, ప్రశాంత్‌నగర్, బోడికొండ తదితర ప్రాంతాల్లో ఫోర్జరీ పట్టాలు సృష్టించి ఒక్కో ఇంటి స్థలాన్ని రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు అమ్ముకున్నారు. ఇటీవల ఓ మహిళకు చెందిన ఇంటి స్థలాన్ని విజయానందరెడ్డి అనుచరుడు ఆక్రమించుకుని.. వారు కట్టిన గోడను కూల్చేశాడు.

ఏం చేశారు?

2019లో వైసీపీ గెలిచాక పూర్తి స్థాయి రాజకీయ నాయకుడిగా మారిపోయిన విజయాందనరెడ్డి ఆర్టీసీ వైస్ ఛైర్మెన్ పదవి తెచ్చుకున్నారు. కానీ, చిత్తూరు బస్టాండును అభివృద్ధి చేయలేదు. కొత్త రూట్లకు బస్సుల్ని వేయలేదు.

విజయానంద ఇంటికి జగన్

2018లో జిల్లాలో విపక్ష నేతగా పాదయాత్ర చేసిన జగన్.. ఎస్ఆర్‌పురంలోని విజయానందరెడ్డి ఇంటికి వెళ్లారు. జగన్‌తో ఆయనకున్న సంబంధాలకు ఇదో నిదర్శనం. అందుకనే ఎర్రచందనం అక్రమ రవాణా కేసులున్నా ఆయనకు టికెట్ ఇచ్చారని అంటారు.

మంత్రులూ రావాల్సిందే

2019 తర్వాత కొందరు మంత్రులు చిత్తూరుకు వస్తే విజయానందరెడ్డి ఇంటికి వచ్చేవారు. అలాంటి వారిలో అటవీశాఖ మంత్రి కూడా ఉండటం గమనార్హం. తొలినాళ్లలో జిల్లాకు చెందిన ఓ మంత్రినైతే ఆయన జేబులో మనిషిగా చెప్పుకొనేవారు.

ఎట్టెట్టా

ఓటు ధర పెంచలా..!

వైసీపీ అధికారంలోకి వచ్చాక కరెంటు, ఆర్టీసీ చార్జీలు బాదేశారు. నిత్యావసరాల ధరలు మండిపోతున్నాయి. మరి, ఓటు ధర మాత్రం పెంచలా.. ఇదీ పలువురు ఓటర్ల మాట. మైకుల ముందు ఎవరెన్ని నీతి మాటలు చెప్పినా.. ఓటర్లకు అభ్యర్థులు డబ్బులు పంచడం.. వారు తీసుకోవడం అనేది బహిరంగ రహస్యంగా మారింది. జిల్లాలో 2019 ఎన్నికల సమయంలో పంపిణీ చేసిన మొత్తాన్నే ఈసారీ పంచుతున్నారు. దీంతో అన్ని ధరలు పెరిగిన నేపథ్యంలో ఓటు ధర ఎందుకు పెరగలేదని చర్చించుకుంటున్నారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

'మందు' జాగ్రత్త



మందుబాబులు ముందే జాగ్రత్త పడ్డారు. పోలింగ్‌ను దృష్టిలో పెట్టుకుని శనివారం సాయంత్రం 6 గంటల నుంచి సోమవారం సాయంత్రం వరకు మద్యం దుకాణాలు మూసివేయనున్నారు. దీంతో శుక్రవారమే ప్రభుత్వ మద్యం దుకాణాలకు ఎగబడ్డారు. ఈ రెండు రోజుల సరిపడా బీర్లు, మద్యం బాటిళ్లు తీసుకెళ్లారు. దీంతో చిత్తూరు నగరంలోని అన్ని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో శుక్రవారం మధ్యాహ్నానికే స్టాకు అయిపోయింది. దీంతో ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎలైట్ దుకాణం మీద పడ్డారు. అక్కడ వారికి అవసరమైన బ్రాండ్లు లేకపోయినా ఉన్నవాటితో అడ్జస్ట్ అయి తీసుకెళ్లారు. దీంతో ఎలైట్‌లోనూ కాసేపటికీ మద్యం ఖాళీ అయిపోయింది.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి




రివర్స్ గేర్

ఊర్లే రెక్కలు రాలగొట్టేలా వుండారే!

'వోరే ముండెల్లి వోణ్ణి ఆపండ్రా..' అని కార్యకర్తల్ని తోలతా వుండారంట ఆ పార్టీ వోల్లు. 'ఇటుమంటోల్లే మన ఫ్యాను రెక్కలు రాలగొట్టేలా ఉండారే..' అనేసి తెగ గాబరా పడిపోతా వుండారంట. అసలే కరంటు కోతలు. ఫ్యాను పైన ఫ్యాన్లు తిరగడం ల్యా. ఒకటే ఉక్కపోత. ఈ తిరగని ఫ్యాన్లు బయపెడతా వుండాయి అధికారపెచ్చమోల్లని. ఈ పంపకాలు గతి తప్పి, ఎన్నికల్లో గూడా రెక్కలు ఊడతాయేమోన్న బయం పట్టేసుకుండాది. ఇప్పుడు పంపకాలు జోరుగా సాగతా వుండాయి గదా. మూటలకు మూటలు దిగిపోయి ఓటరుకు నాలుగు ఎయ్యిలు పంచేవని జోరుగా సాగతా వుండాది. అంతా బాగానే ఉండాదిగానీ, పంపకాలకోసరం కాసులు అప్పగించిన నమ్మకస్తులు కొందురు తప్పతాగి రాత్తిరేల ఈదిల్లో పడి, ఎక్కడబడితే అక్కడ తిరగతా వుండారంట. వోల్లకి అప్పగించిన ఏరియా గాకుండా ఇంగో ఏరియాలో తిరిగేస్తూ తెలిసినోల్లు కనిపిస్తే సాలు.. మూటలిప్పి కాసులు పంచేస్తావుండారంట. ఆ పంపకాలు జేస్తున్న మనిసి, తమ ఈదికి లేదా వార్డుకు కేటాయించిన వ్యనిసని అప్పటికే గుర్తించేసిన అసలైన ఈదిలోని జనం పోలోమంటా గొడవకు దిగిపోతా వుండారు. బేస్తవారం రేత్తిరి ఇట్టాంటిదే గొడవ జరిగింది కుప్పం మున్సిపాలిటీలో. కొత్తపేట ఏరియాలో ఎక్కడో డబ్బులు పంచాల్సిన మనిషి, మొందు ఫుల్లుగా కొట్టేసి ఇంకెక్కడో తేలి పంపకాలు మొదులు పెట్టేసినాడంట. ఇది తెలుసుకున్న ఈ ఏరియాలోని జనం తిరగబడినారంట. గొడవ గొడవ అయిపొయ్యింది. అనాక సంగతి తెలుసుకున్న అటుమంటి పంపకాల్లోనే ఉన్న పార్టీవోల్లెవురో గొడవ జరగతా వుండే చోటుకు ఎల్లి, మన మందు వీరుడిని ఎనక్కి తీసుకొచ్చేసినారంట. 'మీరేం కంగారు పడబాకండి. మీ కాసులు మీకు చేర్చే బాధ్యత మాది.' అని జనానికి సర్ది చెప్పేసరికి వాల్ల తల ప్రాణం తోకకొచ్చిందంట. ఇంగ అప్పటికే పంపకాలు జరిగిపోయిన కాసులు ఎవరు తీసుకున్నారో తెలీక సతమతమైపొయ్యినారంట. ఎవరిని అడిగితే ఏ గొడవకొస్తారోనని బయటపడి, 'పోతేపొయ్యినాయి కాసులు, మానం మిగిలితే అంతే జాలు..' అనేసి ఎనక్కొచ్చేసినారంట.

- కుప్పం



నేటితో ప్రచారానికి తెర

తిరుపతి(కలెక్టరేట్), మే 10: ఎన్నికల ప్రచారానికి శనివారం సాయంత్రం ఆరు గంటలకు తెరపడనుంది. ఆ తర్వాత ఎవరైనా బహిరంగ సభలు, ప్రచారాలు నిర్వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎన్నికల సంఘం తెలిపింది. సోషల్, ఎలక్ట్రానిక్ మీడియాలో ఎగ్జిట్ పోల్స్‌పైనా నిషేధం విధించారు. పార్లమెంటు స్థానానికి 23మంది, ఏడు అసెంబ్లీ స్థానాలకు 133మంది కలిపి 156 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. అసెంబ్లీకి సంబంధించి తిరుపతిలో అత్యధికంగా 46మంది పోటీ చేస్తుండగా, చంద్రగిరిలో 24మంది బరిలో నిలిచారు. 2,140 పోలింగ్ కేంద్రాలకుగాను 1,401 చోట్ల వెబ్ కాస్టింగ్‌కు ఏర్పాటు చేస్తున్నారు. తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లో మాత్రం అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ వెబ్‌కాస్టింగ్ ఉంటుంది. సూళ్లూరుపేటలో 150, గూడూరు 147, వెంకటగిరి 149, శ్రీకాళహస్తి 139, సత్యవేడు 139 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నారు. 14,759మంది పోలింగ్ సిబ్బంది విధుల్లో ఉండనున్నారు. శనివారం సాయంత్రం ఏడు నుంచి 13వ తేదీన సాయంత్రం ఏడు గంటల వరకు జిల్లాలోని మద్యం దుకాణాల, బార్లు మూసివేయనున్నారు. ఆదివారం మధ్యాహ్నం నుంచే స్ట్రాంగ్‌రూమ్‌ల నుంచి పోలింగ్ సామగ్రిని ఆర్వోలు, ఎన్నికల విధుల్లోని సిబ్బందికి పంపిణీ చేస్తారు. సోమవారం జరిగే పోలింగ్ ప్రక్రియను పరిశీలించేలా కలెక్టరేట్‌లో ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఇక్కడినుంచే అబ్జర్వర్లు, కలెక్టర్, ఎస్పీ తదితరులు పరిశీలించనున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, డీఐజీ బాజాపాయ్, డీఆర్వో పెంచలకిషోర్ సమీక్షించారు.

వెనక్కొచ్చిన 82వేల ఓటర్లుస్లిప్పులు ఎవరివి?

● అత్యధికం తిరుపతిలోనే

తిరుపతి(కలెక్టరేట్), మే 10 : జిల్లావ్యాప్తంగా ఓటరు స్లిప్పుల పంపిణీ గురువారంతో పూర్తయింది.మొత్తం 18,12,980మంది ఓటర్లుండగా 83వేల స్లిప్పులు వెనక్కి రావడంతో అధికార యంత్రాంగం ఖంగుతింది.ఓటర్లలో పదిశాతం మంది ఒకవేళ ఊరికి వెళ్లివున్నా, ఆరోగ్యం బాగాలేక ఆస్పత్రికి వెళ్లివున్నా మిగిలిన 70వేల స్లిప్పుల విషయం ఏం చేయాలో వెనక్కి రావడంతో కలెక్టరేట్ అధికారులు ఖంగుతిన్నారు.చంద్రగిరి, తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గాలో అధికార పార్టీ నేతలు భారీఎత్తున దొంగ ఓట్లను చేర్పించడం, ఊరు వదిలి వెళ్లిన, మృతి చెందిన వారి ఓట్లు తొలగించకుండా బీఎల్వోలపై తీవ్రమైన ఒత్తిడి తీసుకురావడంతో ఓటర్ల ప్రత్యేక సవరణ జాబితాలో కూడా వాటిని తొలగించలేదు. దీనిపై ప్రతిపక్షాలు కేంద్ర ఎన్నికల సంఘానికి సైతం ఫిర్యాదు చేసినా జిల్లా యంత్రాంగం స్పందించలేదు. తిరుపతి నగరంలో 3,02,503 ఓట్లుండగా ఇందులో దాదాపు 60 వేల ఓటర్ల ఆచూకీ తెలియడంలేదు.తరువాతి స్థానం చంద్రగిరి, వెంకటగిరి దక్కించుకున్నాయి.

ఓటరు స్లిప్పుల గల్లంతు కేసులో ఇద్దరి అరెస్టు

66 స్లిప్పులు...రూ 500 సీజ్

తిరుపతి(నేరవిభాగం): తిరుపతిలో ఓటరు స్లిప్పులు గల్లంతైన కేసులో అలిపిరి పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 59 స్లిప్పులు స్వాధీనం చేసుకుని రూ 500 సీజ్ చేశారు. డీఎస్పీ సురేంద్రరెడ్డి కథనంమేరకు.....తిరుపతిలోని జీవకోనకు చెందిన విఘ్నేష్, చెన్నారెడ్డి కాలనీకి చెందిన మౌనిష్ స్నేహితులు.అంబేద్కర్ కాలనీలోని వార్డు నెంబరు 41-2 సచివాలయం వద్దకు గురువారం వెళ్లారు. అక్కడ వీఆర్వో రమ్యశ్రీ తన బ్యాగులో ఓటరు స్లిప్పులు వుంచి అందులోనే కొంత డబ్బు పెట్టి బ్యాగు టేబుల్‌పైన వుంచి భోజనానికి వెళ్లారు. దీన్ని గమనిస్తుండిన విఘ్నేష్, మౌనిష్ వాటిలో 66 ఓటరు స్లిప్పులను అపహరించారు.దాదాపు 86 స్లిప్పులు కింద పడి వుండడం గమనించిన రమ్యశ్రీ మిగిలిన స్లిప్పులు కనపడక పోవడంతో వెంటనే రిటర్నింగ్ అధికారి అదితిసింగ్‌కు ఫిర్యాదు చేశారు. ఆమె ఆ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా విచారణకు ఆదేశించారు. జరిగిన ఘటనపై వీఆర్వో, పోలింగ్ బూత్ నెంబరు 48 బీఎల్‌వో రమ్యశ్రీ అలిపిరి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసారు. పోలీసులు గురువారం దొంగతనం కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.అనుమానంతో ఇద్దరిని పట్టుకుని విచారించారు. రమ్యశ్రీ వారిని గుర్తు పట్టడంతో విఘ్నేష్, మౌనీష్‌లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 66 ఓటరు స్లిప్పులు, రూ 500 స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన ఏడు స్లిప్పులు ఏమయ్యాయనే కోణంలో నిందితులను విచారిస్తున్నారు.

బైక్ బోల్తా

ఇద్దరు చిల్లకూరు యువకుల దుర్మరణం



వేణు, ఆకాష్ (ఫైల్‌ఫొటోలు)

పెళ్లకూరు, మే 10: నెల్లూరు జిల్లా మనుబోలు పోలీస్‌స్టేషన్ సమీపంలో చెన్నై - కోల్‌కతా జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బండి వేణు(19), చల్లా ఆకాష్(20) దుర్మరణం చెందారు. తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం చిల్లకూరుకి చెందిన బండి చంద్రయ్యకు ఇద్దరు పిల్లలు. ఆయన కూలీ చేసుకుంటూ జీవిస్తున్నాడు. కుమారుడు వేణు ఇటీవల ఇంటర్ పూర్తి చేశాడు. నాలుగురోజుల క్రితం కుమారుడికి సెకండ్ హ్యాండ్ బైక్ తీసిచ్చాడు. బైక్‌కు కట్టాల్సిన డబ్బులు, పేరు మార్పు కోసం వేణు చిల్లకూరుకి చెందిన తన స్నేహితుడు చల్లా ఆకాష్‌ను తీసుకుని నెల్లూరుకి వెళ్లారు. మధ్నాహ్నం రెండు గంటల సమయంలో నెల్లూరు నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. మనుబోలు వద్దకు వచ్చేసరికి ముందు వెళుతున్న లారీని అధిగమించబోయి ఎడమపక్కకు రాగా, సర్వీసు రోడ్డు స్టాఫ్ బోర్డును ఢీకొని బైక్ బోల్తా పడింది. ప్రమాద స్థలంలోనే తలచిద్రమై వేణు మృతి చెందాడు. ఆకాష్ తీవ్రగాయాలతో రోదిస్తుండగా 108లో గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నెల్లూరుకి తరలించారు. చికిత్స పొందుతూ ఆకాష్ కూడా మృతిచెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మనుబోలు ఎస్ఐ అజయ్‌కుమార్ తెలిపారు. రెండు కుంటుంబాల్లో ఒక్కగానొక్క కుమారులు మృత్యువాత పడడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

బుచ్చినాయుడుకండ్రిగ, మే 10: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని తహసీల్దార్ పటాన్ మహమ్మద్ ఆలీఖాన్ తెలిపారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో జోనల్ అధికారులు, బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రంలో అవసరమైన వసతులతో పాటు తాగునీరు, మరుగుదొడ్లు ఉండేలా చేయాలన్నారు. పోలింగ్ బూత్ దగ్గర ఓటర్లకు షామియానా వేయాలన్నారు. స్లిప్‌లను ఓటర్లందరికీ అందించాలని స్పష్టం చేశారు. ఓటర్లందరూ ఓటింగ్‌లో పాల్గొనేలా ప్రజలను చైతన్య పరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జోనల్ అధికారి రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీఏ కూటమితోనే రాష్ట్రానికి భవిత



ప్రచారం చేస్తున్న ఆదిమూలం, ఎస్సీవీ నాయుడు తదితరులు

వరదయ్యపాళెం, మే 10: ఎన్డీఏ కూటమితోనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి కోనేటి ఆదిమూలం, మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు అన్నారు. వరదయ్యపాళెం పంచాయతీలో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. యువతకు ఉపాధి లభించాలన్నా, మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నా ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అదే విధంగా ముస్లిం మైనార్టీల మద్దతును కోరారు. చిన్నపాండూరు పంచాయతీ వడ్డిపాళెం, వీకేఆర్‌పై కాలనీలో పర్యటించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు యుగంధర్‌రెడ్డి, నిర్మల్, పవన్, నరసరాజు, కరుణాకర్ నాయుడు, చలపతినాయుడు, మహేష్, హరినాయుడు, శివయ్య, వెంకటేశ్వర్లు, మల్లి, జనసేన నాయకులు తడ శ్రీను, చిరంజీవి, పురుషోత్తం, సుబ్బరత్నమ్మ, సిద్ధులయ్య, బీజేపీ నాయకులు దిలీప్‌రాయల్, జానకిరామయ్య, సురేష్‌నాయుడు, సూర్యనారాయణ, ప్రదీప్, ఏసు, సుబ్రహ్మణ్యం, మోహన్‌నాయుడు, మునెయ్య, తులసీరామ్, కుమార్‌నాయుడు, శివ తదితరులు పాల్గొన్నారు.

యుద్ధంలో అంతిమ విజయం ధర్మానిదే: టీడీపీ

పిచ్చాటూరు, మే 10: సార్వత్రిక ఎన్నికల యుద్ధంలో అంతిమ విజయం ధర్మాన్నే వరిస్తుందని టీడీపీ నాయకులు అన్నారు. శుక్రవారం పిచ్చాటూరు మండలంలోని కొత్త గొల్లకండ్రిగ, పాత గొల్లకండ్రిగ, అద్దాలమేడ, లక్ష్మీవిలాసపురం, తులసిక్రిష్టాపురం, వీఆర్ కండ్రిగ, రెప్పాలపట్టు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మేనిఫెస్టోను వివరించి ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మండలంలోని బంగాళా గ్రామానికి చెందిన పాలేగార్, యాదవ కులాలకు చెందిన 40 కుటుంబాలు క్లస్టర్ ఇన్‌చార్జి ఇళం గోవన్‌రెడ్డి సమక్షంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు జయచంద్రనాయుడు ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో పుండరీకం నాయుడు, పద్దు రాజు, దీన దయాల్‌రెడ్డి, గోవర్ధన్ యాదవ్, రమేష్, మునిశేఖర్‌రెడ్డి, దూలినేని ప్రేమ్ బాబు, రాజా, గిరిబాబు, బాలాజీ, ఆనందయ్య, రవి, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కనుమరుగు: చింతా

శ్రీకాళహస్తి, మే 10: సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ కనుమరుగు అవడం ఖాయమని కాంగ్రెస్ తిరుపతి ఎంపీ అభ్యర్థి చింతామోహన్ అన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చింతా మోహన్ మాట్లాడుతూ... జగన్ అరాచకాలకు ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఆయన సొంత చెల్లెలు షర్మిల అడిగే ప్రశ్నలకు జగన్ ఎందుకు సమాధానాలు చెప్పలేకపోతున్నారని నిలదీశారు. రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధ్యాయులందరూ ప్రభుత్వంపై తిరుగుబాటు చేశారని, పోస్టల్ బ్యాలెట్ ఎన్నికల్లో వైసీపీకి ఘోర పరాభవం ఎదురైందని చెప్పారు. ఎన్నికల్లో హస్తం గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి

సత్యవేడు, మే 10: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సుధాకర్‌నాయుడు అన్నారు. సత్యవేడులో శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించుకుని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకుందామని కోరారు. బీజేపీ మండల అధ్యక్షుడు హరిబాబురెడ్డి ఆధ్వర్యంలో చెక్క భజనతో కోలాటాలతో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు



వడమాలపేట, మే 10: మండలంలోని బట్టీ కండ్రిగలోని యాదవ కుటుంబాలకు చెందిన వైసీపీ నాయకులు శుక్రవారం టీడీపీలో చేరారు. వారందరికీ భానుప్రకాష్ కండువాలు కప్పి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో మునెయ్య, కృష్ణయ్య, మునికృష్ణయ్య, మహేంద్ర, మురళి, మునిరత్నం, ఈశ్వరయ్య ఉన్నారు. కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు అబ్బురాజు, అధికార ప్రతినిధి ధనంజయులు నాయుడు, అజిత్, పొన్నయ్యరాజు, శ్రీధర్ వర్మ, చంద్రశేఖర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

కేవీబీపురం: మండలంలోని రాగిగుంట గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నుంచి శుక్రవారం టీడీపీలో చేరారు. వారికి కోనేటి ఆదిమూలం కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు రామాంజులు నాయుడు, తెలుగు రైతు జిల్లా కార్యదర్శి గోపీనాథరెడ్డి, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి సత్యవేడు

స్కూటర్‌ను ఢీకొన్న ట్రాక్టర్

ఒకరికి గాయాలు

ఏర్పేడు, మే 10: ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టరు ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలైన ఘటన ఏర్పేడు మండలంలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. సీఐ శ్రీరామ శ్రీనివాసులు కథనం మేరకు... రాజులకండ్రిగ గ్రామానికి చెందిన రఘు ద్విచక్రవాహనంపై పాపానాయుడుపేటకు బయలుదేరాడు. ఫైల్‌సెంటర్ నుంచి రాజులకండ్రిగకు వస్తున్న ట్రాక్టర్‌ను స్కూటర్‌ను ఢీకొంది. ఈప్రమాదంలో గాయపడిన రఘును స్థానికులు శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

రెండు కుటుంబాల ఘర్షణ

ముగ్గురిపై కేసు

ఏర్పేడు, మే 10: ఏర్పేడు మండలం పాగాలి పంచాయతీ కృష్ణంపల్లి గ్రామానికి చెందిన చెంగల్రాయులురెడ్డి, రోగిరెడ్డి కుటుంబాల మధ్య గత కొంతకాలంగా భూవివాదం ఉంది. రెండు కుటుంబాల మధ్య శుక్రవారం సాయంత్రం పొలం వద్ద ఘర్షణ జరిగింది. చెంగల్రాయులురెడ్డిపై రోగిరెడ్డి కుటుంబసభ్యులు దాడి చేశారు. చెంగల్రాయులురెడ్డి ఫిర్యాదు మేరకు రోగిరెడ్డి, ఆయన కుమారుడు రమేష్‌రెడ్డి, మనవడు జయపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీరామ శ్రీనివాసులు తెలిపారు.

ఓటుతోనే భవిష్యత్తు నిర్ణయం: సుధీర్ రెడ్డి



శ్రీకాళహస్తి, మే 10: ఓటుతో మంచి నేతలను ఎన్నుకోవడం ద్వారానే మన భవిష్యత్తును నిర్ణయించుకోగలమని ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో అమూల్యమైందన్నారు. వైసీపీ ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని విధ్వంసం చేసిందని చెప్పారు. శ్రీకాళహస్తిలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి చేసిన అవినీతి, అరాచకాలకు అంతే లేకుండా పోయిందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు దుష్ట పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. దుర్మార్గుడి కబంధహస్తాల నుంచి శ్రీకాళహస్తిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. తన తండ్రి, మాజీ మంత్రి బొజ్జల గోపాల కృష్ణారెడ్డి సుదీర్ఘ రాజకీయ జీవితంలో చిన్న మచ్చ లేకుండా ప్రజా అభివృద్ధి కోసం పరితపించారని గుర్తుచేశారు. ఐదుసార్లు ప్రజలు ఆదరించి గుండెల్లో స్థానం ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. అయితే తన తండ్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి మరణించడం, ఆయన కర్మక్రియ రోజునే చిన్నాన్న హరినాథ్ రెడ్డి కూడా అనంత లోకాలకు వెళ్లిపోవడంతో తన కుటుంబానికి దిక్కుతోచని పరిస్థితి ఎదురైందన్నారు. అయితే నియోజకవర్గంలోని అన్నివర్గాల ప్రజలందరూ బొజ్జల కుటుంబానికి అండగా నిలబడి ధైర్యంగా ముందుకు నడిపిస్తున్నారన్నారు. ప్రజల అభిమానం రూపంలో తన నాన్న, చిన్నాన్నను చూసుకుంటున్నానని చెప్పారు. ఈసారి ప్రజలు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఓటు వేయాలన్నారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టం అనేది ప్రజల ఆస్తి హక్కు భంగం కలిగిస్తుందని చెప్పారు. వైసీపీకి ఓటు వేస్తే ప్రజల తమ ఆస్తులను జగన్‌కు అప్పగించినట్లేనని అన్నారు. ఈనెల 13వ తేదీన జరిగే సార్వత్రిక ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై తనను ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. శ్రీకాళహస్తిలో తనను గెలిపిస్తే శాంతిభద్రతలు పటిష్ఠంగా అమలు చేయడంతో పాటు అన్ని రంగాల్లోనూ అభివృద్ధిని పరుగులు తీస్తానని హామీ ఇచ్చారు. తన తండ్రి తరహాలోనే ఒక అవకాశం ఇస్తే ప్రజల మందలతో మళ్లీ గెలిపించుకునేలా నిస్వార్థంగా పనిచేస్తానని చెప్పారు.

టీడీపీతోనే కార్మికుల అభ్యున్నతి

టీడీపీతోనే కార్మికుల అభ్యున్నతి సాధ్యమని ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆటో కార్మికులు, మెకానిక్‌లు పెద్ద సంఖ్యలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



కార్మికులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న రిషిత రెడ్డి

కూటమిదే గెలుపు, ధర్మానిదే విజయం



వాకాడు మండల నాయకులతో ఎంపీ అభ్యర్థి వరప్రసాదరావు

తిరుపతి, మే10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్డీఏ కూటమిదే గెలుపు, ధర్మానిదే విజయమని టీడీపీ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ స్పష్టం చేశారు. శుక్రవారం కోర్టు ప్రాంగణంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాద రావు సతీమణి లక్ష్మీతో కలసి సుగుణమ్మ ప్రచారం చేపట్టారు. న్యాయవాదులను పేరుపేరున పలకరించి ఎంపీ అభ్యర్థికి కమలం గుర్తుపై, ఎమ్మెల్యే అభ్యర్థికి గాజుగ్లాసు గుర్తుపై ఓటువేయాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు. టీడీపీ నగర అధ్యక్షుడు చినబాబు, లీగల్‌సెల్ నాయకులు దినకర్, వేణుగోపాల్, వసుమతి, బుల్లెట్ రమణలు పాల్గొన్నారు. అలిపిరిలో బీజేపీ ఇంటింటా ప్రచారం, రోడ్‌షో నిర్వహించింది. తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్‌రావు సతీమణి కొల్లూరి లక్ష్మి, కుమార్తె డాక్టర్ స్ఫూర్తి ప్రచారంలో పాల్గొని ఎన్డీఏ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.

పొదలకూరు/వాకాడు: ప్రజల స్పందన చూస్తుంటే ఎన్డీఏ కూటమిదే ఘన విజయమని తెలుస్తోందని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు అన్నారు. శుక్రవారం పొదలకూరులో సర్వేపల్లి టీడీపీ అభ్యర్థి, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డితో కలసి ఎన్నికల ప్రచార ర్యాలీలోపాల్గొన్నారు. దళితుల పట్ల అవమానకరంగా వ్యవహరించే ఈ పార్టీని ప్రజలు భూస్థాపితం చేసేరోజు వచ్చిందన్నారు. ఒక్కచాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన వైసీపీ రాష్ట్ర అభివృద్ధిని పక్కనపెట్టి వనరుల దోపిడీకి ప్రాధాన్యం ఇచ్చి దానిని ప్రశ్నించిన తనను అవమానకరరీతిలో బయటకు పంపారన్నారు. వాకాడు మండల టీడీపీ, బీజేపీ నాయకులతో వరప్రసాద్ సమాలోచనలు జరిపారు. అధికార వైసీపీ ప్రలోభాలకు ప్రజలు గురికాకుండా వారికి వాస్తవ పరిస్థితులు వివరించి ఎన్డీఏ అభ్యర్థులకు ఓట్లు వేసేలా అందరూ కృషి చేయాలని కోరారు.



కోర్టు ప్రాంగణంలో ఎంపీ అభ్యర్థి వరప్రసాదరావు సతీమణి లక్ష్మితో కలసి సుగుణమ్మ ప్రచారం

ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించుకుందాం: సుధాకర్

శ్రీకాళహస్తి, మే 10: ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేయాలని మొగలిరేకులు సీరియల్ నిర్మాత, టీడీపీ నాయకులు పల్లమాల సుధాకర్ తన సన్నిహితులకు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆయన నివాస గృహంలో శుక్రవారం తన సన్నిహితులు, ప్రముఖులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గం అభివృద్ధి కోసం మాజీ మంత్రి బొజ్జల గోపాల కృష్ణారెడ్డి చేసిన సేవలు ఇప్పటికీ చిరస్మరణీయమన్నారు. ఆయన తనయుడు సుధీర్ రెడ్డిని గెలిపించుకోవడం ద్వారా శ్రీకాళహస్తిని మళ్లీ అభివృద్ధి పథంలో నడిపించుకోగలమని వివరించారు. అలాగే వైసీపీ పాలనతో అన్ని వర్గాల ప్రజలకు జరిగిన అన్యాయాన్ని తెలిపారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా బొజ్జల సుధీర్ రెడ్డిని, కమలం గుర్తుపై ఓటు వేసి ఎంపీగా వరప్రసాద్‌ను గెలిపించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పల్లమాల శశాంక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పల్లమాల సుధాకర్

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

శ్రీకాళహస్తి, మే10: శ్రీకాళహస్తిలోని విద్యుత్ ప్రధాన కేంద్రంలో శనివారం మరమ్మతులు చేయనున్నట్లు తిరుపతి రూరల్ డివిజన్ ఈఈ వాసురెడ్డి శుక్రవారం తెలిపారు. శ్రీకాళహస్తి టౌన్, రూరల్, తొట్టంబేడు, బుచ్చినాయుడు కండ్రిగ, కేవీబీపురం, ఏర్పేడు మండలాల పరిధిలో ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

బైక్ ర్యాలీని జయప్రదం చేయండి

శ్రీకాళహస్తి, మే 10: ఎన్నికల ప్రచారం ముగింపు సందర్భంగా ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో శనివారం శ్రీకాళహస్తి పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్ తెలిపారు. మధ్యాహ్నం ఏపీ సీడ్స్ కూడలి దగ్గర నుంచి ర్యాలీ ప్రారంభమై... పట్టణంలోని బీపీ అగ్రహారం, రామసేతు వంతెన, సూపర్ బజార్ కూడలి, పెళ్లి మండపం, బేరివారి మండపం, బజార్ వీధి, భిక్షాలగాలి గోపురం తేరు వీధి, మీదుగా కుమార్ స్వామి తిప్ప, పాత బస్టాండ్ కూడలి, ఆర్టీసీ కూడలి నుంచి టీడీపీ కార్యాలయం వరకు జరగనున్నట్లు వెల్లడించారు. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

కనకదుర్గమ్మకు విశేష పూజలు

శ్రీకాళహస్తి, మే 10: ముక్కంటి ఆలయానికి అనుబంధంగా కనకాచలంపై వెలసిన కనకదుర్గమ్మకు శుక్రవారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాహుకాలం సమయంలో అమ్మవారి మూలమూర్తికి వివిధ పూజా ద్రవ్యాలతో విశేషంగా అభిషేకాలు చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవారికి దీపారాధన సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే సామూహిక లలితా సహస్ర నామం పఠించారు. అనంతరం అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

మద్యం షాపులు కిటకిట



మద్యం షాపు వద్ద మందుబాబుల రద్దీ

బుచ్చినాయుడుకండ్రిగ, మే 10: మండల కేంద్రంలోని రెండు మద్యం షాపులు శుక్రవారం సాయంత్రం మందు బాబులతో కిటకిటలాడాయి. బుచ్చినాయుడు కండ్రిగలో టీడీపీ, వైసీపీ ర్యాలీలు నిర్వహించడంతో రెండు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలతో రెండు మద్యం షాపుల రద్దీ నెలకొంది.

చంద్రబాబుతోనే బీసీల అభ్యున్నతి

ఏర్పేడు, మే 10: చంద్రబాబుతోనే బీసీల అభ్యున్నతి సాధ్యమని శ్రీకాళహస్తి నియోజకవర్గ ముదిరాజ్ సంఘం గౌరవాధ్యక్షుడు చిన్నా ముదిరాజ్ అన్నారు. ఏర్పేడు మండలం మునలిపేడు పంచాయతీ బతిత్నయ్య గిరిజనకాలనీలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో టీడీపీ తరఫున శుక్రవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు ప్రతి ఇంటికీ వెళ్లి వచ్చే ఎన్నికల్లో సైకిల్‌గుర్తు ఓటు వేసి సుధీర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో అంకయ్య ముదిరాజ్, నాగరాణి, గీత, మనోహర్‌నాయుడు, ప్రసాద్‌నాయుడు, మునిరాజ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రోజా ఓటమి ఖాయం: భానుప్రకాష్



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 10: ఎన్నికల్లో రోజా ఓటమి ఖాయమని నగరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నగరికి సీఎం జగన్ ఎందుకు వచ్చారో వైసీపీ శ్రేణులకు కూడా అర్థం కావడం లేదన్నారు. వెయ్యి మందితో జగన్ ఎన్నికల సభ నగరిలో చాలా చప్పగా సాగిందని ఎద్దేవా చేశారు. దీంతో నగరిలో రోజా ఓటమి ఖాయమని స్పష్టమైందని అన్నారు. గతంలో నియోజకవర్గ ప్రజలకు జగన్, రోజా ఇచ్చిన హామీలకే దిక్కు లేదనీ, కొత్తగా హామీలు ఇవ్వడం ఎందుకని ఆయన ప్రశ్నించారు. తనకు ఎర్ర చందనం స్మగ్లర్లతో సంబంధం ఉందనేది పచ్చి అబద్ధమని కొట్టి పడేశారు. అటవీశాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఎర్రచందనం మొక్కలు పెంచిన ఘనత తన తండ్రి గాలి ముద్దుకృష్ణమ నాయుడిదని తెలిపారు. వైసీపీ నాయకులే రాష్ట్రంలో ఎర్రచందనం స్మగ్లర్లుగా పేరు మోశారని ఆరోపించారు. ఒకనాడు దారుణమైన ఆర్థిక సమస్యలతో ఉన్న రోజా, ప్రస్తుతం కొడుకు కోరిక మేరకు రూ.కోటి 20 లక్షల కారు కొనే ఆర్థిక శక్తి ఎలా వచ్చిందని సూటిగా ప్రశ్నించారు. రోజా, కుటుంబ సభ్యుల అవినీతి అక్రమాల గురించి నగరిలో చిన్న పిల్లలను అడిగినా చెబుతారని అన్నారు. ఎర్ర చందనం, ఇసుక, గ్రావెల్, భూ కబ్జాలు వంటివి ఎన్నో అక్రమాలకు రోజా కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధిని రోజా గాలికి వదిలి పెట్టారని, అందుకే ఆమెను గెలిపించడానికి తాము సిద్ధంగా లేమని ప్రజలు జగన్ సభకు రాకుండా స్పష్టం చేశారని ఎద్దేవా చేశారు. ఈ దఫా నగరిలో టీడీపీ జెండా ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. తాను గెలిచాక నగరి నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని గాలి భానుప్రకాష్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. నగరి - చెన్నై పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు ద్వారా యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు కృషి చేస్తానని స్పష్టం చేశారు.

ఓటర్లకు నగదు పంపకాల్లో వైసీపీ జోరు

తిరుపతి, మే 10 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా పలు నియోజకవర్గాల్లో శుక్రవారం సైతం ఓటర్లను ప్రలోభపెట్టే కార్యక్రమాలు కొనసాగాయి. శ్రీకాళహస్తి పట్టణంలో వైసీపీ నేతలు ఇప్పటికే ఓటుకు రూ. 3 వేలు, మిగిలిన చోట్ల రూ. 2 వేల వంతున 80 శాతం మంది ఓటర్లకు పంచేశారు. టీడీపీ సానుభూతిపరులకు సైతం నగదు పంపిణీ చేసి వారి ఇళ్లలోని ఓట్లలో కనీసం సగమైనా వేయండని బతిమాలారు. చీరల పంపిణీ ప్రారంభించినా సక్రమంగా చేరలేదని, నాసిరకంగా వున్నాయని ఫిర్యాదులు రావడంతో పంపిణీ ఆపేశారు. ప్రత్నామ్నాయంగా మహిళలకు బంగారు ముక్కు పుడకలు, వెండి మెట్టెలు పంపిణీ చేస్తున్నారు. అయితే వీటిని ఓటర్లకు అందరికీ కాకుండా పేదవర్గాలున్న చోట్ల ఎక్కువగా ఇస్తున్నారు. ఇక టీడీపీ వర్గీయులు పట్టణంలో ఓటుకు రూ. 2 వేల, ఇతర చోట్ల రూ. 1500 చొప్పున 70 శాతం మందికి పంపిణీ చేసినట్టు చెబుతున్నారు. వెంకటగిరిలో వైసీపీ వర్గీయులు గరిష్ఠంగా ఓటుకు రూ. 3500 చొప్పున శుక్రవారం సాయంత్రం నుంచీ పంపకాలు ప్రారంభించారు. టీడీపీ వర్గీయులు ఇంకా మొదలు పెట్టలేదు.వైసీపీ వర్గీయులు గూడూరు పట్టణంలో ఓటుకు రూ. 2 వేలు, మిగిలిన చోట్ల రూ. 1500 చొప్పున ఇస్తున్నారు. టీడీపీ వర్గీయులు మాత్రం ఓటుకు రూ. వెయ్యి వంతున పంపిణీ చేస్తున్నారు. సూళ్ళూరుపేటలో ఇరు పార్టీలకు చెందిన వారూ ఓటుకు రూ. వెయ్యి చొప్పున అందజేస్తున్నారు. సత్యవేడులో టీడీపీ వర్గీయులు శుక్రవారం పంపిణీ మొదలుపెట్టి ఓటుకు రూ. వెయ్యి చొప్పున ఇస్తున్నారు. దాదాపు వంద శాతం ఓటర్లకు చేర్చాలని నిర్ణయించినట్టు సమాచారం. వైసీపీ వర్గీయులు మాత్రం ఓటుకు రూ. 1500 చొప్పున 80 శాతం మందికి చేర్చేశారని చెబుతున్నారు.చంద్రగిరిలో టీడీపీ వర్గీయులు ఓటుకు రూ. 2 వేల వంతున 99 శాతం పంపిణీ పూర్తి చేశారని సమాచారం. అయితే వైసీపీ వర్గీయులు కూడా రూ. 2 వేల వంతున ఇచ్చినా 70 శాతం మందికే ఇచ్చారని చెబుతున్నారు. మంగళం ప్రాంతంలో కవర్‌లో రూ. 2 వేలు పెట్టినట్టు చెప్పి ఓటర్లకు అందజేయగా పలు కవర్లలో రూ. 2 వేలకు బదులు వెయ్యి మాత్రమే వుండడం చూసి ఓటర్లు ఖంగు తిన్నారని సమాచారం. దీంతో వారు నగదు పంపిణీ చేసిన స్థానిక నేతలతో గొడవకు దిగినట్టు తెలిసింది. కాగా వైసీపీ వర్గీయులు ఈ నియోజకవర్గంలో రెండవ విడత ఇంటింటికీ రూ. 3 వేలు చొప్పున అందజేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నట్టు సమాచారం. తిరుపతిలో ఇరుపార్టీల వర్గీయులూ పంపిణీ ప్రక్రియ పూర్తి చేసినట్టు తెలిసింది.

దక్షిణ కాళికాదేవికి ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తి, మే 10: శ్రీకాళహస్తి మండలం వేడాం గ్రామంలో వెలసిన దక్షిణ కాళికాదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం రాహుకాలం సమయంలో అర్చకులు అమ్మవారి మూలమూర్తిని పూజా ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం నిమ్మకాయలు, పూలమాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు దీపాలు వెలిగించి హారతులు పట్టారు. అలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు.

ఘనంగా శుక్రవార ఉత్సవం

శ్రీకాళహస్తి, మే 10: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారికి విశేష ఉత్సవం నిర్వహించారు. అలంకార మండపంలో జ్ఞాన ప్రసూనాంబిక అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయంలో ప్రాకారంగా ప్రదక్షిణ చేసి తిరిగి కొలువుదీర్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

వెనక్కొచ్చిన 82వేల ఓటరు స్లిప్పులు ఎవరివి?

అత్యధికం తిరుపతిలోనే

తిరుపతి(కలెక్టరేట్), మే 10: జిల్లావ్యాప్తంగా ఓటరు స్లిప్పుల పంపిణీ గురువారంతో పూర్తయింది.మొత్తం 18,12,980మంది ఓటర్లుండగా 83వేల స్లిప్పులు వెనక్కి రావడంతో అధికార యంత్రాంగం ఖంగుతింది.ఓటర్లలో పదిశాతం మంది ఒకవేళ ఊరికి వెళ్లివున్నా, ఆరోగ్యం బాగాలేక ఆస్పత్రికి వెళ్లివున్నా మిగిలిన 70వేల స్లిప్పుల విషయం ఏం చేయాలో వెనక్కి రావడంతో కలెక్టరేట్ అధికారులు ఖంగుతిన్నారు. చంద్రగిరి, తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గాల్లో అధికార పార్టీ నేతలు భారీఎత్తున దొంగ ఓట్లను చేర్పించడం, ఊరు వదిలి వెళ్లిన, మృతి చెందిన వారి ఓట్లు తొలగించకుండా బీఎల్వోలపై తీవ్రమైన ఒత్తిడి తీసుకురావడంతో ఓటర్ల ప్రత్యేక సవరణ జాబితాలో కూడా వాటిని తొలగించలేదు. దీనిపై ప్రతిపక్షాలు కేంద్ర ఎన్నికల సంఘానికి సైతం ఫిర్యాదు చేసినా జిల్లా యంత్రాంగం స్పందించలేదు. తిరుపతి నగరంలో 3,02,503 ఓట్లుండగా ఇందులో దాదాపు 60 వేల ఓటర్ల ఆచూకీ తెలియడంలేదు.తరువాతి స్థానం చంద్రగిరి, వెంకటగిరి దక్కించుకున్నాయి.

ఓటరు స్లిప్పుల గల్లంతు కేసులో ఇద్దరి అరెస్టు

66 స్లిప్పులు.. రూ.500 సీజ్

తిరుపతి(నేరవిభాగం), మే 10: తిరుపతిలో ఓటరు స్లిప్పులు గల్లంతైన కేసులో అలిపిరి పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 59 స్లిప్పులు స్వాధీనం చేసుకుని రూ 500 సీజ్ చేశారు. డీఎస్పీ సురేంద్రరెడ్డి కథనంమేరకు..... తిరుపతిలోని జీవకోనకు చెందిన విఘ్నేష్, చెన్నారెడ్డి కాలనీకి చెందిన మౌనిష్ స్నేహితులు.అంబేద్కర్ కాలనీలోని వార్డు నెంబరు 41-2 సచివాలయం వద్దకు గురువారం వెళ్ళారు. అక్కడ వీఆర్వో రమ్యశ్రీ తన బ్యాగులో ఓటరు స్లిప్పులు వుంచి అందులోనే కొంత డబ్బు పెట్టి బ్యాగు టేబుల్‌పైన వుంచి భోజనానికి వెళ్ళారు. దీన్ని గమనిస్తుండిన విఘ్నేష్, మౌనిష్ వాటిలో 66 ఓటరు స్లిప్పులను అపహరించారు.దాదాపు 86 స్లిప్పులు కింద పడి వుండడం గమనించిన రమ్యశ్రీ మిగిలిన స్లిప్పులు కనపడక పోవడంతో వెంటనే రిటర్నింగ్ అధికారి అదితిసింగ్‌కు ఫిర్యాదు చేశారు. ఆమె ఆ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా విచారణకు ఆదేశించారు. జరిగిన ఘటనపై వీఆర్వో, పోలింగ్ బూత్ నెంబరు 48 బీఎల్వో రమ్యశ్రీ అలిపిరి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసారు. పోలీసులు గురువారం దొంగతనం కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.అనుమానంతో ఇద్దరిని పట్టుకుని విచారించారు. రమ్యశ్రీ వారిని గుర్తు పట్టడంతో విఘ్నేష్, మౌనీష్‌లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 66 ఓటరు స్లిప్పులు, రూ 500 స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన ఏడు స్లిప్పులు ఏమయ్యాయనే కోణంలో నిందితులను విచారిస్తున్నారు.

జగన్‌కు ఓటేస్తే యువత చేతికి చిప్పే..!

చంద్రబాబు గెలిస్తే 20 లక్షల ఉద్యోగాలు, రూ.3 వేల నిరుద్యోగ భృతి

తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి నాయుడు


మీడియాతో మాట్లాడుతున్న రవి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 10: మళ్లీ జగన్‌కు ఓటేస్తే యువత చేతికి చిప్పే గతి అని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి నాయుడు హెచ్చరించారు. ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి గెలిచి సీఎంగా చంద్రబాబు వస్తే 20 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తారని తెలిపారు. తొలి సంతకం డీఎస్సీ ఫైలుపైనే అని స్పష్టం చేశారు. నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల భృతి చెల్లిస్తారని అన్నారు. సీఎంగా చంద్రబాబు కావాలో? అక్రమార్కుడు జగన్ కావాలో? తేల్చుకోవాల్సిన సమయం ఇదే అని సూచించారు. యువతను మోసగించి మళ్లీ ఏ మొహం పెట్టుకొని ఓట్లు అడుగుతున్నారో వైసీపీ నాయకులు ఆత్మ పరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. అమరరాజా వంటి గొప్ప కంపెనీలను రాష్ట్ర సరిహద్దులు దాటించిన చరిత్ర జగన్ పాలనలో జరిగిందన్నారు. తిరుపతికి వచ్చిన రిలయన్స్ కంపెనీని కాపాడుకోలేక పోయారని అన్నారు. తిరుపతికి ఎమ్మెల్యేగా అభినయ్‌రెడ్డి తగడని చెప్పారు. ఆరణి శ్రీనివాసులుకు ఓటువేసి తిరుపతి పవిత్రతను కాపాడుకోవాలని, అభివృద్ధికి తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు. తెలుగు యువత నేత శ్రీనివాసులు, అధికార ప్రతినిధి తోట వాసుదేవ, శ్రీనివాసయాదవ్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి రఫీ, శ్రీరామ్, బాబీ, గోపీ, శివ, సంతోష్, సంపత్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

పోతిన మహేష్‌కు రాజకీయ భిక్ష పెట్టింది జనసేన

- పవన్‌ని విమర్శిస్తే పుట్టగతులుండవు: కిరణ్ రాయల్ హెచ్చరిక

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 10: పోతిన మహేష్‌కు రాజకీయ భిక్ష పెట్టినది తమ పార్టీయేనని జనసేన తిరుపతి ఇన్‌చార్జి కిరణ్ రాయల్ అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జనసేనాని పవన్ కల్యాణ్‌ను విమర్శిస్తే మహేష్‌కు రాష్ట్రంలో పుట్టగతులు లేకుండా చేస్తామని హెచ్చరించారు. వైసీపీకి మహేష్ ఎంతకు అమ్ముడుపోయారో వెల్లడించాలని సూచించారు. ఈ సమావేశంలో నాయకులు ఆకేపాటి సుభాషిణి, రాజేంద్ర, సుమన్, దుర్గాదేవి, సిద్ధు, చందన తదితరులు పాల్గొన్నారు.

తిరుపతికి చేరుకున్న నాగబాబు


నాగబాబును కలిసిన ఆరణి మదన్

తిరుపతి, మే 10 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ కూటమి ర్యాలీలో పాల్గొనేందుకు తిరుపతికి వచ్చిన జనసేన ప్రధానకార్యదర్శి నాగబాబును ఆరణి శ్రీనివాసులు కుమారుడు మదన్ శుక్రవారం రాత్రి ఓ హోటల్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రచారం తీరుతెన్నులు గురించి నాగబాబు అడిగి తెలుసుకున్నారు.

ఎన్డీయే అభ్యర్థిని గెలిపించుకుందాం : జనసేన


ప్రచారం చేస్తున్న జనసేన నాయకులు

తిరుపతి అర్బన్, మే 10: ఎన్డీయే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులను భారీ మెజారిటీతో గెలిపించుకుందామని జనసేన తిరుపతి నియోజకవర్గం ఇంచార్జ్ కిరణ్‌రాయల్, నగరాధ్యక్షుడు రాజారెడ్డి తెలిపారు. శుక్రవారం కూటమి అభ్యర్థి గెలుపుకోసం 15వ డివిజన్‌లోని బైరాగిపట్టెడలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సుభాషిణి, మూర్తి, శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

కూటమికి టీఎన్‌టీయూసీ మద్దతు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 10: ఎన్నికల్లో కూటమికి టీఎన్‌టీయూసీ మద్దతు తెల్పింది. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో టీఎన్‌టీయూసీ నాయకులు నరసింహమూర్తి శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం ఉద్యోగ, కార్మికులకు అన్ని విధాలుగా అన్యాయం చేసిందన్నారు. టీటీడీ కార్మికులను క్రమబద్ధీకరించకుండా అవుట్ సోర్సింగ్‌లో చేర్చి వైసీపీ నాయకుల ఆజమాయిషీలోకి తెచ్చారని చెప్పారు. హాకర్లకు ఐడెంటీ కార్డులు ఇవ్వాలన్నారు. ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించి వైసీపీ ప్రభుత్వ అరాచకత్వానికి ఓటర్లు అడ్డుకట్ట వేయాలని కోరారు. మురళిరెడ్డి, దొడ్ల గౌరి, నాగమణి, సత్యవతి పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే రజకుల సంక్షేమం


విలేకరులతో మాట్లాడుతున్న లక్ష్మయ్య

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), మే 10: టీడీపీ ప్రభుత్వ హయాంలోనే రజకుల సంక్షేమం సాధ్యమైందని రజక జన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు అక్కినపల్లి లక్ష్మయ్య పేర్కొన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వ హయాంలో రజకులు అన్ని విధాలుగా నష్ట పోయారని అన్నారు. పవిత్రమైన తిరుపతి ఖ్యాతిని భూమన దిగజార్చారని ఆరోపించారు. తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులును గెలిపించాలని అక్కినపల్లి లక్ష్మయ్య కోరారు. ఈ సమావేశంలో తిరుపతి పార్లమెంటు టీడీపీ జిల్లా కార్యదర్శి చెంబకూరు రాజయ్య, 31వ డివిజన్ కార్పొరేటర్ సీకే రేవతి, బీజేపీ బీసీ మోర్చా నేత రామచంద్ర, టీఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటే చంద్ర, రజక సాధికార కమిటీ కన్వీనర్ శంకర్, మురళి, నారాయణ, రవి, రాపూరి సుబ్రహ్మణ్యం, అశోక్ పాల్గొన్నారు.


ప్రశాంత ఎన్నికలకు సహకరించండి


రాజకీయ ప్రతినిధులతో సమావేశమైన ఉజ్వల్‌కుమార్‌ఘోష్, అదితిసింగ్

తిరుపతి అర్బన్, మే 10: సోమవారం జరిగే సార్వత్రిక ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో, ప్రశాంతంగా, సజావుగా సాగేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జనరల్ అబ్జర్వర్ ఉజ్వల్‌కుమార్ ఘోష్, ఆర్వో అదితిసింగ్ కోరారు. శుక్రవారం అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ అమరయ్య, డీఎస్పీ సురేంద్రనాథ్, తహసీల్దార్ నారాయణరెడ్డి, ఎన్నికల డీటీ జీవన్, తదితరులు పాల్గొన్నారు.

అప్‌డేటెడ్ అంటే ఇదా అభినయా?

తిరుపతి బరిలో స్వతంత్ర అభ్యర్థులుగా 17 మంది అనుచరులను దించడం వెనుక భారీ వ్యూహం



తిరుపతి, మే 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే అత్యధిక సంఖ్యలో 46 మంది అసెంబ్లీకి పోటీచేస్తున్న నియోజకవర్గం తిరుపతి. శాసనసభలో అడుగుపెట్టాలనే ప్రజాస్వామిక ఉత్సాహంతో వీరంతా ఉన్నారనుకుంటే పొరపాటే. వైసీపీ వ్యూహాత్మక ఎత్తుగడ ఫలితమే ఇంత మంది పోటీలో ఉండడం. పోటీలో ఉన్న 17 మంది స్వతంత్ర అభ్యర్థులు వైసీపీ అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి అనుచరులే అనే అంశంపై నగరంలో చర్చజరుగుతోంది. ఆలూరి శ్రీనివాసులు, గుర్రాల బాలకృష్ణ, గొడుగు చింత గోపీ ప్రసాద్, చైతన్య యాదవ్, ఎం.జగదీష్, ఆర్.జ్యోతి, టి.తిరుమల, తోట ప్రకాష్ బాబు, ఎస్.నరేష్, నవీన్ రాయల్, పెంచల ప్రసాద్, ఎన్.బెనర్జీ, బండ్ల చంద్రశేఖర్ రాయల్, భార్గవ నాయుడు, మహ్మద్ గౌస్, సాయిప్రసన్న కుమార్, సోమశేఖర్ తదితరులు తాజా ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో వున్నారు. వీరంతా అభినయ్‌కు సన్నిహితులనే పేరుంది. ఉదాహరణకు వైసీపీ ప్రభుత్వం వచ్చాక రుయా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్‌గా నియమితులైన బండ్ల చంద్రశేఖర్ రాయల్ వీరిలో ఒకరు. ఇక చైతన్య యాదవ్.. అభినయ్‌కు అత్యంత సన్నిహితుడు. అభినయ్ తరపున నగరంలోని పోలీసు స్టేషన్లలో పంచాయతీలు, సెటిల్‌మెంట్లు చేస్తారనే పేరుంది. పెంచల ప్రసాద్ కూడా అభినయ్‌కు బాగా సన్నిహితుడని, లండన్‌లో ఇద్దరూ కలసి చదువుకున్నారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ప్రసాద్ తిరుమల వ్యవహారాలు, దర్శనాలు చూస్తారని సమాచారం. కపిలతీర్థం వద్ద మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన స్థలంలో ప్రసాద్ కుటుంబీకుల పేరిట లీజు ప్రాతిపదికన హోటల్ భవనం నిర్మించారని, దాదాపు అభినయ్‌కు బినామీగా వ్యవహరిస్తారనే ప్రచారం జరుగుతోంది. బెనర్జీ, సాయిప్రసన్న అనే ఇద్దరూ అభినయ్ క్లాస్‌మేట్లని సమాచారం. వీరిలో బెనర్జీ అభినయ్ తరపున కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు వంటివి చూస్తారని, అభినయ్ తరపున ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్‌లా వ్యవహరిస్తారనే ప్రచారముంది. సోమశేఖర్ అనే వ్యక్తి ఉద్యోగుల బదిలీలు వంటి వ్యవహారాలు చూస్తారని సమాచారం.

ఇంతమంది పోటీ ఎందుకు ?

ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ తమ బలగం సంఖ్యలో బలంగా కనిపించడానికే ఇంతమందిని బరిలో దించారని భావిస్తున్నారు. పోటీలో ఉన్న ప్రతి అభ్యర్థీ తన తరపున ప్రతి పోలింగ్ కేంద్రంలో ఇద్దరేసి ఏజంట్లను నియమించుకోవచ్చు. తిరుపతి నియోజకవర్గంలో 274 పోలింగ్ కేంద్రాలున్నాయి. అంటే 9,316 మంది ఏజంట్లు ఈ 17మంది స్వతంత్ర అనుచరగణం తరపున అభినయ్‌రెడ్డి కోసం పోలింగ్ కేంద్రాల్లో సిద్ధంగా ఉంటారన్నమాట. ఈ లెక్కన ప్రతి పోలింగ్ కేంద్రంలోపల అభినయ్ ఏజంటుతో పాటు ఈ అభ్యర్థులకు చెందిన 18 మంది ఏ సమయంలోనైనా అందుబాటులో వుంటారు. అంటే భౌతికంగా ఒక బలమైన బృందం ప్రతి కేంద్రంలో ఉంటుంది. ఇతర అభ్యర్థుల ఏజంట్ల గొంతు నొక్కేయడానికి ఈ మూకబలం ఉపయోగపడుతుంది. అలాగే అభ్యర్థుల హోదాలో అనుమతించే 17 వాహనాల్లో పోలింగ్ రోజు నియోజకవర్గమంతా అధికారికంగా తిరిగే వీలుంటుంది. పోలింగ్ కేంద్రం లోపలకి వెళ్లిరావచ్చు. లోపల ఎంతసేపైనా వుండే అవకాశముంటుంది. అలాగే ఈ 17 మందీ ఒక్కో జనరల్ ఏజంటును నియమించుకోవచ్చు. ఆ రకంగా మరో 17 వాహనాలకు ఎక్కడైనా తిరిగే అనుమతి లభిస్తుంది. పోలింగ్ రోజున తిరుపతి నియోజవర్గంలోని ప్రతి పోలింగ్ కేంద్రంలో తమదే పైచేయిగా ఉండేలా ముందస్తు వ్యూహంతోనే ఇంతమందిని స్వతంత్రుల పేరుతో బరిలోకి దించారని ప్రచారం జరుగుతోంది. తాను అప్‌డేటెడ్ సాఫ్ట్‌వేర్ అని భూమన అభినయ్‌రెడ్డి తరచూ చెప్పే మాట వెనుక అర్థం ఇదా? అని రాజకీయ పండితులు నోరెళ్లబెడుతున్నారు.

ఆరణి శ్రీనివాసులుపై ఆలూరి శ్రీనివాసులు పోటీ

జనసేన అభ్యర్థి పేరు ఆరణి శ్రీనివాసులు. దాదాపుగా ఈ పేరుకి దగ్గర ఉండేలా ఆలూరి శ్రీనివాసులు పేరు బ్యాలెట్ పత్రంలో ఉంటుంది. ఓటర్లను గందరగోళ పరచడం అనే ఉద్దేశంతోనే కడప జిల్లాకు చెందిన ఇతన్ని రప్పించి పోటీలోకి దించారనే ప్రచారం జరుగుతోంది.

నీ అవినీతిపై విచారణ ఖాయం

దమ్ముంటే ప్రమాణానికి రా.. ● భూమనకు ఆరణి ప్రతి సవాల్


ఎన్డీఏ కూటమి నేతలతో కలిసి మీడియాతో మాట్లాడుతున్న ఆరణి శ్రీనివాసులు

తిరుపతి, మే 10 (ఆంధ్రజ్యోతి): 'నీ అవినీతిపై విచారణ ఖాయం. నాపై నిత్యం చేస్తున్న ఆరోపణలు నిజం కాదని.. నేను భవంతుడిపై ప్రమాణం చేయడానికి సిద్ధం. దమ్ముంటే అవి నిజమేనని ప్రమాణం చేయడానికి నువ్వు ముందుకురా' అని భూమన కరుణాకరరెడ్డికి టీడీపీ, బీజేపీ బలపరుస్తున్న జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు ప్రతి సవాల్ విసిరారు. టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ నిర్వహించిన రోడ్ షో విజయవంతం కావడంతో భూమన కరుణాకరరెడ్డి, అభినయ్‌రెడ్డిలు మతిభ్రమించి.. పిచ్చి ప్రేలాపనలు పేలుతున్నారని విమర్శించారు. మరోవైపు గ్రూప్ థియేటర్ వద్ద గురువారం వైసీపీ నిర్వహించిన సభ విఫలం కావడంతో తండ్రీ కొడుకులకు ఓటమి భయం పట్టుకుందని చెప్పారు. ఈ మేరకు శుక్రవారం ఎన్డీఏ కూటమి నేతలతో కలసి ఓ హోటల్‌లో ఆరణి మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు, పవన్‌లపై భూమన విమర్శలు అర్థరహితమన్నారు. కొడుకు ఆస్తులకు మార్కెట్ విలువ పెంచుకునేందుకు తిరుపతికి 30 కిలోమీటర్ల దూరంలో టీటీడీ ఉద్యోగులకు ఇంటి స్థలాన్ని రూ.4 లక్షలు కట్టించుకుని.. కేటాయించి తానేదో వారిని ఉద్ధరించినట్లు మాట్లాడటం కరుణాకరరెడ్డికే చెల్లిందని విమర్శించారు. టీటీడీ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు కేవలం తన వర్గానికి మాత్రమే పెంచారని ఆరోపించారు. ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పాటైన రెండ్రోజుల్లోనే తండ్రీ కొడుకుల అవినీతిపై విచారణ జరిపి, చట్టప్రకారం శిక్షిస్తామని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ మాట్లాడుతూ.. దొంగ ఓట్లతో తిరుపతిని భ్రష్టుపట్టించారని మండిపడ్డారు. భూమన కుటుంబ కబంధ హస్తాలనుంచి తిరుపతిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని బీజేపీ నాయకుడు నవీన్ కుమార్ రెడ్డి అన్నారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి రాగానే స్థానికులకు నెలలోని మొదటి మంగళవారం ఉచిత దర్శన అవకాశాన్ని కల్పిస్తామని చెప్పారు. పెద్దకాపు లే అవుట్, చింతలచేను ప్రాంతాలను 22ఏ నుంచి తొలగిస్తామని అన్నారు. భూమన కుటుంబ అహంకార నైజాన్ని తిరుపతి ప్రజలు ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, నరసింహ యాదవ్, ఏఎం రత్నం, పసుపులేటి హరిప్రసాద్ తదితరులు అన్నారు. ఈ సమావేశంలో కూటమి నేతలు చినబాబు, లక్ష్మీపతి, కిరణ్ రాయల్, సుభాషిణి, కీర్తన, రాజా రెడ్డి పాల్గొన్నారు.

నేటితో ప్రచారానికి తెర

- ఎన్నికల బరిలో 156మంది
- 1,401 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్
- తిరుపతి, చంద్రగిరిలో వందశాతం
- నేటి సాయంత్రంనుంచే మద్యం అమ్మకాలు బంద్


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తదితరులు

తిరుపతి(కలెక్టరేట్), మే 10: ఎన్నికల ప్రచారానికి శనివారం సాయంత్రం ఆరు గంటలకు తెరపడనుంది. ఆ తర్వాత ఎవరైనా బహిరంగ సభలు, ప్రచారాలు నిర్వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎన్నికల సంఘం తెలిపింది. సోషల్, ఎలక్ట్రానిక్ మీడియాలో ఎగ్జిట్ పోల్స్‌పైనా నిషేధం విధించారు. పార్లమెంటు స్థానానికి 23మంది, ఏడు అసెంబ్లీ స్థానాలకు 133మంది కలిపి 156 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. అసెంబ్లీకి సంబంధించి తిరుపతిలో అత్యధికంగా 46మంది పోటీ చేస్తుండగా, చంద్రగిరిలో 24మంది బరిలో నిలిచారు. 2,140 పోలింగ్ కేంద్రాలకుగాను 1,401 చోట్ల వెబ్‌కాస్టింగ్‌కు ఏర్పాటు చేస్తున్నారు. తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లో మాత్రం అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ వెబ్‌కాస్టింగ్ ఉంటుంది. సూళ్లూరుపేటలో 150, గూడూరు 147, వెంకటగిరి 149, శ్రీకాళహస్తి 139, సత్యవేడు 139 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నారు. 14,759మంది పోలింగ్ సిబ్బంది విధుల్లో ఉండనున్నారు. శనివారం సాయంత్రం ఏడు నుంచి 13వ తేదీన సాయంత్రం ఏడు గంటల వరకు జిల్లాలోని మద్యం దుకాణాల, బార్లు మూసివేయనున్నారు. ఆదివారం మధ్యాహ్నం నుంచే స్ట్రాంగ్‌రూమ్‌ల నుంచి పోలింగ్ సామగ్రిని ఆర్వోలు, ఎన్నికల విధుల్లోని సిబ్బందికి పంపిణీ చేస్తారు. సోమవారం జరిగే పోలింగ్ ప్రక్రియను పరిశీలించేలా కలెక్టరేట్‌లో ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఇక్కడినుంచే అబ్జర్వర్లు, కలెక్టర్, ఎస్పీ తదితరులు పరిశీలించనున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, డీఐజీ బాజ్‌పాయ్, డీఆర్వో పెంచలకిషోర్ సమీక్షించారు.

పోలింగ్ కేంద్రాలకు నిరంతర విద్యుత్: ఎస్ఈ


గాజులమండ్యంలోని ఓ పోలింగ్ కేంద్రంలో విద్యుత్ సరఫరాను పరిశీలిస్తున్న ఎస్ఈ కృష్ణారెడ్డి

తిరుపతి(ఆటోనగర్), మే 10: ఉమ్మడి చిత్తూరు జిల్లా (తిరుపతి సర్కిల్)లోని అన్ని పోలింగ్ కేంద్రాలకు ఈనెల 13న నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా ఏర్పాట్లు చేశామని ఎస్ఈ ఎం.కృష్ణారెడ్డి తెలిపారు. దీనిపై ఎన్నికల అధికారుల ఆదేశాలతో శుక్రవారం సర్కిల్ పరిధిలోని అన్ని డివిజన్ల ఈఈలు, ఏఈలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించామన్నారు. అనంతరం పుత్తూరు, తిరుపతి టౌన్ డివిజన్లలోని పలు పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సరఫరా తీరును పరిశీలించామని చెప్పారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఆది, సోమవారాల్లో విద్యుత్ సిబ్బందిని నియమించాలని, విద్యుత్ సరఫరాలేని ప్రాంతాల్లో మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని ఆదేశించామన్నారు. కేంద్రాల వద్ద తమ అధికారులు, సిబ్బంది సెల్‌ఫోన్ నెంబర్లు ఉంటాయని, అలాగే కంట్రోల్ రూమ్ కూడా ఉంటుందన్నారు. కంట్రోల్ రూమ్ వద్ద ఏఈ స్థాయి అధికారులు 24 గంటలు విధుల్లో ఉంటారని చెప్పారు. అత్యవసరమైతే 94408 17412 నెంబరుకు ఫోన్ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.


ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఇండియా కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి మురళితో కలిసి తిరుపతిలో బైక్ ర్యాలీలో పాల్గొన్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

ఓటర్లకు నగదు పంపకాల్లో వైసీపీ జోరు

తిరుపతి, మే 10 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా పలు నియోజకవర్గాల్లో శుక్రవారం సైతం ఓటర్లను ప్రలోభపెట్టే కార్యక్రమాలు కొనసాగాయి. శ్రీకాళహస్తి పట్టణంలో వైసీపీ నేతలు ఇప్పటికే ఓటుకు రూ. 3 వేలు, మిగిలిన చోట్ల రూ. 2 వేల వంతున 80 శాతం మంది ఓటర్లకు పంచేశారు. టీడీపీ సానుభూతిపరులకు సైతం నగదు పంపిణీ చేసి వారి ఇళ్ళలోని ఓట్లలో కనీసం సగమైనా వేయండని బతిమాలారు. చీరల పంపిణీ ప్రారంభించినా సక్రమంగా చేరలేదని, నాసిరకంగా వున్నాయని ఫిర్యాదులు రావడంతో పంపిణీ ఆపేశారు. ప్రత్యామ్నాయంగా మహిళలకు బంగారు ముక్కు పుడకలు, వెండి మెట్టెలు పంపిణీ చేస్తున్నారు. అయితే వీటిని ఓటర్లకు అందరికీ కాకుండా పేదవర్గాలున్న చోట్ల ఎక్కువగా ఇస్తున్నారు. ఇక టీడీపీ వర్గీయులు పట్టణంలో ఓటుకు రూ.2 వేల, ఇతర చోట్ల రూ. 1500 చొప్పున 70 శాతం మందికి పంపిణీ చేసినట్లు చెబుతున్నారు. వెంకటగిరిలో వైసీపీ వర్గీయులు గరిష్టంగా ఓటుకు రూ.3500 చొప్పున శుక్రవారం సాయంత్రం నుంచీ పంపకాలు ప్రారంభించారు. టీడీపీ వర్గీయులు ఇంకా మొదలు పెట్టలేదు.వైసీపీ వర్గీయులు గూడూరు పట్టణంలో ఓటుకు రూ.2 వేలు, మిగిలిన చోట్ల రూ.1500 చొప్పున ఇస్తున్నారు. టీడీపీ వర్గీయులు మాత్రం ఓటుకు రూ. వెయ్యి వంతున పంపిణీ చేస్తున్నారు. సూళ్ళూరుపేటలో ఇరు పార్టీలకు చెందిన వారూ ఓటుకు రూ. వెయ్యి చొప్పున అందజేస్తున్నారు. సత్యవేడులో టీడీపీ వర్గీయులు శుక్రవారం పంపిణీ మొదలుపెట్టి ఓటుకు రూ. వెయ్యి చొప్పున ఇస్తున్నారు. దాదాపు వంద శాతం ఓటర్లకు చేర్చాలని నిర్ణయించినట్టు సమాచారం. వైసీపీ వర్గీయులు మాత్రం ఓటుకు రూ.1500 చొప్పున 80 శాతం మందికి చేర్చేశారని చెబుతున్నారు.చంద్రగిరిలో టీడీపీ వర్గీయులు ఓటుకు రూ.2 వేల వంతున 99 శాతం పంపిణీ పూర్తి చేశారని సమాచారం. అయితే వైసీపీ వర్గీయులు కూడా రూ.2 వేల వంతున ఇచ్చినా 70శాతం మందికే ఇచ్చారని చెబుతున్నారు. మంగళం ప్రాంతంలో కవర్‌లో రూ.2 వేలు పెట్టినట్టు చెప్పి ఓటర్లకు అందజేయగా పలు కవర్లలో రూ.2 వేలకు బదులు వెయ్యి మాత్రమే వుండడం చూసి ఓటర్లు ఖంగుతిన్నారని సమాచారం. దీంతో వారు పంపిణీ చేసిన నేతలతో గొడవకు దిగినట్టు తెలిసింది. కాగా వైసీపీ వర్గీయులు ఈ నియోజకవర్గంలో రెండో విడత ఇంటింటికీ రూ.3 వేలు చొప్పున అందిచేందుకు ఏర్పాట్లు చేసు కున్నట్టు సమాచారం. తిరుపతిలో ఇరుపార్టీలూ పంపిణీ ప్రక్రియ పూర్తి చేసినట్టు తెలిసింది.

అడుగు పడకుండానే అటకెక్కించారు

జగన్ కక్ష సాధింపుతో సైన్స్‌సిటీ హుష్‌కాకి - చంద్రబాబు కేటాయించిన భూమిని లాగేసుకున్న టీటీడీ



సైన్స్‌సిటీ బోర్డు, శిలాఫలకం

తిరుపతిలో 2017 జనవరిలో జాతీయ సైన్స్ కాంగ్రెస్ నిర్వహించిన సమయంలో సైన్స్ సిటీ నిర్మించాలని అప్పటి టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. నాటి సీఎంతో పాటు, టీటీడీ ఉన్నతాధికారులు చర్చించి, అలిపిరి వద్ద టీటీడీకి చెందిన 70.11 ఎకరాల భూమిని గుర్తించింది. ఈ భూమిని సైన్స్‌సిటీకి లీజుపై అప్పగిస్తూ అదే ఏడాది ఆగస్టులో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నిర్మాణానికి రూ.100 కోట్లు కేటాయించడంతో పాటు కేంద్రం నుంచి దాదాపు రూ.453 కోట్లు తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంది. 2024 చివరికి లేదా 2025 మొదటినెలలో ఈసైన్స్‌సిటీని అందుబాటులోకి తెచ్చేలా ప్రణాళికలు రూపొందించింది. సప్తగిరులూ స్ఫురించేలా ఏడు గ్లోబులతో తిరుపతిలో అంతర్జాతీయస్థాయి ప్లానిటోరియానికి 2017 జనవరి 4న చంద్రబాబు శంకుస్థాపన చేశారు.

వైసీపీ కక్ష సాధింపు ధోరణికి సైన్స్‌సిటీ ప్రతిపాదన బలైపోయింది. గత టీడీపీ ప్రభుత్వం భుజానకెత్తుకోవడమే ఈ ప్రాజెక్టుకు శాపమైంది. శాస్త్ర, సాంకేతిక రంగంలో తిరుపతికి ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకురావడంతోపాటు సైన్స్‌లో యువతకు మంచి ఉన్నతమైన స్థానాన్ని కల్పించాలనుకున్న చంద్రబాబు సంకల్పాన్ని శిలాఫలకానికే పరిమితం చేసేశారు.

స్థలాన్ని లాక్కున్న టీటీడీ


2019లో వైసీపీ అధికారం చేపట్టి సైన్స్ సిటీ నిర్మాణానికి మోకాలడ్డింది. ఒక్క అడుగూ ముందుకు పడకుండా కక్షపూరితంగా వ్యవహరించింది. ఫలితంగా డీఆర్‌డీవో ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న ప్రణాళిక కాగితాలకే పరిమితమైంది. నిర్మాణాలు జరగడం లేదని ఈ స్థలాన్ని వెనక్కి తీసుకునేందుకు టీటీడీ అనేక ప్రయత్నాలు చేసింది. ఈ క్రమంలోనే 2019 అక్టోబరు 23న వైవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన టీటీడీ బోర్డు సమావేశం స్థలాన్ని వెనుక్కి తీసుకునేలా ప్రతిపాదించింది. 2020 జూన్‌లో భూమిని వెనక్కి ఇవ్వాలంటూ ఉత్తర్వులిచ్చింది. దీనిపై 2021లో మౌలిక వసతులు, పెట్టుబడుల శాఖ టీటీడీ ఈవోకు లేఖ రాస్తూ కనీసం 30 ఎకరాల స్థలాన్ని అయినా సైన్స్‌సిటీకి ఉంచాలని కోరింది. ఈ భూమి పక్కనే 25 ఎకరాల్లో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియానికి స్థలాన్ని కేటాయించాల్సి ఉందని, సమీపంలో ఎర్రచందనం, ఇతర చెట్లు వంటివి ఉండటంతో భూమి అవసరం ఉందనే వివిధ కారణాలతో సైన్స్‌సిటీకి 20 ఎకరాలు మాత్రమే కేటాయించి మిగిలిన భూమిని వెనక్కి తీసుకుంది. 2024 ఫిబ్రవరి నాటికి నిర్మాణాలు జరగకుంటే ఆ 20 ఎకరాలు కూడా వెనక్కి తీసుకుంటామని మెడ మీద కత్తి పెట్టింది. మొత్తం మీద వైసీపీ నిర్లక్ష్యంతో సైన్స్‌సిటీ నిర్మాణం కలగానే మిగిలిపోయింది.


సైన్స్ సిటీ నమూనా

ఏర్పాటైతే ఎన్ని ప్రయోజనాలో..

సైన్స్‌సిటీలో నిర్మాణం పూర్తయింటే ఆర్ట్ అండ్ సైన్స్ మ్యూజియం, ఎయిర్ స్పేస్ అండ్ డిఫెన్స్ మ్యూజియం, ఐమాక్స్ థియేటర్, చిల్డ్రన్స్ మ్యూజియం అండ్ ప్లానిటోరియం, మీడియా మ్యూజియం, మ్యూజియం ఆఫ్ హ్యూమన్ ఎవల్యూషన్ అండ్ ఆంత్రపాలజీ, ఇండోర్ రెయిన్ ఫారెస్ట్, 3డీ, 4డీ బయోడైవర్సిటీ థియేటర్ ఏర్పాటయ్యేవి. భౌతిక, బయోమెడికల్ శాస్త్రాల్లో పరిశోధనలకు ఆర్‌అండ్‌డీ ఇంక్యుబేషన్ కేంద్రాలు అందుబాటులోకి వచ్చేవి. రోబోటిక్ ప్రదర్శనలు, రీసెర్చ్ ప్రోగామ్స్, అబ్జర్వేటరీస్, నాలెడ్జ్ ఎక్స్ఛేంజి వంటి కార్యక్రమాలు జరిగేవి. హైదరాబాదులోని బిర్లా ప్లానిటోరియం తరహాలో తిరుపతి సైన్స్‌సిటీ రూపుదిద్దుకుని స్వామి సన్నిధిలో కొలువయ్యేది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



ఇంజన్‌కు నిర్వహిస్తున్న హాట్ టెస్ట్

లిక్విడ్ రాకెట్ ఇంజన్ తుది పరీక్ష విజయవంతం

సూళ్లూరుపేట, మే 10: పీఎస్ఎల్వీ రాకెట్ ప్రయోగాల కోసం కొత్త టెక్నాలజీతో అభివృద్ధి చేసిన లిక్విడ్ రాకెట్ ఇంజన్‌కు తుది పరీక్షను ఇస్రో విజయవంతంగా నిర్వహించింది. తమిళనాడులోని మహేంద్రగిరిలో ఉన్న ఇస్రో ప్రొపల్షన్ సెంటర్‌లో ఈ లిక్విడ్ రాకెట్ ఇంజన్‌కు ఈ నెల 9న హాట్ టెస్ట్ నిర్వహించినట్టు ఇస్రో శుక్రవారం వెల్లడించింది. పీఎస్ఎల్వీ రాకెట్ నాలుగో దశలో ఈ లిక్విడ్ ఇంజన్‌ను ఉపయోగిస్తారు. దీన్ని అడిటివ్ మాన్యుఫ్యాక్చరింగ్ (ఏఎం) టెక్నాలజీ సాయంతో రూపొందించారు. హాట్ టెస్ట్ సందర్భంగా ఈ ఇంజన్‌లోని లిక్విడ్‌ను 665 సెకన్లపాటు మండించారు. ఆ క్రమంలో ఇంజన్ పనితీరు అద్భుతంగా ఉందని గుర్తించారు. కొత్త ఇంజన్‌ను శ్రీహరికోటలోని షార్ నుంచి ప్రయోగించే పీఎస్ఎల్వీ రాకెట్‌లో వినియోగించేందుకు శాస్త్రవేత్తలు సన్నద్ధమవుతున్నారు.

ఎన్డీఏ విజయం ఖాయం: లంకా దినకర్

అమరావతి, మే 10(ఆంధ్రజ్యోతి): మోదీ గ్యారెంటీ, బాబు ష్యూరిటీ, పవన్ కమిట్మెంట్‌తో రాష్ట్రంలో ఎన్డీఏ అభ్యర్థుల విజయం ఖాయమని బీజేపీ అధికార ప్రతినిధి లంకా దినకర్ ధీమా వ్యక్తం చేశారు. విజయవాడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'రాష్ట్రాన్ని దోచేసిన వైసీపీని ఓడించేందుకు ఈ నెల 13న ఓటర్లు సిద్ధమయ్యారు. రాష్ట్ర సంపద మొత్తం దోచేసిన జగన్... ఓటుకు రూ.లక్ష ఇచ్చినా గెలిచే పరిస్థితి లేదు' అని దినకర్ అన్నారు.

జగన్ ప్రైవేట్ టూర్‌కు ప్రభుత్వ అధికారులా?

- విదేశీ పర్యటనకు ఐపీఎస్‌ను తీసుకెళుతున్న వైనం
- అనుమతిచ్చిన ప్రభుత్వం... టూర్‌పై 14న కోర్టు నిర్ణయం

అమరావతి, మే 10(ఆంధ్రజ్యోతి): అధికారమంటే ప్రజా సేవ కాదు, రాజభోగాలు అనుభవించడం అని నిరూపించిన జగన్ వ్యక్తిగత పర్యటనలోనూ అదే హవా చూపిస్తున్నారు. ప్రధాని తరహా సెక్యూరిటీ ఏర్పాటు చేసుకున్న ఆయన తన రక్షణ కోసం విదేశాలకు ఏకంగా ఐపీఎస్ అధికారినే తీసుకెళుతున్నారు. రాష్ట్రంలో ఎన్నికల పోలింగ్ 13న ముగియగానే సతీమణి భారతితో కలిసి ఆయన విదేశాలకు వెళుతున్నారు. పలు సీబీఐ కేసుల్లో నిందితుడిగా ఉన్న ఆయన విదేశీ పర్యటన అనుమతి కోసం కోర్టును ఆశ్రయించారు. దీనిపై 14న కోర్టు నిర్ణయం వెలువరించనుంది. ఈ నెల 15నుంచి 31వరకూ విదేశాల్లో కుటుంబ సభ్యులతో ఆయన గడిపేది పూర్తిగా వ్యక్తిగత పర్యటన. అయినప్పటికీ ప్రభుత్వ అధికారులను తనతో పాటు తీసుకెళ్లాలని భావించడం చర్చనీయాంశమైంది. రాష్ట్రంలో ఆయనకు రక్షణ కల్పించే ఎస్ఎస్జీ విభాగాధిపతి, సీనియర్ ఐపీఎస్ అధికారి అట్టాడ బాబూజీని ఏకంగా తనతో పాటు విదేశాలకు తీసుకెళుతున్నారు. ముఖ్యమంత్రి ఓఎస్డీ కృష్ణమోహన్, సీఎస్‌వో చిదానందరెడ్డి, సెక్యూరిటీ అధికారులు మహబూబ్ బాషా, బొడ్డేపల్లి మురళి, అడిషనల్ పీఎస్ కె.నాగేశ్వర్‌రెడ్డి వెంట వెళుతున్నారు. సీఎం పర్యటనకు వెళ్లేందుకు వీరికి ప్రభుత్వం అనుమతిచ్చింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పుడు మందీ మార్బలంతో వెళ్లేందుకు అవకాశం ఉండదని అధికార వర్గాలు చెబుతున్నాయి.

జగన్ పాలనలో ఏపీ దివాలా: కనకమేడల

న్యూఢిల్లీ, మే 10(ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ పాలనలో ఏపీ దివాలాతీసిందని టీడీపీ మాజీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ ఆరోపించారు. రాష్ట్రంపైన రూ.13 లక్షల కోట్లకు పైన అప్పులున్నాయన్నారు. రాష్ట్రంలో ఇక తాకట్టు పెట్టడానికి ఏమీ లేదని, తాకట్టు పెట్టకుండా ఉన్నది ప్రజల ఆస్తులు మాత్రమేనని అన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ఒక కత్తిలాంటిదని, దానితో ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా పోతుందని కనకమేడల తెలిపారు.

12 వరకు పోస్టల్ బ్యాలెట్: టీడీపీ వినతి

అమరావతి, మే 10(ఆంధ్రజ్యోతి): పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను ఈనెల 12 వరకు కొనసాగించాలని టీడీపీ నేతల బృందం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి విజ్ఞప్తి చేసింది. శుక్రవారం అమరావతి సచివాలయంలో సీఈవో ముఖేష్ కుమార్ మీనాను టీడీపీ నేతలు కలిసి, ఎన్నికల విధుల్లోకి తీసుకుంటున్న ప్రభుత్వ ఉద్యోగులందరికీ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశం కల్పించాలని కోరారు. అలాగే అమరావతి విట్ కాలేజీ విద్యార్థులకు 13న ఓటు వేసే అవకాశం కల్పించాలని, తమిళనాడు విట్‌లో చదువుతున్న తెలుగు విద్యార్థుల పరీక్షల షెడ్యూల్‌ను రీషెడ్యూల్ చేయాలని టీడీపీ నేతలు కోరారు. దీనిపై ఈసీ సానుకూలంగా స్పందించింది.

మా ఫిర్యాదులు పట్టవా?: ఈసీకి 'ఇండియా' ప్రశ్న

న్యూఢిల్లీ, మే10: ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘిస్తున్నారంటూ బీజేపీ నాయకుల మీద తాము చేసిన ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలని విపక్ష ఇండియా కూటమి నాయకులు ఎలక్షన్ కమిషన్‌ను కోరారు. మొదటి రెండు దశల పోలింగ్ వివరాల వెల్లడిలో జాప్యం జరగడంపైనా ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం కాంగ్రెస్‌కు చెందిన అభిషేక్ మను సింఘ్వీ, సల్మాన్ ఖుర్షీద్, డెరెక్ ఓబ్రెయిన్(తృణమూల్), టి.ఆర్.బాలు (డీఎంకే), మహువా మాఝి (జేఎంఎం), బినయ్ విశ్వం (సీపీఐ), జావేద్ అలీ (సమాజ్‌వాదీ)లు ఎన్నికల సంఘాన్ని కలిసి 7పేజీల వినతి పత్రాన్ని సమర్పించారు. అనంతరం సింఘ్వీ విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇంతవరకు 11 ఫిర్యాదులు ఇచ్చినా ఒక్కదానిపైనా చర్యలు తీసుకోలేదని తెలిపారు. వీటిపై సుప్రీంకోర్టును ఆశ్రయించే ఆలోచన ఉందన్నారు.

పాక్‌ను గౌరవించకుంటే మనకే ముప్పు

- వారి దగ్గర అణుబాంబులున్నాయ్: మణిశంకర్ అయ్యర్

న్యూఢిల్లీ, మే 10: లోక్‌సభ ఎన్నికల వేళ సొంత పార్టీ సీనియర్ నేతల వివాదాస్పద వ్యాఖ్యలు కాంగ్రెస్‌ను ఇరకాటంలో పడేస్తున్నాయి. మొన్న భారతీయుల రూపురేఖలపై శామ్ పిట్రోడా చేసిన వ్యాఖ్యలు పెను దుమారం రేపిన సంగతి తెలిసిందే. నిన్న పిట్రోడా మాటలపై స్పందిస్తూ.. కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ చౌధురి మరింత వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ సీనియర్ నేత మణిశంకర్ అయ్యర్ గత ఏడాది చేసిన వ్యాఖ్యలనూ ప్రత్యర్థులు తాజాగా వైరల్ చేశారు. 'పాకిస్థాన్‌తో మనం చర్చలు జరపాలి. అంతేగానీ సైన్యంతో రెచ్చగొట్టొద్దు. అలా జరిగితే ఉద్రిక్తతలు పెరిగి మనమే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. ఆ దేశం వద్ద అణుబాంబులున్నాయి. అందువల్ల పాక్‌ను మనం గౌరవించాలి. వారిని గౌరవించకపోతే భారత్‌పై అణు బాంబులు ఉపయోగించాలని ఆలోచన చేస్తారు. మనవద్దా ఆ అస్త్రాలున్నాయి. కానీ, లాహోర్‌పై మనం ప్రయోగిస్తే.. దాని తాలూకు రేడియేషన్ అమృత్‌సర్‌ను చేరడానికి 8 సెకన్లు కూడా పట్టదు' అని అయ్యర్ ఆ వీడియోలో అన్నారు. అయితే, తాను ఎప్పుడో మాట్లాడిన వీడియోను బీజేపీ నేతలు కావాలనే ఇప్పుడు వైరల్ చేస్తున్నారని అయ్యర్ పేర్కొన్నారు. అయ్యర్ వ్యాఖ్యలతో పార్టీకి సంబంధం లేదని కాంగ్రెస్ ప్రకటించింది.

కేసులు ఉన్నా ఏజెంట్లుగా రావొచ్చు: ఈసీ

అమరావతి, మే 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సోమవారం జరగనున్న ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో పోలింగ్ ఏజెంట్ల నియామక ప్రక్రియపై ఎన్నికల సంఘం కీలక ఆదేశాలు జారీ చేసింది. పోలింగ్ బూత్‌లలో ఆయా రాజకీయ పార్టీలు నియమించుకునే పోలింగ్ ఏజెంట్ల వివరాలను అదే రోజు ప్రిసైడింగ్ అధికారికి ఇస్తే చాలని తెలిపింది. గతంలో పోలింగ్ ఏజెంట్ల వివరాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారుల(ఆర్వో)కు ఇవ్వాల్సి వచ్చేది. దీనివల్ల అధికార దుర్వినియోగానికి పాల్పడే అవకాశం ఉందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య ఈసీకి లేఖ రాశారు. దీనిపై స్పందించిన ఈసీ.. పోలింగ్ ఏజెంట్లు పోలింగ్ రోజు నేరుగా తమ వివరాలను బూత్ ప్రిసైడింగ్ అధికారికి ఇస్తే చాలని తాజాగా ఆదేశాలు జారీచేసింది. ఆయా వివరాలను ఆర్వోకి ఇవ్వాల్సిన అవసరంలేదని స్పష్టం చేసింది. పోలింగ్ జరిగే రోజు ప్రిసైడింగ్ అధికారికి వివరాలు సమర్పించి నేరుగా విధులకు హాజరు కావచ్చని ఆదేశాల్లో పేర్కొంది. గతంలో చేసినట్లు ఏజెంట్లకు పోలీసు, రిటర్నింగ్ అధికారి వెరిఫికేషన్, ఆమోదం అవసరంలేదని తెలిపింది. పోలీసు కేసులు ఉన్నా ఏజెంట్లుగా పని చేయవచ్చునని పేర్కొంది.

తప్పుల రీ సర్వేతో

ల్యాండ్ టైటిలా?

- 100 ఏళ్లకు సరిపడా చిక్కులు
- అంతా.. రగడ రగడే
- నోటీసులు లేవు.. కొలతలు లేవు
- ఈ రికార్డు ఆధారంగానే టైటిల్
- ఇది అమలైతే రైతుకు కష్టకాలమే

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడింది' అన్న సామెత... ముఖ్యమంత్రి జగన్ ఎంతో గొప్పగా చెబుతున్న భూముల రీ సర్వే, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌కు అతికినట్టు సరిపోతుంది. జగన్ సర్కారు చేపట్టిన భూముల రీ సర్వేనే ఓ తప్పుల తడక. ఉన్న సమస్యలను పరిష్కరించకపోగా, కొత్త సమస్యలు పుట్టుకొస్తున్నాయి. అలాంటిది... రీ సర్వే ఆధారంగా భూములకు 'టైటిల్' ఇస్తామని చెబుతున్నారు. ఇదే కనుక జరిగితే రైతులకు కొత్త కష్టాలు తప్పవు.

'రాష్ట్రంలో 100ఏళ్ల తర్వాత భూముల సర్వే చేస్తున్నాం. భూ వివాదాలన్నింటిని పరిష్కరిస్తాం. రీ సర్వే ఆధారంగా టైటిల్ ఇస్తాం. భూ వివాదాల పేరిట కోర్టుల చుట్టూ తిరిగే పనిలేకుండా చేస్తాం' అని సీఎం జగన్ చెబుతున్నారు. నిజంగానే ఆయన మాటలు నమ్మొచ్చా? రీ సర్వే అంత గొప్పగా ఉందా? అంటే.. అంతా ఒట్టిమాటే. రీ సర్వే చేయాలన్న ఆలోచన మంచిదేమో కానీ, చేపట్టిన తీరే అశాస్త్రీయంగా ఉంది. అమలు చేస్తున్న తీరు మేడిపండు చందంలా ఉంది. వివాదాల పరిష్కారం కోసం చేపట్టిన సర్వేతో కొత్త సమస్యలు వస్తున్నాయి. సర్వే చేసిన గ్రామాల్లో వివాదాలు, భూముల విస్తీర్ణంలో భారీ వ్యత్యాసాలు చోటు చేసుకుంటున్నాయి. సెంటు భూమి లేనివారికి ఎకరాల కొద్దీ ఉన్నట్లు, ఎక్కువ విస్తీర్ణంలో భూములున్న వారికి తక్కువగా ఉన్నట్టు రికార్డులో నమోదు చేశారు. ఒరిజినల్ ఆర్ఎస్ఆర్‌కు, రీసర్వే రికార్డుకు పొంతనే ఉండటం లేదు. ఇదేమని బాధిత రైతులు గగ్గోలు పెడితే అప్పీల్ చేసుకోమని అధికారులు చెబుతున్నారు. అప్పీల్ చేసుకుంటే మీ సమస్య పరిష్కారమైపోతుందంటూ తప్పించుకుంటున్నారు. రికార్డు మాత్రం సరిచేయడం లేదు. ఇదే విషయాన్ని జగనన్నకు చెబుదాం, స్పందన, టోల్ ఫ్రీ నంబర్ల ద్వారా ప్రభుత్వానికి ఎన్ని ఫిర్యాదులు చేసినా ఫలితం లేదు. అన్నీ పరిష్కరించామని, రైతులకు ఏ ఇబ్బందీ లేదని చెబుతున్నారు. అదే నిజమైతే రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో కొత్త రికార్డు ఎందుకు బయటపెట్టడం లేదు? గ్రామ సచివాలయాల్లో ఆ రికార్డును ఎందుకు అందుబాటులో ఉంచడం లేదు? భూ వివాదాలు పరిష్కరిస్తామని గొప్పలకు పోయిన సర్కారు సరిదిద్దుకోలేని స్థాయిలో తప్పులు చేసింది. వెయ్యి కోట్ల వ్యయంతో అరచేతిలో వైకుంఠం చూపాలని జగన్ ప్రయత్నిస్తున్నారు. 6వేల గ్రామాల్లో సర్వే పూర్తయిందని, మరోదఫా అధికారం ఇస్తే రీసర్వే పూర్తి చేసి, దాని ఆధారంగా టైటిల్ ఇస్తామని చెబుతున్నారు.

లెక్కల్లో తేడా

రాష్ట్రంలో భూముల సర్వే చేపట్టడానికి ముందు ప్రభుత్వం ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ (పీఓఎల్ఆర్) చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ శాఖ వద్ద ఉన్న భౌతికమైన ఒరిజినల్ ఆర్ఎస్ఆర్ రికార్డుకు, వెబ్‌ల్యాండ్ రికార్డును సరిపోల్చినప్పుడు భారీ తేడాలు వెలుగుచూశాయి.ఒరిజినల్ ఆర్ఎస్ఆర్‌లో 1,30,30,298 సర్వే నంబర్లకు గాను 2,90,92,995.41 ఎకరాలు ఉన్నాయి. అదే వెబ్‌ల్యాండ్ ఆర్ఎస్ఆర్‌లో 1,35,05,283 సర్వే నంబర్లకు గాను 3,40,23,510.19 ఎకరాలున్నట్లు గుర్తించారు. 8,34,609 సర్వే నంబర్ల పరిధిలో 31,23,395 ఎకరాలు సరిపోలడం లేదు. అంటే... ఒరిజినల్ రికార్డులకు, వెబ్‌ల్యాండ్ రికార్డుకు టాలీ కాలేదు. దీన్ని సెటిల్ చేశాకే రీ సర్వే ప్రారంభించాలి. కానీ అలాగే భూముల సర్వే చేశారు. తక్కెళ్లపాడు సర్వేపై విమర్శలు రావడంతో సర్కారు సర్వే ఆఫ్ ఇండియా (ఎస్ఓఐ)ను రంగంలోకి దింపింది. ఆ సంస్థతో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. కార్స్, రోవర్స్, డ్రోన్ టెక్నాలజీ ఆధారంగా రాష్ట్రం అంతా సర్వే చేసేలా ఆ సంస్థతో మాట్లాడుకున్నారు. కేంద్ర సంస్థే సర్వే చేయనుందని తెలియడంతో రైతులు ఊరట పొందారు. అయితే అది కార్యరూపం దాల్చలేదు. ప్రభుత్వ ఒత్తిడితో కేంద్ర సంస్థ పక్కకు తప్పుకొంది. ఆ తర్వాత ప్రభుత్వం రీ సర్వేలో ఏమాత్రం అవగాహన లేని డ్రోన్ కంపెనీలకు టెండర్లు ఇచ్చింది. అవి ఆకాశం నుంచి భూమి ఫొటోలు (ఆర్థోరెక్టిఫైడ్ ఇమేజెస్-ఓఆర్ఐ) తీసి సర్వే అధికారులకు ఇచ్చాయి. వాటి ఆధారంగా సర్వే అధికారులు గ్రామాల వారీగా క్షేత్రస్థాయి సర్వే చేపట్టాలి. ప్రతీ పొలం కొలతలు వేసి, ఒక గ్రామంలో సర్వే పూర్తి చేయడానికి సగటున ఐదారు నెలల సమయం పడుతుంది. కానీ సర్కారు ఒత్తిళ్లతో సిబ్బంది ఓఆర్ఐల ఆధారంగా రైతుల భూములు కొలిచినట్లుగా రికార్డులు తయారు చేశారు. వాటినే రీ సర్వే రికార్డులని చెబుతున్నారు.

సర్వే చట్టం బుట్టదాఖలు

ఆంధ్రప్రదేశ్ సర్వే, సరిహద్దుల చట్టం-1921 ప్రకారం భూముల సర్వే చేపట్టాలి. చట్టంలోని సెక్షన్ 9(1) ప్రకారం భూమిని సర్వే చేయబోతున్నట్లుగా ముందుగా నోటీసు ఇవ్వాలి. ఆ తర్వాత సర్వే పూర్తయ్యాక సెక్షన్ 9(2)కింద నోటీసు ఇవ్వాలి. అందులో రైతు పొలం సర్వే పూర్తయినట్లుగా, ఏమైనా అభ్యంతరాలు ఉన్నాయా? లేవా? అన్నది తెలియజేయాలి. ఎలాంటి అభ్యంతరాలు లేకుంటే, సర్వే విజయవంతంగా పూర్తయినట్లే. ఇలా సర్వే పూర్తయ్యాక 13 నోటిఫికేషన్ ఇస్తారు. అదే ఫైనల్. కానీ చాలా గ్రామాల్లో రైతులకు నోటీసులు ఇవ్వలేదు. వారి అభ్యంతరాలు, విన్నపాలు స్వీకరించలేదు. ఓఆర్ఐ ఆధారంగా చేసిన రికార్డునే అసలైన భూమి రికార్డుగా చూపిస్తున్నారు.

రికార్డుల నిండా తప్పులే

నెల్లూరు జిల్లా నాయుడు పేటలో జనార్దన్‌రావు అనే రైతుకు 6.40 ఎకరాల భూమి ఉంది. రీసర్వే చేశాక ఆయనకు 5.20సెంట్లు ఉన్నట్లు రికార్డు ఇచ్చారు. ఆ రైతు పక్కనే ఉన్న శారదమ్మకు 1.40 సెంట్ల భూమే ఉంది. కానీ ఆమెకు 6.40ఎకరాలున్నట్లు రికార్డు తయారు చేశారు. ఆ ఇద్దరికి ఒకే భూమిని చూపించారు. ఇదే విషయంపై అప్పీల్ చేస్తే ఇంత వరకు సెటిల్ చేయలేదు. ఇదొక మచ్చుతునక మాత్రమే. భూ విస్తీర్ణంలో తప్పులున్నాయని, వెంటనే సమస్య పరిష్కరించాలని కోరుతూ సర్కారుకు గత మూడున్నర సంవత్సరాల కాలంలో 8లక్షల ఫిర్యాదులు వచ్చాయి. జగన్ సర్కారు నిర్వహించిన స్పందనలోనే ఐదున్నర లక్షల ఫిర్యాదులు వచ్చాయి. ఇక జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో 72వేల ఫిర్యాదులు వచ్చాయి. ప్రతీ ఫిర్యాదులో రైతు పేరు, గ్రామం, సమస్య, ఫోన్ నంబరును నమోదు చేశారు. ఇక మండల స్థాయి అప్పీల్స్ అధికారులకు 1.78 లక్షల ఫిర్యాదులు వెళ్లాయి. ఈ విన్నపాలు, ఫిర్యాదులన్నింటిని సర్కారు బుట్టదాఖలు చేసింది. రైతుల సమస్యలన్నీ పరిష్కారం చేసినట్లుగా ఫిర్యాదులను మూసేసింది. ఇదంతా ఆరువేల గ్రామాల్లోనే. ఈ గ్రామాల్లో సర్వే పూర్తి చేసినట్లు ప్రభుత్వం చెబుతోంది కానీ ఆ గ్రామాల్లోని తాజా రెవెన్యూ రికార్డులను బయటపెట్టడం లేదు. సర్వే, సరిహద్దుల చట్టం ప్రకారం సెక్షన్ 13 నోటిఫికేషన్ ఇచ్చాక గ్రామాల వారీగా భూముల రికార్డును రైతులకు అందుబాటులో ఉంచాలి. దానివల్ల ప్రతీ రైతు తన భూమి వివరాలు తెలుసుకోగలగాలి. భూ వివాదాలన్నీ బయటకొస్తాయన్న భయంతో ఆ రికార్డును బయటకు రానివ్వడం లేదని తెలుస్తోంది. ఇదే రికార్డు ఆధారంగా టైటిల్ ఇచ్చేందుకు సర్కారు సిద్ధంగా ఉంది. అదే జరిగితే భూమి విస్తీర్ణంలో తేడాలు పొందిన రైతులకు కష్టకాలమే.

పైలెట్‌లోనే ఫెయిల్

ఉమ్మడి కృష్ణా జిల్లా జగయ్యపేట మండలం తక్కెళ్లపాడు గ్రామంలో పైలెట్ సర్వే చేశారు. రాష్ట్రంలో భూముల రీ సర్వేకు ముందు ఈ గ్రామంలో ప్రయోగాత్మకంగా ఏడాది పాటు సర్వే చేశారు. ఈ గ్రామంలో 1932 నాటి రీ సర్వే రికార్డు ప్రకారం 1539 ఎకరాల భూమి ఉంది. అడంగల్ ప్రకారం 1573.26 ఎకరాల భూమి ఉంది. కానీ తాజాగా రీ సర్వే తర్వాత 1533.56 ఎకరాల భూమి ఉన్నట్లు తేల్చారు. అంటే, ఉన్నదాని కంటే 5.44 ఎకరాల భూమి తగ్గినట్లు లెక్క తేల్చారు. భూమి కొలతల్లో సగటున 2.10 ఎకరాల మేర తేడాలు వచ్చాయి. ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' 2020లోనే వెలుగులోకి తీసుకొచ్చింది. గజం భూమి కూడా తేడా రాకుండా కొలతలు వేస్తారని, ఏ మాత్రం తేడా వచ్చినా తనదే బాధ్యత అంటూ జగన్ తక్కెళ్లపాడు బహిరంగ సభలో చెప్పారు. కానీ పైలెట్‌గా చేపట్టిన గ్రామంలోనే భారీగా తప్పులు వచ్చాయి. భూమి విస్తీర్ణంలో తేడాలు వచ్చాయి. రీ సర్వేలో తగ్గిన 5.44 ఎకరాల భూమి ఎక్కడికి పోయిందో లెక్క తేల్చమంటే సర్కారు నీళ్లు నమిలింది. అయినా దీన్నే విజయవంతమైన ప్రాజెక్టుగా ప్రకటించారు. ఇదే తరహాలో రాష్ట్రం అంతా రీ సర్వే ప్రారంభించారు.

ప్రాజెక్టులు కట్టలేం!

- ఆ లోన్లు రద్దు చేయండి.. కేంద్రానికి జగన్ వినతి
- 3 అత్యవసర మౌలికవసతుల ప్రాజెక్టులను కాలదన్నేసిన వైనం
- తక్కువ వడ్డీకే రుణాలు ఇస్తామన్నా అభివృద్ధిని విస్మరించిన సర్కారు

అమరావతి, మే 10(ఆంధ్రజ్యోతి): సాధారణంగా అభివృద్ధి ప్రాజెక్టులు, రుణాలు మంజూరు చేయాలని రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతుంటాయి. ఆర్థిక సాయం చేయాలని ఢిల్లీ చుట్టూ తిరుగుతుంటాయి. అయితే జగన్ సర్కారు ఈ విషయంలో కూడా 'రివర్స్'. ప్రజలకు అత్యవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కేంద్రం ఎంపిక చేసిన మూడు కీలక ప్రాజెక్టులను, వీటికోసం తక్కువ వడ్డీతో అంతర్జాతీయ సంస్థలు ఇచ్చే లోన్లను కాలదన్నుకుంది. ఈ ప్రాజెక్టులు కట్టలేమని, లోన్లు రద్దు చేయాలని కేంద్రాన్ని ముఖ్యమంత్రి జగన్ కోరారు. దీంతో కేంద్రం ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్ అర్బన్ వాటర్ సప్లై, ఆంధ్రప్రదేశ్ రోడ్స్ బ్రిడ్జెస్ రీకన్‌స్ట్రక్షన్, ఆంధ్రప్రదేశ్ మండల్ కనెక్టివిటీ అండ్ రూరల్ కనెక్టివిటీ ప్రాజెక్టులను జగన్ నీరుగార్చారు. పట్టణ ప్రజలకు తాగునీటి కల్పనకు, గ్రామీణ ప్రాంతాలను అనుసంధానం చేసే రోడ్లు, వంతెనల నిర్మాణానికి ఈ ప్రాజెక్టులు ఎంతో కీలకం. ప్రజలకు తప్పనిసరిగా మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన ఈ మూడు ప్రాజెక్టులను జగన్ చాలా తేలిగ్గా తీసుకున్నారు.

కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అత్యవసరమైన మౌలిక సదుపాయాలు మెరుగుపర్చేందుకు కొన్ని రాష్ట్రాలను ఎంపిక చేస్తుంది. ఆయా రాష్ట్రాల అధికారులు, ఎంపీలతో పాటు సీఎం కూడా తమ రాష్ట్రానికి అవసరమైన ప్రాజెక్టులకు ఈఏపీ లోన్ ఇప్పించాల్సిందిగా కేంద్రం వద్ద లాబీయింగ్ చేస్తుంటారు. ఈఏపీ లోన్లు అతి తక్కువ వడ్డీకే లభిస్తాయి. ఓరకంగా ఈఏపీ ప్రాజెక్టులు మంజూరు కావడమే అదృష్టం. అందుకే వీటి కోసం రాష్ట్రాల మధ్య పోటీ ఎక్కువగా ఉంటుంది. ఇంత పోటీని తట్టుకుని ఈ 3 ప్రాజెక్టులు రాష్ట్రానికి రాగా, జగన్ వాటిని కాలదన్నేశారు. ఇందులో అర్బన్ వాటర్ సప్లై ప్రాజెక్టు చంద్రబాబు హయాంలో రాష్ట్రానికి మంజూరైంది. మిగిలిన 2 ప్రాజెక్టుల కోసం చంద్రబాబు హయాం నుంచి చేస్తున్న ప్రయత్నాలు ఫలించి జగన్ అధికారంలోకి వచ్చాక మంజూరయ్యాయి. వీటికి 2021 జూన్‌లో ఒప్పందాలు చేసుకున్నారు.

ఆంధ్రప్రదేశ్ అర్బన్ వాటర్ సప్లై ప్రాజెక్టుకు ఏఐఐబీ నిధులు సమకూర్చేది. అయితే పట్టణ ప్రజలకు తాగునీరే అవసరం లేదన్నట్టుగా జగన్ సర్కారు తిరస్కరించింది. ఇక ఆంధ్రప్రదేశ్ రోడ్స్, బ్రిడ్జెస్ రీకన్‌స్ట్రక్షన్ ప్రాజెక్టుకు ఎన్‌డీబీ రుణం ఇచ్చేది. అయితే.. 'మా రాష్ట్ర ప్రజలకు ఐదేళ్ల నుంచి గుంతల రోడ్లు అలవాటైపోయాయి. పైగా గుంతల రోడ్ల కోసమే సెస్ కూడా వసూలు చేస్తున్నాం. ఈ ప్రాజెక్టు మాకొద్దు' అని జగన్ సర్కారు అనుకున్నట్టుంది. ఇక మూడోది ఆంధ్రప్రదేశ్ మండల్ కనెక్టివిటీ అండ్ రూరల్ కనెక్టివిటీ ప్రాజెక్టు. దీనికి కూడా ఎన్‌డీబీనే రుణం ఇచ్చేది. మండలాలకు, గ్రామీణ ప్రాంతాలకు కనెక్టివిటీ రోడ్లు అవసరం లేన్నట్లుగా, ఏదో ఒక పథకం పేరు చెప్పి కొంత డబ్బు ఖాతాలో వేస్తే చాలని జగన్ సర్కారు దీన్ని కూడా వద్దనుకుంది. రాష్ట్రవ్యాప్తంగా అధికార యంత్రాంగానికి లోటు లేదు. అవసరమైన నిపుణులకు కొదవ లేదు. అన్నింటికంటే అతి ముఖ్యమైనది ప్రాజెక్టుకు డబ్బు. వాటిని అతి తక్కువ వడ్డీకి ఇవ్వడానికి అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు సిద్ధంగా ఉన్నాయి. మరి ఈ ప్రాజెక్టులు కట్టడానికి ఇంకేంటి సమస్య? ఈ ప్రాజెక్టులు కడితే రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుంది. అయితే రాష్ట్రం అభివృద్ధి చెందడం జగన్‌కి ఇష్టం లేన్నట్టుగా ఉంది.

వైసీపీదైతే వదిలేయ్!

ఏంటి బాసూ ఇది!

ఎన్నికల వేళ ఓటర్లను ప్రలోభాలకు గురిచేయకుండా కాపు కాయాల్సిన పోలీసులే దారి తప్పుతున్నారు. అధికార పక్షానికి అన్ని విధాలా సహకరిస్తున్నారు. మద్యం అక్రమ రవాణాను అరికట్టాల్సిన అధికారులు పక్షపాత వైఖరిని ప్రదర్శిస్తున్నారు. వైసీపీ నేతల అక్రమాలపై చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. క్షేత్రస్థాయిలో నిక్కచ్చిగా పనిచేస్తున్న అధికారులపైనా పైనుంచి 'బాసు'లు ఒత్తిడి తెచ్చి అనుకూల వైఖరిని ప్రదర్శిస్తున్నారు. కోడ్ నిబంధనలను సైతం తుంగలో తొక్కుతున్నారు.

అడ్డదారులు ఎన్నెన్నో!

- కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ఆలమూరులో వైసీపీ నేతలు పంపిణీకి సిద్ధం చేసిన మద్యం పట్టుబడింది. ఆ తర్వాత ఏమైందో ఎవరికీ తెలీదు.
- అనకాపల్లి జిల్లాలో ఎలమంచిలి వైసీపీ నేత ఓటర్లకు పంచేందుకు తెప్పించిన పొరుగు మద్యం కూడా పట్టుబడింది. కానీ, తర్వాత మాయమైంది.
- వైసీపీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న రాజోలులో 1200 కేసుల గోవా మద్యం పట్టుబడితే కనీసం ఫొటో కూడా బయటకు రాలేదు. ఎందుకంటే గుట్టుచప్పుడు కాకుండా మాయచేశారు.
- రాయలసీమలో పట్టుబడుతున్న అక్రమ మద్యంలో అరకొర చూపించడం మిగతాది మాయం చేయడం సర్వసాధారణంగా మారిందని కొందరు పోలీసులు గుసగుసలాడుతున్నారు.
- చంద్రగిరి నియోజక వర్గ పరిధిలోని ఓ గ్రామ సర్పంచ్ గోవా మద్యాన్ని భారీగా తెప్పించి పంచాయితీ భవనంలోనే డంప్ చేశారు. ప్రచారానికి వచ్చే మందుబాబులకు రోజూ పంచుతున్నారు. అయినా, పోలీసులు పట్టించుకోవడం లేదు. చివరికి టీడీపీ నేతలు ఫిర్యాదు చేసి రచ్చ చేయడంతో నాలుగైదు బాక్సుల మద్యం సీజ్ చేసి మమ అనిపించేశారు.
- పోలింగ్ పూర్తయ్యే వరకు రోజూ మూడు ట్రక్కుల గోవా మద్యం తెప్పించేందుకు చిత్తూరు జిల్లాకు చెందిన ముగ్గురు లిక్కర్ డాన్‌లతో వైసీపీ ఒప్పందం చేసుకున్నట్టు తెలిసింది. ఈ వ్యవహారంపై పోలీసుల్లోనూ చర్చసాగుతోంది.

- అక్రమ మద్యంపై అధికారుల తీరు
- జిల్లాల్లో పోలీసులకు బాస్‌ల నుంచి ఫోన్లు
- ఆ.. రెడ్డితో నీకేంటయ్యా? ఓ అధికారికి తలంటు
- సీమ రెడ్డి సరుకు.. పట్టుకునే ముందు చూసుకోరా?
- గోదావరి జిల్లాల్లో ఇద్దరు అధికారులకు చీవాట్లు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



'ఆ.. రెడ్డితో నీకేంటయ్యా గొడవ' ఒక సీనియర్ ఐపీఎస్ అధికారి నుంచి ప్రకాశం జిల్లాలోని ఒక పోలీసు అధికారికి వచ్చిన ఫోను ఎత్తగానే వినిపించిన మాట ఇది. 'అయ్యో.. ఆయనతో నాకేం ఉంటుంది సర్' అంటూ భయం భయంగా బదులిచ్చారు ఆ అధికారి. 'సమాచారం ఏదైనా వస్తే సెర్ట్(తనిఖీలు)కు వెళ్లే ముందు వెనకున్నది ఎవరో తెలుసుకో.. ఎస్ఐ నుంచి పైకి వచ్చావ్‌గా.. డిపార్ట్‌మెంట్‌లో ఇన్నేళ్లు పనిచేశాక కూడా ఏది ఎలా చేయాలో తెలుసుకోక పోతే ఎలా?' అంటూ ఆ అధికారి ఫోన్ పెట్టేశారు. ఆ షాక్ నుంచి అధికారి తేరుకునేలోపు మరో పెద్ద ఐపీఎస్ నుంచి ఫోన్ వచ్చింది. 'తలకాయలేని పనులు చేయమాకండయ్యా.. అదేదో సరుకు పట్టుకున్నావటగా..' అంటూ ఉన్నతాధికారి ప్రశ్నించగా.. 'అదెవరిదో సెర్ట్‌కు వెళ్లే ముందు మాకు తెలీదు సర్. సమాచారం రాగనే వెళ్లాం. ఎన్నికల టైమ్‌లో నిక్కచ్చిగా ఉండమని తమరు చెప్పారు కదా సర్. అందుకే ఎవ్వరికీ చెప్పకుండా వెళ్లాం సర్' అంటూ కొంత ధైర్యం తెచ్చుకుని సమాధానం ఇచ్చాడు. 'మంచిదే కానీ నా దాకా ఫోన్లు వస్తున్నాయంటే చూసుకోండి.. జాగ్రత్త' అంటూ పెద్ద సార్ ఫోను పెట్టేశారు. ఇద్దరు ఉద్దండుల్లాంటి అధికారులు ఫోన్లు చేయడంతో భయపడిన జిల్లా అధికారి.. అధికార పార్టీ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థికి ఫోను చేసి.. 'మాకు సమాచారం వచ్చినప్పుడు మీదని తెలీదు' అని చెబుతుండగానే.. 'మాకు తెలుసులే అన్నా మీరు పక్కా సమాచారంతోనే పట్టుకున్నారని.. మీరేం చేస్తున్నారో అంతా తెలుసు' అని ఫోన్ కట్ చేశారు. ఈ వ్యవహారం రెండు రోజుల్లోనే రాష్ట్రమంతా వ్యాపించడంతో క్షేత్రస్థాయి అధికారుల్లో భయం పట్టుకుంది. రాష్ట్రంలో ఎక్కడికక్కడ అధికార పార్టీకి చెందిన అక్రమ మద్యం సీజ్ చేయడం బాగా తగ్గిపోయింది. ఒకటి రెండు చోట్ల ఏదో పట్టుకున్నట్లు చూపించేందుకు కేసు పెట్టినా.. పట్టుబడ్డ లిక్కర్ ఆ తర్వాత ఏమవుతోందన్నది ప్రశ్నార్థకం. ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ అధికారులతో లెటర్ తీసుకుని ఈసీకి సమర్పిస్తున్నామని అధికారులు పైకి చెబుతున్నారు. కానీ, ఈ విషయంలోనూ విపక్షాల సరుకైతే ఒకలా.. అధికార పక్షానిదైతే మరో విధంగా పనికానిస్తున్నారు.

ఇదీ తీరు!

గన్నవరంలో ప్రతిపక్ష పార్టీకి చెందినదిగా పోలీసులు వెల్లడించిన మద్యం బాటిళ్లను కలెక్టరు, జిల్లా ఎస్పీ సమక్షంలో ధ్వంసం చేశారు. ఫొటోలు, వీడియోలు మీడియాకు విడుదల చేశారు. కానీ, ఇతర ప్రాంతాల్లో వైసీపీ నేతలు పంపిణీ చేసేందుకు సిద్ధం చేసుకున్న మద్యాన్ని మాత్రం ఇలా ధ్వంసం చేయడం లేదు. ఈ విషయంపై పోలీసులు ఎవరూ స్పందించడమే లేదు. ఇక, రాష్ట్రంలో ఎన్నికల సందర్భంగా పట్టుబడుతున్న అక్రమ మద్యం కేసుల్లో పోలీసు, సెబ్ అధికారులు వ్యవహరించిన తీరు గమనిస్తే.. ఏకపక్షం అనడం కన్నా సహకారం, ఉపకారం అనొచ్చు. ఇక, సీఎం జగన్ పాల్గొంటున్న సభలు, రోడ్ షోలకు జనం రాకపోవడంతో దిక్కుతోచని నేతలు జనాలను తరలించేందుకు రూ.500, బిర్యానీ పొట్లం ఆఫర్ చేస్తున్నారు. పురుషులైతే మద్యం బాటిల్ కూడా ఇస్తున్నారు. దీంతో వైసీపీలోని కొందరు ముఖ్య నేతలు ఈ మద్యం సరఫరా కాంట్రాక్టు తీసుకున్నారు. గోవా నుంచి తీసుకొచ్చి రాష్ట్రంలో ఎక్కడెక్కడ అవసరమో అక్కడికి చేరవేస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులకు ఫిర్యాదులు అందుతున్నా 'పెద్దగా' పట్టించుకోవడం లేదు. ఒకటో అరో పట్టుకున్నట్టు మీడియాకు సమాచారం ఇచ్చి ఫొటోలు దిగేసిన తర్వాత సరుకు మాయం చేస్తున్నారు.

పిఠాపురంలో గోవా మద్యం

పిఠాపురం నియోజకవర్గంలో జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌ను ఎలాగైనా ఓడించేందుకు సీఎం జగన్ కంకణం కట్టుకున్నారు. ఈ క్రమంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ మండలానికో మంత్రిని రంగంలో దింపారు. రాయల సీమలో తనకు దగ్గరగా ఉండే ఒక ఎంపీకి బాధ్యతలు అప్పగించారు. దీంతో జగన్ కళ్లలో ఆనందం కోసం.. సదరు నేత గోవా నుంచి మద్యం తెప్పించి ఒక్క పిఠాపురమే కాకుండా ఉభయగోదావరి జిల్లాల్లోని వైసీపీ అభ్యర్థులకు కూడా సరఫరా చేస్తున్నారు. ఈ వ్యవహారంపై ఎప్పటికప్పుడు పోలీసులకు సమాచారం అందుతూనే ఉంది. అయినా కొన్ని రోజులు పోలీసులు ఈ వ్యవహారాన్ని పట్టించుకోలేదు. మీడియాలో విస్తృతంగా కథనాలు రావడంతో ఎట్టకేలకు కదిలిన పోలీసులు పిఠాపురంలో దాచిన గోవా మద్యాన్ని పట్టుకున్నారు. అయితే, తర్వాత దానిని మాయం చేశారు. అలా ఎందుకు చేశారని ఆరా తీస్తే.. ఆ మద్యం పట్టుకున్న పోలీసులు, సెబ్ అధికారులకు పైనుంచి 'క్లాసు తీసుకున్నట్టు' తెలిసింది. 'అది సీమ రెడ్డి సరుకు.. పట్టుకునే ముందు చూసుకోరా? ఏదో ఫోన్ వస్తే చాలు వెళ్లి పట్టుకోవడమేనా? తప్పదని పిస్తే ముందే సమాచారం లీక్ చేసి సోదాలకు వెళ్లాలి' అంటూ చీవాట్లు పెట్టడంతో మాకేంటీ బాధ అంటూ క్షేత్రస్థాయి అధికారులు వాపోతున్నారు. చివరికి అదే రెడ్డిగారి వద్ద కెళ్లి 'మా పైఅధికారులకు చెప్పొద్దు సార్. ఏదో ఒకటి చేస్తాం' అని బతిమాలుకుని మద్యం వెనక్కిచ్చేశారు. ఈసీకి మాత్రం 'ధ్వంసం' చేసినట్లు ఎక్సైజ్ అధికారితో ఆథరైజేషన్ తీసుకుని సమర్పించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయంలో కీలకంగా వ్యవహరించిన ఓ అధికారి తన ఆప్తమిత్రుడికి ఫోనుచేసి 'ఆ లింకు పట్టుకుని ముందుకు వెళ్తే భారీడంప్ దొరికేది. లారీలకు లారీల సరుకు పట్టుబడేది. ముందుకు వెళ్లలేకపోయాం' అని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రాతినిధ్యం కోసం వామపక్షాల పాట్లు

- ప్రచారంలో చెమటోడుస్తున్న కామ్రేడ్లు
- హోరాహోరీ పోరులో ఉనికి దక్కేనా?

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

రాజకీయంగా ఉనికిని కాపాడుకోవడంతోపాటు చట్టసభల్లో ప్రాతినిధ్యం కోసం వామపక్షాలు గట్టిగానే పోరాడుతున్నాయి. ఒకప్పుడు ఉమ్మడి రాష్ట్రంలో తమ బలం, బలగాన్ని ప్రదర్శించి, చట్టసభల్లోనూ వాణి వినిపించిన కమ్యూనిస్టు పార్టీలు విభజిత ఆంధ్రప్రదేశ్‌లోనూ ప్రజా సమస్యలపై పోరాటాలను కొనసాగిస్తున్నాయి. అయితే రాజకీయంగా వాటి ప్రభావం కనిపించడం లేదు. గత (2019) ఎన్నికల్లో జనసేనతో పొత్తు పెట్టుకుని చెరో రెండేసి పార్లమెంటు, ఏడేసి అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసిన సీపీఐ, సీపీఎం ఒక్క స్థానంలో కూడా గెలవలేకపోయాయి. ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తులో భాగంగా తమకు లభించిన చెరొక పార్లమెంటు, ఎనిమిదేసి అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తున్న లెఫ్ట్ పార్టీలు తమ ఉనికి చాటుకునేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాయి. ఉభయ కమ్యూనిస్టు పార్టీలు ఎంపిక చేసుకున్న స్థానాలకు అభ్యర్థుల ఎంపికలో కూడా లోతైన పరిశీలనలు చేశాయి. ఎన్నికల ప్రచారంలో కూడా వామపక్ష ఐక్యతను ప్రదర్శిస్తూ ఉభయ కమ్యూనిస్టు పార్టీల రాష్ట్ర నేతలు తమ అభ్యర్థుల తరఫున ఉమ్మడిగా ప్రచారం నిర్వహిస్తూ గెలుపు కోసం చెమటోడుస్తున్నారు. సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మూడు రోజులపాటు రాష్ట్రంలో తమ పార్టీ అభ్యర్థుల తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ, ప్రధాన కార్యదర్శి డీ రాజా కూడా ఇండియా కూటమి అభ్యర్థుల తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

సీపీఎం వ్యూహాలు ఫలిస్తాయా?

గత ఎన్నికల్లో జనసేనతో పొత్తులో భాగంగా కర్నూలు, నెల్లూరు పార్లమెంటు స్థానాలతోపాటు కురుపాం, అరకు, రంపచోడవరం, ఉండి, విజయవాడ సెంట్రల్, సంతనూతలపాడు, కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సీపీఎం పోటీ చేసినప్పటికీ ఒక్క స్థానంలో కూడా గెలవలేకపోయింది. అయినప్పటికీ ఈసారి ఎన్నికల్లో కూడా కాంగ్రెస్‌తో పొత్తులో భాగంగా దాదాపుగా మళ్లీ అవే స్థానాల కోసం పట్టుబట్టింది. కాంగ్రెస్‌తో పలు దఫాలుగా జరిగిన చర్చల్లో చివరకు అరకు పార్లమెంటు స్థానంతోపాటు రంపచోడవరం, కురుపాం, గాజువాక, గన్నవరం, విజయవాడ సెంట్రల్, మంగళగిరి, నెల్లూరు టౌన్, పాణ్యం అసెంబ్లీ స్థానాలను సీపీఎం దక్కించుకుంది. అరకు పార్లమెంటు స్థానంలో పీ అప్పలనర్సను అభ్యర్థిగా రంగంలోకి దింపింది. తూర్పుగోదావరి జిల్లా రంపచోడవరం అసెంబ్లీ స్థానం నుంచి లోతా రామారావు, విజయనగరం జిల్లా కురుపాం నుంచి మండంగి రమణ, విశాఖపట్నం జిల్లా గాజువాకలో ఎం.జగ్గునాయుడు, కృష్ణా జిల్లా గన్నవరంలో కే వెంకటేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో చిగురుపాటి బాబూరావు, గుంటూరు జిల్లా మంగళగిరిలో జొన్నా శివశంకర్, నెల్లూరు పట్టణ నియోజకవర్గంలో మూలం రమేశ్, కర్నూలు జిల్లా పాణ్యం నియోజకవర్గం నుంచి గౌస్ దేశాయ్‌లను అభ్యర్థులుగా రంగంలోకి దించింది. వీటిలో అరకు పార్లమెంటు స్థానం, రంపచోడవరం, కురుపాం అసెంబ్లీ నియోజకవర్గాలు ఎస్టీ రిజర్వ్‌డ్ కేటగిరీలో ఉన్నాయి. గత ఎన్నికల్లో రంపచోడవరం నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే సున్నం రాజయ్య పోటీ చేయగా... ఆ ఎన్నికల్లో సీపీఎంకు 10,344 ఓట్లు వచ్చాయి. కురుపాంలో 8,551, అరకులో 10,313, విజయవాడ సెంట్రల్‌లో 25,620 చొప్పున సీపీఎంకు ఓట్లు పోలయ్యాయి. ఈసారి పోటీ చేస్తున్న నియోజకవర్గాలపై సీపీఎం ప్రత్యేక దృష్టి సారించి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది.

సీపీఐ పోటీ ఇస్తుందా?

పొత్తులో భాగంగా గుంటూరు పార్లమెంటు స్థానంతోపాటు విశాఖ పశ్చిమ, ఏలూరు, విజయవాడ పశ్చిమ, అనంతపురం అర్బన్, తిరుపతి, రాజంపేట, పత్తికొండ, కమలాపురం అసెంబ్లీ నియోజకవర్గాల్లో సీపీఐ పోటీ చేస్తోంది. ఈ స్థానాల ఎంపిక అంత ఆశాజనకంగా లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. గుంటూరు పార్లమెంటు స్థానం నుంచి జంగాల అజయ్‌కుమార్‌ను సీపీఐ అభ్యర్థిగా నిలబెట్టింది. అసెంబ్లీ స్థానాల విషయానికొస్తే. విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో అత్తిలి విమల, ఏలూరులో బండి వెంకటేశ్వరరావు, విజయవాడ పశ్చిమలో జీ కోటేశ్వరరావు, అనంతపురం అర్బన్‌లో సీ జాఫర్, తిరుపతిలో పీ మురళి, రాజంపేటలో భూక్యా విశ్వనాథనాయక్, పత్తికొండలో పీ రామచంద్రయ్య, కమలాపురంలో గాలి చంద్రలను అభ్యర్థులుగా రంగంలోకి దించింది. సీపీఐ ఎంచుకున్న దాదాపు అన్ని స్థానాల్లోనూ అధికార వైసీపీ, ఎన్డీఏ కూటమిల నుంచి బలమైన అభ్యర్థులు హోరాహోరీ పోరాడుతున్నారు. ఈ నేపథ్యంలో సీపీఐ అభ్యర్థులు ఏ మేరకు పోటీ ఇస్తారు? అన్నది చూడాల్సిందే.